




రాజ యోగం

విచారణ

పతంజలి యోగశాస్త్రము






సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

నన్ను "నేను" చేరుకోవటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి,అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in),ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in),మైక్రోసాఫ్ట్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంధ వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.


ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2040100047204

SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

PATHAMJALA YOGA SASTRAMU.

ఓం.

పరమాత్మనే నమః.

పాతంజల యోగశాస్త్రము

ఆంధ్ర తాత్పర్య సహితము.

9521

ఇది

ఓ - వై - శ్రీ. దొరసామయ్యచే

భోజవృత్తి ననుసరించి

ఆంధ్రీకరింపఁబడినది.

చెన్నపురి:

అమెరికన్ డైమండు ముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడినది.

1941

దీనివెల] [రూ. 1-0-0.



కీర్తిశేషులు:

వేలూరు - కుప్పుస్వామి మొదలియారు.

ప్రొప్రైటరు.

వెస్టు వార్డు అండు కంపెని,

(వి. డి. ప్రెస్.)

చాకలపేట పోష్టు, మద్రాసు.

పీ ఠి క.

ప్రపంచంబునం గల మానవులలో వివేకజ్ఞులు కొందఱు దుఃఖ సాగర మైన సంసారమునుండి తరింపవలయు నని తలంచెదరు.

అట్టివారికి సాధనముగా మహాత్ము లనేకు లనేక గ్రంథములను రచియించి వానిని పరంపరగా నుపదేశించుటకొఱకే మఠములను శిష్యులను నియమించిరి.

ఆ జ్ఞానసాధనగ్రంథములలో నెల్ల ప్రధానమైనవి యోగగ్రంథములు. ఆ యోగగ్రంథముల కన్నిటికిని మాతృక యనఁదగినదియును, ఆదిశేషాంశ సంభూతు లైన శ్రీమత్పతంజలిమునిప్రణీత మైనదియును అగు ఈ యోగ సూత్రములుమాత్రమే దర్శనగ్రంథమై ప్రకాశించుచున్నది.

ఈ మహాగ్రంథమునకు శ్రీమన్నారాయణాంశసంభూతు లైన శ్రీవేద వ్యాసమునీంద్రులును, వాచస్పతిమిశ్రులును, ఇంకను గొందఱును భాష్య వ్యాఖ్యానటీకాదులు రచియించి యున్నారు. వానిలో నెల్ల శ్రీమద్భోజదేవ వృత్తియొక్కటిమాత్రమే సుబోధమును అనుభవవేద్యము నై యుండుటంజేసి దాని ననుసరించి తెలుఁగున పరివర్తనము గావించినాఁడను.

అయినను, ఈ పాతంజలయోగశాస్త్రమునందు నాలుగుపాదములు కలవు. వానిలో మొదటిపాద మైన యోగపాద మనఁబడు సమాధిపాదము నందు యిఁక చెప్పఁబోవు మూఁడుపాదములలోని ముఖ్యవిషయము లన్నియు సూచింపఁబడియుండుటంబట్టి, ఆ పాదమునకుమాత్రము తక్కినవ్యాఖ్యాతల యొక్క యభిప్రాయములను భోజదేవవృత్తికి తర్వాత చేర్చినాఁడను.

ఇందలి మొదటిదైన యోగ (సమాధి) పాదమునందు యోగలక్షణ స్వరూపసాధనములును, రెండవదైన సాధనపాదమునందు యోగసాధ్యో

పాయములును, మూఁడవ దైన విభూతిపాదమునందు ఐహికాముష్మికాభీష్టార్థసిద్ధిభేదములును, నాలవ దైన కైవల్యపాదమునందు సంశయరహితము క్తిస్వరూపనిర్ణయములును వివరింపఁబడి యున్నవి.

ఈ గ్రంథముయొక్క సారాంశమును "హఠయోగప్రదీపిక" యందు "యోగశాస్త్రసారము" అను పేరితో సుబోధ మగునట్లు ఆంధ్రవచనముగా ప్రకటించి యున్నాఁడను.

ఇది హఠయోగప్రదీపిక, రాజయోగరత్నాకరము, విచారసాగరము, మొదలగు యోగ వేదాంతగ్రంథములలోఁ జెప్పిన విషయములను విస్పష్టము చేసి సంశయములను నివృత్తి గావించి యిష్టార్థసిద్ధిని యొసఁగూర్చును

మఱియు పఠితలకును శ్రోతలకును పరమానందమును బ్రాప్తింపఁ జేయును.

ఈ ప్రసిద్ధ మైన దివ్యగ్రంథమహిమనుగూర్చి ప్రశంసించుటకు సాధ్యముకాదు గాన నింతటితో విరమించుచున్నాఁడను.

ఇట్లు,

ఓ - వై - శ్రీ. దొరసామయ్య.

పాతంజల యోగశాస్త్రము

యోగసూత్ర

విషయసూచిక

౧. యోగపాదము.

PATHAMJALA YOGA SASTRAMU.

ఓమ్.

శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః.

పాతంజల యోగశాస్త్రము

౧. యోగపాదము.

శ్లో. దేహార్ధయోగ శ్శివయో స్స శ్రేయాంసి తనోతు వః
దుష్ప్రాప్య మపి యత్ స్మృత్వా జనః కైవల్య మశ్నుతే.

అవతారిక. సకల పురుషార్థప్రదమైన యోగశాస్త్రము నుపదేశింప నిశ్చయించిన పరమదయాస్వరూపుఁడైన పతంజలీమునీంద్రుఁడు మంగళాచరణ పూర్వకముగా గ్రంథము నుపక్రమించుచున్నారు.—

1. అథ యోగానుశాసనమ్.

తాత్పర్యము. ఇప్పుడు యోగముయొక్క స్వరూపలక్షణము చెప్పఁబడుచున్నది.

విశేషార్థము. అథ శబ్దము మంగళార్థమును, శాస్త్రప్రారంభమును, అధికారప్రాప్త్యనంతరకాలమును సహా సూచించుచున్నది. కావున మంగళాచరణ మూలకముగా అధికారులకు యోగస్వరూపమును, దాని సాధనములును, దానిఫల మగు కైవల్యమును తెలియఁజేయఁ బడుచున్నది. అనఁగా, అధికారులకు నిరతిశయానంద కైవల్యస్వరూపప్రాప్తికై యోగ

లక్షణ స్వరూప భేదోపాయాదులతోఁ గూడిన యీ యోగశాస్త్రము వివరింపఁబడుచున్నది.

అవ. యోగస్వరూపమును నిరూపించుచున్నారు.—

2. యోగశ్చిత్తవృత్తినిరోధః.

తా. అంతఃకరణవృత్తులను నిగ్రహించుటయే యోగ మనబడును.

వి సకల వ్యవహారయోగ్యమైన చిత్తవృత్తుల పరిణామరూపధర్మముల నిగ్రహమే యోగము. నిగ్రహ మనఁగా, చిత్తవృత్తుల లయమునకు కారణమై యుండు అగోచరమైన ప్రయత్నము. (వృత్తులను వెలుపల ప్రసరింపనీయక అంతర్ముఖము లగునట్లు చేసి చిత్తమును లయింపఁజేయుట. ఇదియే యోగము=సమాధి.) చిత్త మనఁగా, నిర్మలమైన సత్త్వగుణముయొక్క పరిణామ మగు అంతఃకరణము. వృత్తి యనఁగా, చిత్తపరిణామరూపము.

చిత్తము పంచావస్థల (భూముల) తోఁ గూడినది. రజోగుణప్రధానమై సుఖదుఃఖాది విషయములందుఁ బ్రవర్తించినదియై మిగుల అస్థిరమై యుండు చిత్తము "క్షిప్తము" ఇది దైత్యదానవులకు గలిగి యుండును తమోగుణప్రధానమై కృత్యాకృత్యవిమర్శనాజ్ఞానవివేచన లేక క్రోధాది కార్యములయందుఁ బ్రవర్తించిన చిత్తము "మూఢము". ఇది పిశాచ రాక్షసులకు కలిగియుండును. సత్త్వగుణాధిక్యమై భోగసాధనాదులయందు ప్రవర్తించిన చిత్తము. "విక్షిప్తము". ఇది దేవతలకుఁ గలిగియుండును. బాహ్యమునకు ప్రసరింపని చిత్తము ఏకాగ్రము. వృత్తులును సంస్కారములును లేని చిత్తము నిరుద్ధము. ఏకాగ్రనిరుద్ధ చిత్తములు రెండుమాత్రమే సమాధిని పొందనర్హములు.

అవ సమాధి కాలమునందలి ఆత్మయొక్క స్వరూపమును బోధించుచున్నారు.—

3. తదా ద్రష్టుః స్వరూపే ఽవస్థానమ్.

తా. చిత్తవృత్తులు నిగ్రహమై యుండు (యోగావస్థయం దుండు) కాలమునందు చిన్మాత్రుఁడైన పురుషుఁడు నిజస్వరూపమునందుండుట సంభవించుచున్నది.

వి. పురుషునకు జ్ఞానమే స్వరూపము, బుద్ధి యనెడు వస్తువునందు జ్ఞానము సంక్రమించెకేని బుద్ధికర్తృత్వము పనులను చేయును. పురుషుఁడెప్పుడును సుస్ఫురితియందుఁ జిక్కనివాఁడు పురుషుఁడు, ప్రకృతి అను నీ రెండును వేర్వేఱు లను జ్ఞానము కలిగెనేని జ్ఞానము బుద్ధియందు సంక్రమింపదు. సంక్రమించినమీఁద 'తా' ననెడు అభిమానము పోవును. అప్పైన బుద్ధివికారములు పోవును. తర్వాత ఆత్మ నిజస్వరూపమున నుండును.

అవ. బహిర్ముఖకాలమునందలి ఆత్మస్వరూపము నుపదేశించుచున్నారు.—

4. వృత్తిసారూప్య మితరత్ర.

తా. సమాధివలన బహిర్ముఖమైన (యోగములేని దశయం దుండు) కాలమునందు ఆత్మ వృత్తులయొక్క సమానస్వరూపమును బొంది యుండును.

వి. యోగములేని దశ వ్యుత్థానదశ. అట్టి కాలమున వృత్తులు కలుగును. చిత్తము గుణపరిణామభేదముచే అంతఃకరణములయందును, ఇంద్రియములద్వారా వెలుపల నానా విషయములయందును ప్రవర్తించును. అప్పుడు చిన్మాత్రుఁడైన పురుషుఁడు ఆ చిత్తమువంటి ఆకారముగలవాఁడుగా భావింపఁబడును. అనఁగా దుఃఖ మోహ (అజ్ఞాన) సుఖరూపములుగా వృత్తులు కలిగినవెంటనే పురుషుఁడు ఆ దుఃఖాదులే స్వరూపముగాఁ గలవాఁడుగా వ్యవహరింపఁబడును. ఎట్లనఁగా. చంద్రుడు కదలుచుండు నీటియలలయందు కనఁబడునప్పుడు ఆ చంద్రుఁడు యేప్రకారముగా అలలవలె కదలుచుండునట్లు తోఁచుచున్నాఁడో, అట్లే చిన్మాత్రుఁడైన పురుషుఁడు భావింపఁబడుచున్నాఁడు.

అవ. చిత్తవృత్తులను గుఱించియు, తద్భేదములను గుఱించియు చెప్పుచున్నారు.—

5. వృత్తయః పఞ్చతయ్యః క్లిష్టాఽక్లిష్టాః.

తా. క్లేశములు కలవియు, క్లేశములు లేనివియు నగు చిత్తవృత్తులయిదు విధములు.

వి. వృత్తులనఁగా, చిత్తపరిణామ విశేషములు. క్లేశములకు (దుఃఖములకు) కారణములై యుండునవి క్లిష్టములు. అక్లేశములకు (సుఖములకు) కారణములై యుండునవి అక్లిష్టములు. వీనిని గుఱించి విశేషముగా సాధనపాదము మూఁడవసూత్రమునందు వివరింపఁబడును.

అవ. చిత్తవృత్తివిభాగమును జెప్పుచున్నారు.—

6. ప్రమాణ విపర్యయ వికల్ప నిద్రా స్మృతయః.

తా. వృత్తులు ప్రమాణవృత్తి, విపర్యయవృత్తి, వికల్పవృత్తి, నిద్రావృత్తి, స్మృతివృత్తి, అని యైదువిధములు.

వి. ఇచ్చటఁ గొందఱకు స్వప్నవృత్తిని చెప్పలేదని శంకపొడమును. స్మృతివృత్తిలో స్వప్నవృత్తి చేరి యున్నదని గ్రహింపవలయును. వృత్తి యనఁగా, చెఱువులోని నీళ్లు తూమునుండి చౌకముగను త్రికోణముగ నుండు మళ్లపాదులయందు పాఱినప్పుడు, ఏలాగు ఆయాయాకారములు గలవిగా నిలిచియుండునో, అట్లే తేజోరూపమైన అంతఃకరణము చక్షురాదీంద్రియములద్వారా ఘటాదివిషయములయందు ప్రసరించి ఆ ఘటాద్యాకారములుగా పరిణమించును. అదియే వృత్తి యనఁబడును. 12-వ సూత్రముయొక్క విశేషార్థమును జూడుఁడు.

అవ. ప్రమాణవృత్తి స్వరూపమును నిరూపించుచున్నారు.—

7. ప్రత్యక్షానుమానాగమాః ప్రమాణాని.

తా. ప్రత్యక్షము, అనుమానము, ఆగమము (శబ్దము) అని ప్రమాణములు మూఁడువిధములు.

వి. ఇతరప్రమాణముల సహాయము లేకయే మొదట తెలియఁజేయఁ బడునట్టియు, విషయాకారమై పరిణమించునట్టియు, చిత్తవృత్తి ప్రత్యక్ష ప్రమాణ మనంబడును. అనఁగా, ఇంద్రియములద్వారా వెలుపలివస్తువులతో సంబంధించుటచేత కలుగు విశేషములను నిశ్చయించుటయే ప్రత్యక్షము. ఇదియే ప్రధానమైన వృత్తి.

ప్రత్యక్షమూలకముగా నూహించుటకు కారణమైన వస్తువుయొక్క ఆకారమై పరిణమించు చిత్తవృత్తి అనుమానప్రమాణ మనంబడును. అనఁగా, ఒక్క గుఱుతునుబట్టి దానితో సంబంధించియున్న వస్తువును నూహించుట అనుమానము. ఈ గుఱుతు "లింగ" మనంబడును, ఊహింపవలసినది "లింగి" యనంబడును. ఎట్లన:—

పర్వతముమీఁద పొగ కనఁబడినది. ఆ పొగయే లింగ మనఁబడును. ఊహించునట్టి అగ్నియే లింగి యనఁబడును.

యోగ్యవాక్యముచేతను, నిశ్చయమును చెప్పెడువాని మాటచేతను, శ్రుతిస్మృత్యాది ప్రమాణములచేతను దెలిసిన చిత్తవృత్తి ఆగమ (శాబ్ద) ప్రమాణ మనఁబడును.

ప్రమాణ మనఁగా, బాధింపఁబడని జ్ఞానము, ఎట్లన, వెండిని చూచిన మీఁద వెండియే యనుట ప్రమాణము. ఇది యేకాలమునఁగాని బోధింపఁబడదు. ముత్తెపుచిప్పను చూచి వెండి యనుట అప్రమాణము. ఇది ఉత్తరకాలమున బోధింపఁబడును. మఱికొందఱు ఉపమానాదిప్రమాణముల నీశాస్త్రమునందు తెలియఁజేయలే దని భ్రమింతురు. ప్రత్యక్షప్రమాణములలోఁ జేరి యుండుటచే వేఱుగాఁ జెప్పలే దని తెలియఁదగినది.

అవ. విపర్యయవృత్తిలక్షణమును బోధించుచున్నారు.

౮. విపర్యయో మిథ్యాజ్ఞాన మతద్రూప ప్రతిష్ఠమ్.

తా. లేకయుండు వస్తువుయొక్క రూపమునందు ఆ వస్తువు ఉన్నదనెడు మిథ్యాజ్ఞానము విపర్యయవృత్తి యనఁబడును.

వి. ముత్తెపుచిప్పను చూచి వెండి యనుకొనుట విపర్యయము- అనఁగా, తాను తెలిసికొనిన రూపమునందు, తాను అనుకొన్న ప్రకారము లేకపోయినను, తా ననుకొన్నట్లున్నదని యెంచుకొనునట్టి మిథ్యాజ్ఞానమే విపర్యయవృత్తి. మఱియు నిట్లే కంబమును చూచి ఇది కంబమా మనుష్యుఁడా యని కలిగెడు సంశయజ్ఞానముకూడ విపర్యయ మనఁబడును.

అవ. వికల్పవృత్తి లక్షణము నుపదేశించుచున్నారు.—

9. శబ్దజ్ఞానానుపాతీ వస్తుశూన్యో వికల్పః.

తా. శబ్దమువలనఁ గలిగిన అర్థజ్ఞానముచేత అనుసరింపఁబడినప్పటికిని వస్తువుమాత్రము లేక యుండునది వికల్పవృత్తి యనఁబడును.

వి. విషయము నపేక్షింపక శబ్దజ్ఞానము (అర్థజ్ఞానము) ననుసరించి కలుగుట వికల్పము.

శబ్దజ్ఞానమునకు విషయమై యుండు వస్తువు సంపూర్ణముగా లేక యుండినను, ఆవస్తువు సంపూర్ణమై యున్నదనెడు జ్ఞానము వికల్పజ్ఞానము. ఎట్లన :—

దేవదత్తునియొక్క కంబళి, రాహువుయొక్క శిరస్సు పురుషుని యొక్క చైతన్యము, అనునవి మొదలగునవి. దేవదత్తునియొక్క కంబళి అను నప్పుడు దేవదత్తుఁడు వేఱు, కంబళివేఱు అని భేదమును తెలియఁజేయును. రాహువుయొక్క శిరస్సు అనునప్పుడు తన ఆకారమంతయు శిరస్సుమాత్రమే అయియుండు రాహువునకు వేఱే శరీరము కల దనెడి జ్ఞానము పుట్టుచున్నది. పురుషునియొక్క చైతన్యము (తెలివి) అనునప్పుడు పురుషుఁడు వేఱు, * తెలివివేఱు అని భేదమును తెలియఁజేయును. ఇదియే వికల్పజ్ఞానము.

* వస్తుస్థితినిబట్టి పురుషుఁడే తెలివిగాని, పురుషునకును తెలివికిని భేదము లేదు. ఇక్కడ శబ్దప్రయోగము ననుసరించి భేదము కలిగిన దని యూహించుకొనునది.

అవ. నిద్రావృత్తిలక్షణమును జెప్పుచున్నారు.—

10. అభావప్రత్యయాలమ్బనావృత్తి ర్నిద్రా.

తా. జాగ్రత్స్వప్నావస్థలు లేని జ్ఞానమును ఆశ్రయించి యుండునది నిద్రావృత్తి యనఁబడును.

వి. విషయజ్ఞానమును అవలంబింపని వృత్తియే నిద్ర. భావ మనఁగా విషయము. ప్రత్యయ మనఁగా జ్ఞానము. విషయము, జ్ఞానము అను నీ రెంటి యం దేదియును లేక చిత్తమునకు కలిగెడు వృత్తియే నిద్ర. అభావమనఁగా జాగ్రత్స్వప్నములు లేకపోవుట. ప్రత్యయ మనఁగా కారణమనియు, ఆలంబన మనఁగా విషయ మనియు నెఱుంగునది.

జాగ్రత్స్వప్నములు లేకపోవుటకు కారణమైన తమోగుణోద్రేకము చేత సమస్త విషయానుభవములను విడిచి యుండు సుషుప్తికాలమే నిద్ర యనఁబడును. 'నేను సుఖముగా నిద్రపోయితి నని నిద్రావస్థను స్మరించుట కలదు. నిద్రపోనియెడల అట్లు స్మరించుటకు అవకాశము కలుగదు. కాఁబట్టి నిద్రకు వృత్తిత్వము సిద్ధించుచున్నది. ఈ నిద్రావృత్తిని యోగమునందు లేకుండఁ జేసికొనవలయును.

అవ. స్మృతివృత్తిని వివరించుచున్నారు.—

11. అనుభూతవిషయాసంప్రమోషః స్మృతిః.

తా. ప్రమాణవృత్తిచే అనుభవింపఁబడిన విషయములు జ్ఞాపకమునకు వచ్చుటయే స్మృతివృత్తి యనఁబడును.

వి. అనాదిగా అనేక జన్మములయందును. ఈ జన్మమునందును ప్రత్యక్ష ప్రమాణములచే అనుభవింపఁబడిన విషయమును చిత్తమునందు వాసనా (సంస్కార) రూపకమై యుండి బుద్ధికి యెదురుగా వచ్చుట (బుద్ధియందు పట్టియుండుట) స్మృతి యగును. అనఁగా మనము ఒక పదార్థమును చూతుము. దానిని చూచినది మొదలు, మఱచిపోవువఱకును అది మన చిత్తమున నాటి

యుండును. ఆ పదార్థమును తలంచినప్పుడు అది జ్ఞప్తికి వచ్చును. ఇదియే స్మృతివృత్తి.

పైన వివరింపఁబడిన పంచవృత్తులలో ప్రమాణము, విపర్యయము, వికల్పము అను మూఁడు వృత్తులను జాగ్రదవస్థ యనఁబడును.

ఈ మూఁడు వృత్తులలోని విషయములు అనుభవబలముచేత చిత్తమందు వాసనారూపకమై యుండి, స్మృతిరూపమై బుద్ధికి గోచరించుట స్వప్నావస్థ యనఁబడును.

ఈ వృత్తులు మూఁడును బుద్ధికి గోచరము కాక యుండుటయే నిద్రావస్థ (సుషుప్త్యవస్థ) యనఁబడును.

(ప్రమాణ వికల్ప నిద్రలను పట్టియుండునది స్మృతి (తలంపు) అని తెలియఁగునది. ఈ స్మృతి ప్రమాణ విపర్యయ వికల్పనిద్రలయొక్క వాసనా రూపమై, జాగ్రత్స్వప్నసుషుప్తు లనెడు మూఁడవస్థలయందు నుండును.

అవ. వృత్తినిరోధమును బోధించుచున్నారు.—

12. అభ్యాసవైరాగ్యాభ్యాం తన్నిరోధః.

తా. అభ్యాస వైరాగ్యములచేత, ఇదివఱకుఁ జెప్పఁబడిన చిత్తవృత్తులను నిగ్రహించుటయే నిరోధ మనఁబడుచున్నది.

వి. అభ్యాస వైరాగ్యములచేత సుఖదుఃఖమోహ రూపమైన ప్రపంచానుభవమును కలుఁగఁజేయు వృత్తులను, ఆవృత్తులకు కారణమైన చిత్తమందు లయము పొందించుటయే చిత్తవృత్తినిరోధ మనఁబడుచున్నది. అభ్యాసముచేత వృత్తులయొక్క విముఖత స్థిరపడును.

వృత్తి యనఁగా, బుద్ధి ఆయా యింద్రియములలో నుండి వెలుపల ప్రసరించుట. ఇట్లు ప్రసరింపనీయక పోయినయెడల వృత్తులు అంతర్ముఖములై తమకు కారణ మగు చిత్తమునందు శక్తి (సూక్ష్మ) రూపముగా నుండును. విషయములయందుండు దోషాదులను కనుఁగొనుటవలన పుట్టెడి

వైరాగ్యముచేత విషయములలోఁ దగులనీయక విముఖత నొందించును. అభ్యాసమువలన చిత్తమును స్థిరముగా నుండునట్లు దృఢీకరింపఁజేయును. కాఁబట్టి చిత్తవృత్తినిరోధము అభ్యాస వైరాగ్యము లను నీ రెంటిచేతనే కలుగు నని తెలియఁ దగినది.

అవ. అభ్యాస స్వరూపమును తెలియఁజేయుచున్నారు.—

13. తత్ర స్థితౌ యత్నోఽభ్యాసః.

తా. చిత్తవృత్తులను లయింపఁజేయుటకును, చిత్తైకాగ్రతను కలుగఁజేయుటకును, ప్రయత్నపడునట్లు చేయుట అభ్యాస మనఁబడును.

వి. ఏవృత్తులును లేని చిత్తము స్థిరముగా నుండుటయే స్థితి. చిత్తము స్థిరముగా నుండుటకై యత్నము చేయుచుండుటయే అభ్యాసము. అనఁగా, చిత్తవృత్తులు లయమై, చిత్తస్వరూపస్థ మైన పరిణామము (ఏకాగ్రత) కలుగుటయందు ఉత్సాహముచే పదేపదే ప్రయత్నించుట అభ్యాస మని భావము.

అవ. అభ్యాసముయొక్క దార్ఢ్యమును నిరూపించుచున్నారు.—

14. స తు దీర్ఘకాలనైరన్తర్య సత్కారసేవితో దృఢభూమిః.

తా. ఆ యభ్యాసము బహుకాలమువఱకును ఎడతెగక ఆదరాతిశయముతో సేవింపఁబడినయెడల దృఢమైన దశ (స్థిరమైన అవస్థ) కలుగును.

వి. ఉత్సాహముతో చాలకాలము విడువక సత్కారములను (బ్రహ్మచర్యము మొదలుగాఁ గల తపస్సులను) చేయుటవలన, అభ్యాసము స్థిర (దృఢ) పడును. స్థిర మనఁగా, విషయములని కలఁతను త్వరగా చెందకుండుట. దీనిని దార్ఢ్య మనియుఁ జెప్పవచ్చును.

అవ. వైరాగ్యస్వరూపమును వివరించుచున్నారు —

15. దృష్టానుశ్రవికవిషయవితృష్ణస్య వశీకారసంజ్ఞా వైరాగ్యమ్.

తా. ఇహమునందును, పరమునందును, అనుభవింపఁదగిన విషయములయందు ఆశలేనివానికి విషయములు తనకు వశమైన దని తెలియుటయే వైరాగ్యము.

వి. స్రక్చందనవనితాది భోగవిషయములను ఇహమునందును, శ్రుతి (వేదము) వలన తెలియఁబడిన రంభాదిభోగవిషయములను పరమ (స్వర్గము) నందును, అభిలషింపకుండుట వైరాగ్యము.

దృష్టవిషయము లనఁగా :— స్త్రీ సంభోగము, అన్నపానములు, ఐశ్వర్యము మొదలగు ఐహికసంబంధమైనవి. అనుశ్రవ మనఁగా :— వేదముల వలన తెలియవచ్చు స్వర్గాదిలోకాంతరములయందు అనుభవింపఁదగిన ఆముష్మికసంబంధమైనవి. ఇవి దీర్ఘకాలము ననుభవింపనది కాదు. కావున వీనియందలి ఆశను విడువవలయును. (అనఁగా వీనికి వశుఁడు గాక యుండవలయును) ఇట్లు విడిచినవారికి వైరాగ్యము కలుగును. అనఁగా, ఐహికాముష్మిక భోగంబులు తుచ్ఛంబు లనియును. కొంతకాలమే యుండునవి కావున అశాశ్వతం బయినవి యనియును తెలిసి వర్జించినవాఁడే విరాగి యని భావము.

అవ. వైరాగ్యస్వరూపముయొక్క విశేషమును చెప్పుచున్నారు.—

16. తత్పరం పురుషఖ్యాతేర్గుణవైతృష్ణ్యమ్.

తా. త్రిగుణములయందలి యాశ లేకుండుటయే గుణవైరాగ్యము. ఇది పైని చెప్పఁబడిన విషయవైరాగ్యములకంటె ఉత్కృష్టమైనది.

వి. చిన్మాత్రుఁ డైన పురుషుని (తన ఆత్మస్వరూపము నెఱింగిన వానికి) ఇహపరసంబంధముచేఁ గలుగు విషయవైరాగ్యము కంటెను, ఈవిషయములకు కారణమై యుండు సత్త్వాదిగుణములవలనఁ గలుగు గుణవైరా

గ్యము అసంప్రజ్ఞాతసమాధికి అతిసమీపమునం దుండి అనుకూలము నొసంగు చుండుటచే శ్రేష్ఠమని చెప్పఁబడెను.

అనఁగా, ఐహికాముష్మికములయందలి దోషముల నెఱింగినవాఁడు తన స్వరూపమును కనుఁగొనుటకు ప్రయత్నించును. ఇట్లు త్రిగుణములకును, తన స్వరూపమునకును గల భేదమును తెలిసికొనుటవలన వైరాగ్యము కలుగును. ఇదియే గుణవైరాగ్యము. దీనివలన ముక్తి కలుగును.

అవ. ఇట్లు యోగస్వరూపమును నిరూపించి యోగభేదములను విభజించుటకొఱకై ప్రథమున సంప్రజ్ఞాతసమాధిని చెప్పుచున్నారు.

17. వితర్కవిచారానన్దాస్మితారూపానుగమాత్సంప్రజ్ఞాతః.

తా. వితర్కమనియు, విచారమనియు, ఆనందమనియు, అస్మితయనియు చెప్పఁబడు సమాధులతోఁ గూడిన సమాధి, సంప్రజ్ఞాతసమాధి యనఁబడుచున్నది.

వి. సవితర్క, సవిచార, సానంద, సాస్మితయనియుఁ గలదు. సంప్రజ్ఞాత మనఁగా:—దేనిచే సంశయ విపర్యయములు లేక ధ్యానించువస్తువు యొక్క విశిష్టస్వరూపము విశేషముగాఁ దెలియఁబడుచున్నదో, అది సంప్రజ్ఞాతసమాధి యనఁబడుచున్నది. సమాధి యనఁగా:—భావనావిశేషము, భావనావిశేషమనఁగా.—ఇతర విషయములను పరిహరించి భావింపఁదగిన వస్తువును మాత్రమే అప్పటప్పటికి చిత్తమునందు నిల్పుట (అనఁగా భావింపఁదగిన వస్తువునకు వ్యతిరిక్తమై చిత్తమందు కలిగెడి వృత్తులను నిగ్రహించుట.) ఆభావనకు గుఱియైన వస్తువు భావ్య మనఁబడును. (అనఁగా భావింపబడునదియే భావ్యము.) ఈ భావ్యము రెండువిధములు. 1 ఈశ్వరుఁడు, 2 ఇరువదైదు తత్త్వములు. ఈ తత్త్వములు రెండువిధములు. 3 అజడతత్త్వములు, 4 జడతత్త్వములు. అజడతత్త్వములు చిన్మాత్రుండైనపురుషుండు

జడతత్త్వములు స్థూలసూక్ష్మకారణ భేదములవలన ఇరువదినాల్గు విధములు. పృథివి, అప్పు, తేజస్సు, వాయువు, ఆకాశము, అను పంచమహాభూతములును, త్వక్కు, చక్షు, శ్రోత్రము, జిహ్వ, నాసిక అను, పంచజ్ఞానేంద్రియములును, వాక్కు, పాణి, పాదము, వాయువు, ఉపస్థ అను పంచకర్మేంద్రియములును, ఇవి పదునైదును స్థూలభూతములు. శబ్దము, స్పర్శము, రూపము, రసము, గంధము అను పంచతన్మాత్రలును, మనస్సు, బుద్ధి, అహంకారము, ప్రకృతి అను అంతఃకరణ చతుష్టయమును అను నీ తొమ్మిదియును సూక్ష్మవిషయములు. ఈ 11-ను జడతత్త్వములు.

సవితర్క మనఁగా:—స్థూలభూతములను లక్ష్యము (గురి) చేసికొని వీనియొక్క శబ్దార్థజ్ఞాన శోధన విధముచేత, వీనిలో దేనినుండి యేది పుట్టినదను కార్యకారణ భావములను విమర్శించుచుండుటయే సవితర్క సమాధి యనఁబడును.

అనఁగా, స్థూలములగు భూతంబులను యింద్రియంబులను విషయములుగాఁ జేసికొని, ఇది ముందు ఇది వెనుక అను జ్ఞానముతోడను, దీని కిది పేరు అనెడు శబ్దార్థజ్ఞానముతోడను చేయునట్టి భావనయే సవితర్కము. (పైని చెప్పఁబడినట్టి జ్ఞానము ఎంతవఱకు లేకయుండునో అంతవఱకు నిర్వితర్కమని తెలియఁదగియుండును.)

మొట్టమొదట విల్లుతో గురిని వైవ నభ్యసించువాఁడు గొప్పగా కనఁబడునట్టి గురిని వైవనేర్చికొని తర్వాత సూక్ష్మమైన గురిని వైవ నేర్చికొనుచున్నాఁడు. ఆ ప్రకారముగనే యోగాభ్యాసి మొదట స్థూలాకారమైన వస్తువును (విష్ణువు, శివుఁడు, బ్రహ్మ మొదలగువారి ఆకారములను) భావనచేయుచు అమీఁద సూక్ష్మాకారమైన వస్తువును (విషయమును) గూర్చి భావన చేయును.

సవిచార మనఁగా:—పంచతన్మాత్రలు మొదలగు సూక్ష్మవిషయములను గురి చేసికొని ఇవి ఏకాలమునందు ఏస్థలమునందు ఏ స్వరూపమైన

ధర్మము గలదిగా కలిసినని యేర్పాటుతో భావించి యుండుటయే సవిచార సమాధి యనఁబడును. (పైని చెప్పిన చొప్పున భావింపమి నిర్విచార మనఁబడును.)

సానంద మనఁగా:—చిత్తమునందు రజస్తమోగుణములు నిశ్శేషముగా నశించిపోక లేశమాత్రము (కొంచెము) మిగిలియుండు కాలమునందు ఆ చిత్తమం దుండు సత్త్వగుణము (అంతఃకరణ సత్త్వమును) భావించుచుండుటయే సానందసమాధి యనఁబడును. (సత్త్వము- సుఖప్రకాశరూపమైనది కావున సానంద మనఁబడెను.) ఈ సానందసమాధియందు రజస్తమోగుణములశేషము నశించిపోఁగా తాను భావన చేయుటలో (భావించునట్టి) సత్త్వగుణము వృద్ధి యగుచుండుటంబట్టి ఆనందము కలుగుచున్నది. (ఇంద్రియము లనెడు స్థూలవిషయములను గూర్చినది సానందము.) ఈ సానందసమాధిని చక్కఁగా నభ్యసించి ప్రధానము, పురుషుఁడు అను తత్త్వముల తెలివిశేషమాత్రమును లేనివారు విదేహు లనఁబడుదురు.

సాస్మిత యనఁగా :—రజస్తమోగుణములతో సంబంధింపక యుండు చిత్తమునందు శుద్ధసత్త్వమును మాత్రము భావించి యుండుటచేత సత్త్వగుణము క్రమక్రమముగా నశించిపోవుటవలనను, చిత్తమందలి చైతన్యశక్తి క్రమక్రమముగా వృద్ధి యగుచుండుటవలనను, చైతన్యశక్తిమాత్రమే మిగిలి యుండును గాన సాస్మితసమాధి యనఁబడును.

అస్మిత యనఁగా:—బహిర్ముఖమందు అజ్ఞానముచేఁగలుగు క్లేశరూపకమైన అస్మిత యని గ్రహింపక అంతర్ముఖమందు కలుగు అక్లేశ (ఆనంద) రూపకమైన అస్మిత యని గ్రహింప వలయును. అస్మితవలన ఇంద్రియములు కలుగును కావున, ఇంద్రియములకు అస్మితయే సూక్ష్మరూపము.

మఱియు, ఆత్మతోఁ గూడ బుద్ధికి ఐక్యమును తెలియపఱుచునట్టి జ్ఞానమే అస్మిత యనఁబడును. దీనిలో గ్రహీత యగు నాత్మయు చేరియుండుటచే నిది గ్రహీతృవిషయ మని గ్రహింపవలయును. అహంకారమునకును

అస్మితకును భేదము లేమనఁగా, అంతఃకరణము నేనను జ్ఞానముతో నేను విషయములను గ్రహించుట అహంకారము. అంతఃకరణము అంతర్ముఖమైనప్పుడు సత్తు (స్థితి) మాత్రము తోఁచుట అస్మిత యనఁబడును.

ఈ సాస్మితసమాధివలన కలుగు సంతోషముతో తృప్తిని బొంది పరమాత్మను కనుఁగొననివారలందఱు దానికి కారణమైన ప్రకృతియందు లయమును బొందుదురు; కావున వారు ప్రకృతిలయు లనఁబడుదురు.

ఇందు సవితర్కమును సవిచారమును అను రెండు సమాధులు గ్రాహ్యసమాపత్తి యనియును, సానందము గ్రహణసమాపత్తి యనియును, సాస్మిత గ్రహీతృసమాపత్తి యనియును చెప్పఁబడును.

ఈ నాలుగువిధముల సమాధులయందును, సవితర్కమును త్యజించినచో సవిచారమును, సవిచారమును విడిచినచో సానందమును, సానందమును వదలినచో సాస్మితయును కలుగును.

ఈ సమాధులు నాలుగింటిని సాలంబనసమాధి యనియును, సంప్రజ్ఞాతసమాధి యనియును నామములు గలవు.

ఇందు సవితర్క సవిచారములు రెండును సబీజసమాధి యని చెప్పఁబడును.

సబీజసమాధి యనఁగా. చిత్తము అన్యపదార్థముల నాశ్రయించికొని యుండుట. వీని వివరము 42, 43, 44 సూత్రములయందుఁ జెప్పఁబడును.

అవ. అసంప్రజ్ఞాత సమాధిలక్షణమును వచించుచున్నారు.—

18. విరామ ప్రత్యయాభ్యాస పూర్వ స్సంస్కారశేషో ఽన్యః

తా. వితర్కము మొదలు అస్మితాంతములవఱకు గల సంప్రజ్ఞాత సమాధులు లేకపోవుటయు, చిత్తమునందు ఏవృత్తులు తలచూపినను వానిని రానీయక నిరాకరించుటయు, నిర్మలమైన చిత్ప్రకాశమార్గమువలన

చిన్మాత్రుఁడైన పురుషుని స్వరూపమై యుండుటయు అసంప్రజ్ఞాతసమాధి యనఁబడును.

౨. ఈ సమాధియందు తెలియఁదగిన పదార్థములు లేవు గాన అసంప్రజ్ఞాత మను పేరు గలిగెను. దీనినే నిర్బీజసమాధి యనియు వ్యవహరింతురు.

అనఁగా, చిత్తమునందు వృత్తులు జనించినప్పుడు వానిని నిగ్రహించుటకు ప్రయత్నపడవలయును. ఈ అసంప్రజ్ఞాత సమాధియందు విషయమే యుండదు.

చిత్తమునకు వ్యుత్థానము. సమాధిప్రారంభము. ఏకాగ్రత, నిరోధము అని నాలుగు పరిణామములు గలవు. రెండవసూత్రమున వివరింపఁబడిన క్షిప్త మూఢములు రెండును వ్యుత్థానము. విక్షిప్తభూమిలో సత్త్వగుణము అతిశయించి యుండుటంబట్టి దానిని సమాధిప్రారంభ మనఁబడెను. నాల్గవభూమి ఏకాగ్రత. నిరుద్ధభూమి నిరోధము. ఇవి ఒకదానివలన మఱియొకటి తొలఁగద్రోయఁబడును.

ఎట్లనగా. వ్యుత్థానముచే జనించిన సంస్కారములను సమాధి ప్రారంభముచేఁ బుట్టిన సంస్కారములు పోఁగొట్టును. సమాధి ప్రారంభముచేఁ గలిగిన సంస్కారములను యేకాగ్రతవలనఁబుట్టిన సంస్కారములు తొలఁగించును ఏకాగ్రతచే జనించిన సంస్కారములను నిరోధమునుండి కలిగిన సంస్కారములు నిగ్రహించును. నిరోధముచేఁ గలిగిన సంస్కారములుమాత్రము యేకాగ్రతవలనఁ బుట్టిన సంస్కారములను పోఁగొట్టుచు అవియు పోవుచున్నవి.

ఇందులకు దృష్టాంత మెట్లనఁగా:— వెండితో సీసమును జేర్చి వూఁదినయెడల వెండిలోనుండు మలినమును పోఁగొట్టి అదియును (సీసమును) పోవునట్లు అని తెలియఁదగినది. ఈ అసంప్రజ్ఞాతసమాధికి ఉత్తమవైరాగ్యమే కారణము.

అవ. యోగాభ్యాసములేకయు ఉపాయమును జెప్పువారై సానంద సాస్మిత సమాధులయం దుండువారి స్వరూపమును నిరూపించుచున్నారు.—

19. భవప్రత్యయో విదేహప్రకృతిలయానామ్.

తా. విదేహులయొక్కయు ప్రకృతిలయులయొక్కయు సమాధి జనితమగు ప్రవాహరూపమైన సంస్కారమునకుఁ గారణ మైనది.

ఈ భవప్రత్యయమనఁగా:— పంచభూతములు, ఇంద్రియములు అను వికృతితత్త్వములయందైనను, లేక అవ్యక్తము, మహత్తు, అహంకారము, పంచతన్మాత్రలు అను ప్రకృతితత్త్వములయందైనను, (పైన చెప్పినవియెల్లను ఆత్మతత్త్వము కాకున్నప్పటికిని) ఆత్మ యనెడి తలంపును, అందుచే జనించిన యోగమును భవప్రత్యయ మనఁబడును. ఈ భవప్రత్యయము విదేహులకును, ప్రకృతిలయులకును కలుగును.

విదేహు లనఁగా:— సానందసమాధియం దుండువారు. వీరు ప్రధాన పురుషరూప మైన తత్త్వమును తెలియనివారై, శుద్ధసత్త్వగుణ పరిణామమునందే ఆనందము నొందియుండుటం బట్టి దేహాహంకారములు లేనివారై యుందురు.

అనఁగా:— పంచభూతములు, ఇంద్రియములు, వీనిలో నొక్కొక్క దానిని ఆత్మ యని భావించి దానినే యుపాసన (భావన) చేయువారికి. ఆవాసన అంతఃకరణమున పట్టియుండును. కావున వారు శరీరమును విడిచిన తర్వాత పంచభూతములలో నైనను, లేక ఇంద్రియములలో నైనను లయమునుఁ జొంది సంస్కారములతో మాత్ర మున్నట్టి మనస్సుకలవారై యీ భౌతికశరీరము లేనివారై యుందురు. ఇట్టివారే దేవతలు వీరి చిత్తము నందు సంస్కారములతోఁ గూడినవార మనెడి తలంపుమాత్ర ముండునేగాని వృత్తులేవియు కలుగవు. వీరు కొన్నాళ్లు దేవతలై యుండి మరల సంసృతిని (సంసారమును) ప్రవేశింతురు. కాఁబట్టి వీరికి మోక్షము లేదు. భూతముల నుపాసించువారు నూఱు మన్వంతరములును. ఇంద్రియముల నుపాసించువారు పదిమన్వంతరములును దేవతలుగా నుందురు. వీరే విదేహు లనఁబడుదురు.

ప్రకృతిలయు లనఁగా :—సాస్మిత సమాధియం దుండువారు. వీరును పరమాత్మను దర్శింపనివారై శుద్ధసత్త్వగుణమును విడిచి చిత్ప్రకాశము నందు నిలిచి ఆనందమయులై యుందురు వీరి చిత్తము స్వకారణ మైన ప్రకృతియందు లీనమై యుండును. కావున విదేహప్రకృతిలయులయొక్క యోగమును ఆభాసమైనదే పరమాత్మను దర్శించువారు సత్త్వాదిగుణముల యం దాశను విడిచి వైరాగ్యమువలన అసంప్రజ్ఞాతిసమాధిద్వారా కైవల్య పదవిని చెందవలయును. అనఁగా, ముక్తిని గోరువాఁడు పరతత్త్వము నెఱింగి దానినే యుపాసన (భావన) చేయుటకు మిక్కిలి ప్రయత్నము చేయ వలయును.

అనఁగా :—అవ్యక్తతత్త్వము, మహత్తత్త్వము, అహంకార (అభిమాన) తత్త్వము, పంచతన్మాత్రలు, వీనిలో నొక్కొకదానిని ఆత్మగా భావించి యుపాసన చేయుటవలన ఆవాసనవైన చెప్పిన అవ్యక్తాదులలో నొక్కదాని వాసన అంతఃకరణమునందు పట్టియుండును. ఇట్లు అవ్యక్తాదులలో మనస్సు లీనమై యుండువారు శరీరమును విడిచినకాలమునందు ముక్తిని యనుభవించు చున్నట్లు తలంచి యుందురు. ఇందువలన శాశ్వతమైన కైవల్యప్రాప్తి సిద్ధింపదు. ఎట్లనఁగా, వర్షాకాలము పోయినమీఁద మన్నైపోయిన కప్ప మఱల వర్షము కురిసినవెంటనే యెట్లు కప్పయగుచున్నదో, ఆలాగే అవ్యక్తాదులలో మనస్సు లీనమై యుండువారు మఱల సంసారు లగుదురు. అవ్యక్తతత్త్వమును ఉపాసించువారు లక్షమన్వంతరములును, మహత్తత్త్వమును ఉపాసించువారు పది వేలమన్వంతరములును, అహంకారతత్త్వమును ఉపాసనచేయువారు వేయి మన్వంతరములును కైవల్యము ననుభవించువారివలెనుండి మఱల సంసారులగు దురు. వీరే ప్రకృతిలయు లనఁబడుదురు.

అవ. విదేహప్రకృతి లయవ్యతిరిక్తులైన యోగులు యోగసిద్ధికొఱకు విశేషప్రయత్నమును జేయవలయు ననుచున్నారు.

20. శ్రద్ధావీర్యస్మృతి సమాధి ప్రజ్ఞాపూర్వక ఇతరేషామ్.

తా. విదేహప్రకృతిలయవ్యతిరిక్తులైన యోగులయొక్క సమాధి సిద్ధికి శ్రద్ధ, వీర్యము, స్మృతి, సమాధి, ప్రజ్ఞ ఈ మొదలగునవి క్రమమైన యుపాయములు.

వి. భవప్రత్యయమునకు వ్యతిరిక్తమైన ఉపాయత్రయము నీ సూత్రము వలన చెప్పంబడుచున్నది. విదేహులయ్యప్రకృతులకు వేఱైన సవితర్క, నిర్వితర్క, సవిచార, నిర్విచార, సమాధులయందుండు యోగులకు సానందసాస్మిత రూపసంప్రజ్ఞాతసమాధిసిద్ధికై యోగమునందు శ్రద్ధయును (విశ్వాసమును), వీర్యమును (ఉత్సాహమును), స్మృతియును (మఱవకుండుటయును), సమాధియును (చిత్తైకాగ్రతయును), ప్రజ్ఞయును (వివేకమును), ఇవి క్రమముగా సాధకములై యున్నవి.

ఎట్లనఁగా, యోగమునందు విశ్వాసముకలవానికి చేయుదు ననెడు ఉత్సాహము కలుగుచున్నది. ఉత్సాహమువలన యోగమును, మఱవక యుండుట కలుగుచున్నది. యోగమును మఱవక యుండుటవలన చిత్తైకాగ్రత కలుగుచున్నది. చిత్తైకాగ్రతవలన యోగమును తెలిసికొను వివేకము కలుగుచున్నది.

ఇవి యొకదానికొకటి కారణములై సంప్రజ్ఞాతసమాధిని (ప్రజ్ఞను) కలుగఁజేయును. ఈ సంప్రజ్ఞాతసమాధిని అభ్యసించుటవలనను, వాని విషయమునందలి వైరాగ్యమువలనను, అసంప్రజ్ఞాతసమాధి సిద్ధించును. ఇదియే ఉపాయప్రత్యయ మనఁబడును.

అవ. శీఘ్రకాలమున సమాధి సిద్ధింపనట్టి యధికారమును నిరూపించుచున్నారు.—

21. తీవ్రసంవేగానా మాసన్నః.

తా. తీవ్రమైన సంవేగము (జాగరూకతమైన దృఢతరసంస్కారములు) గలవారలకు సంప్రజ్ఞాతసమాధి మిగుల సమీపము.

వి. సంవేగ మనఁగా:—కార్యసాధక మైనట్టి మిక్కిలి దృఢమైన (వైరాగ్యము) సంస్కారము. ఉపాయప్రత్యయసంపత్తి మిక్కుటముగ కలవారలకు యోగమును, దానిఫలమును, శీఘ్రముగా లభించును. ఉపాయ సంపత్తికలవారలే తీవ్రసంవేగు లనఁబడుదురు.

అవ. దృఢతరసంస్కారభేదములను వచించుచున్నారు.—

22. మృదుమధ్యాధిమాత్రత్వా త్తతో ఽపి విశేషః.

తా. యోగులు మృదువులు, మధ్యములు, అధికులు అని వ్యవహరింపఁ బడుదురు. ఈ మృదు మధ్యాధిక లొకరికన్న నొకరు విశేషజ్ఞులు కావున తీవ్రసంవేగులకన్న నెక్కువవారు.

వి. మృదూపాయకులు, మధ్యోపాయకులు, అధిమాత్రోపాయకులు, అని యోగులు మూఁడువిధములవారు. ఈ ముగ్గురును ప్రత్యేకప్రత్యేకముగా మృదుసంవేగులు, మధ్యసంవేగులు, తీవ్రసంవేగులు అని మూఁడువిధముల వారు. కాఁబట్టి యోగులు తొమ్మిదివిధములవా రగుదురు. ఎట్లన,

మృదుసంస్కారభేదము కలవారు:—మృదుమృదుసంవేగులు, మృదు మధ్యసంవేగులు, మృద్వధిమాత్రసంవేగులు.

మధ్యసంస్కారభేదము కలవారు:—మధ్యమృదుసంవేగులు, మధ్య మధ్యసంవేగులు, మధ్యాధిమాత్రసంవేగులు.

అధిమాత్రసంస్కారభేదము కలవారు:—అధిమాత్ర మృదుసంవేగులు, అధిమాత్రమధ్యసంవేగులు, అధిమాత్రాధిమాత్రసంవేగులు.

అనఁగా:—మృదుసంవేగ మృదూపాయము కలవాఁడు, మధ్యసంవేగ మృదూపాయము కలవాఁడు, తీవ్రసంవేగ మృదూపాయముకలవాఁడు, మృదు సంవేగ మధ్యోపాయము కలవాఁడు, మధ్యసంవేగ మధ్యోపాయము కల వాఁడు, తీవ్రసంవేగ మధ్యోపాయము కలవాఁడు, మృదుసంవేగాధిమాత్రో పాయము కలవాఁడు మధ్యసంవేగాధిమాత్రోపాయము కలవాఁడు, తీవ్ర

సంవేగాధి మాత్రోపాయము కలవాఁడు అని యోగి నవవిధ భేదములు గల వాఁడుగా నున్నాఁడు. తీవ్రసంవేగాధిమాత్రోపాయము కలవాఁ డగుటకు దగిన ప్రయత్నములను చేయవలయు ననుటకై యోగులు తొమ్మిది విధముల వారని చెప్పఁబడెను.

అవ. పైని చెప్పిన యుపాయములకంటె సులభ మైనదానిని చెప్పు చున్నారు.—

23. ఈశ్వరప్రణిధానా ద్వా.

తా. ఈశ్వరోపాసకుఁడు, విధ్యుక్తకర్మలాచరించి భక్తితో సమస్త మును ఈశ్వరార్పణ మని చేయునేని వానికి త్వరగా యోగము సిద్ధించును.

వి. ఈ యీశ్వరోపాసనాయోగము సులభోపాయ మైనది.

ప్రణిధాన మనఁగా:—భక్తివిశేషముతోఁ గూడిన యుపాసనము. విషయములవలనఁ గలుగు సుఖము నిమిత్తమై కర్మము లాచరింపక సర్వ కర్మములను ఈశ్వరునకు సమర్పింపవలయును. ఇది యోగము లభించుట కును దానిఫలము సిద్ధించుటకును గొప్ప యుపాయము. ఈ భక్తి మానసిక, కాయిక, వాచిక మై యుండును.

అవ. ఈశ్వరప్రణిధానమువలన సమాధిలాభము సులభముగాఁ గల్గు నని చెప్పి, యిఁక నా యీశ్వరుని స్వరూపమును, ఈశ్వరుఁడు కలఁడను టకుఁ బ్రమాణమును, ఈశ్వరుని మాహాత్మ్యమును, ఈశ్వరుని తెలియఁజేయు శబ్దమును, ఈశ్వరుని యుపాసించుక్రమమును, ఈశ్వరోపాసనవలని ప్రయోజనము ను క్రమముగాఁ జెప్ప నుపక్రమించి యిపుడు ఈశ్వరస్వరూ పమును చెప్పుచున్నారు.—

24. క్లేశకర్మ విపాకాశయై రపరామృష్టః పురుషవిశేష ఈశ్వరః.

తా. అవిద్యాది క్లేశములు, పుణ్యపాప మిశ్రకర్మములు, జాత్యా యుర్భోగములు, చిత్తమునందు వాసనారూపమై యుండు సంస్కారములు

అను వీనిచేతను కాలత్రయములచేతను బాధింపఁబడని పురుషశ్రేష్ఠుఁడు ఈశ్వరుఁ డనఁబడును.

వి. క్లేశము లనఁగా:— అవిద్య మొదలగునవి. (వీనిని రెండవ పాదమునందలి 3-వ సూత్రమునఁ గనఁదగును.)

కర్మము లనఁగా:— విహితము, నిషిద్ధము, మిశ్రము అని మూఁడు విధములు.

విహితకర్మము లనఁగా:— సంధ్యావందనాదులు.

నిషిద్ధకర్మము లనఁగా:— పరహింస మొదలగునవి.

మిశ్రకర్మము లనఁగా:— పుణ్యపాపములు రెండింటితోడ సంబంధించినవి.

విపాక మనఁగా:— పైని వివరించిన కర్మములకు ఫల మగుజాతి, ఆయువు, భోగములు. (వీనిని ద్వితీయపాదము 13-వ సూత్రమున చూడఁదగును.)

ఈశ్వరుఁ డనఁగా:— మీఁదఁ జెప్పఁబడిన క్లేశాదులచే సంబంధపడియుం కట్టువడక యుండువాఁడు.

అవ. ఈశ్వరునియొక్క ప్రమాణమును జెప్పుచున్నారు.—

25. తత్ర నిరతిశయం సర్వజ్ఞ బీజమ్.

(సార్వజ్ఞ్యబీజమ్) అని పాఠాంతరము.

తా. ఆ యీశ్వరునియందు సర్వజ్ఞుఁ డనుటకుఁ దగిన హేతువు కలదు. కాన ఈశ్వరుఁ డున్నాఁ డనుటకు ముఖ్యప్రమాణ మున్నది.

వి. ఈశ్వరుఁడు సర్వజ్ఞత్వమునకు బీజము (కారణము) అని చెప్పినందున ఆయనకంటె మఱి వేఱేదియు లేదని యేర్పడెను. ఈశ్వరునియందే సర్వజ్ఞత్వమును నిరూపించుటకుఁ గారణ మే మనఁగా, స్వతః జడమైన

చిత్తమునందు అల్పాతిశయసాత్త్వికశక్తివలన జ్ఞానాద్యుత్తమమైన సర్వధర్మములును హెచ్చుగను తక్కువగను మలినముగను నిర్మలముగను ఇట్లు వ్యత్యాసములు గలవిగా పరిణమించుటంబట్టి వీనికి కారణుం డొక్కఁడున్నాఁడనియును, అతనిచేతనే యిట్లు కలుగుచున్నదనియును తెలియఁబడుచున్నది. కావున, నిరతిశయ (అంతకంటె మఱి అతిశయించినది లేనిది, లేక అత్యధికమైనది) జ్ఞానశక్తి ఈశ్వరునియందే యున్నదనియును, అతఁడే మూలభూతుఁ డనియును విశదమగుచున్నది.

అవ. ఈశ్వరుని మాహాత్మ్యము జెప్పుచున్నారు.—

26. సర్వేషా మపి గురుః కాలే నానవచ్ఛేదాత్.

"(స ఏష పూర్వేషా మపి" అనియును, "స పూర్వేషా మపి" అనియును) పాఠాంతరములు.

తా. ఆ యీశ్వరుఁడు త్రికాలాబాధ్యుం డగుటచే బ్రహ్మాదులగు వారికిని గురువు (ఉపదేశకర్త)గా నున్నాఁడు.

వి. త్రికాలము లనఁగా:— భూతకాలము (జరిగిపోయిన కాలము) భవిష్యత్కాలము (జరుగఁబోవు కాలము,) వర్తమానకాలము (జరుగుచుండు కాలము,) ఈశ్వరుఁడు ఈ కాలములవలన బాధింపఁబడఁడు. ఎల్లప్పుడు నుండువాఁడు గాన నాతనికి కాలము నిర్ణయము లేదు, కాఁబట్టి అప్పుడప్పుడు జనన మొందు బ్రహ్మాదులకు ధర్మముల నుపదేశించువాఁడుగా నున్నాఁడు.

అవ. ఈశ్వరోపాసనకొఱకతని నామమును జెప్పుచున్నారు.—

27. తస్య వాచకః ప్రణవః.

తా. ఆ యీశ్వరునకు ఓంకారమే (ప్రణవము) నామధేయము.

వి. ఈశ్వరుఁడు "ఓమ్" అని చెప్పఁబడును. ఓమ్ అనునదే ప్రణవము. ప్రణవ మనఁగా, అందఱిచేతను స్తోత్రము చేయఁబడునది; లేక దీనిచే

నీశ్వరుఁడు స్తుతింపఁబడును. లేక, ఈశ్వరుని యిది అధికముగా స్తుతి చేయును. అనఁగా:—ఒకఁడు తండ్రియును ఒకఁడు కొడుకు నై నప్పుడు, ఇతఁడు ఈతనికి తండ్రి యనియును, ఇతఁడు ఈతనికి కుమారుఁడనియును చెప్పునట్టి సంబంధ (అకల్పిత మైన నిత్యసంబంధ) మెట్టిదో, అట్లే ఈశ్వరునకును ప్రణవమునకును గల నిత్యసంబంధమును తెలిసికొనవలయును.

అవ. ఈశ్వరోపాసనాక్రమమును జెప్పుచున్నారు.—

28. తజ్జప స్తదర్థ భావనమ్.

తా. మూఁడున్నర మాత్ర గల ఓంకారమును జపము చేయుటయు, ఆ ఓంకారముయొక్క అర్థమును భావించుటయు ఉపాసన యనఁబడును.

ఓ. ఓంకారముయొక్క మూఁడున్నరమాత్ర యేదనఁగా:—అ-ఉ-మ-అర్థమాత్ర. ఇవి చేరిన ఓంకారమును పదేపదే చింతించుట జప మనఁబడును.

ఓంకారార్థమును భావించుట యనఁగా:—ఓంకారార్థ ప్రదుఁడైన ఈశ్వరుని ధ్యానము చేయుట. అనఁగా, యోగమును చేయుచు ప్రణవము నుచ్చరింపవలయు ననియును ప్రణవము నుచ్చరించుచు యోగము సాధింపవలయు ననియును భావము. ప్రణవజపము చిత్తైకాగ్రతకు ఉపాయము కనుక సమాధిసిద్ధికై యోగులవశ్యము దీనిని జపింపవలసినది. ఇందువలన పరమాత్మ ప్రకాశించును.

అవ. ఈశ్వరోపాసనా ఫలమును జెప్పుచున్నారు.

29. తతః ప్రత్యక్చేత నాధిగమో ఽప్యన్తరాయా ఽభావశ్చ.

తా. ఆ ఈశ్వరునిఁ జెప్పెడి ఓంకారజపమువలన చిన్మాత్రుఁడైన పురుషునియొక్క విఘ్నములు తొలఁగును; జ్ఞానము లభించును.

వి. తనకంటె వేఱైన ఈశ్వరుని ధ్యానము చేయుటవలన ఆత్మసాక్షాత్కార మెట్లు కలుగు ననఁగా, ఈశ్వరస్వరూపమువలె ఆత్మస్వరూపమునై యుండుటంబట్టి ఈశ్వరోపాసనవలన ఆత్మస్వరూపము తెలియఁబడును.

అవ. యోగవిఘ్నము లైన అంతరాయములను జెప్పుచున్నారు.—

30. వ్యాధి స్త్యాన సంశయ ప్రమా దాల స్యావిరతి
భ్రాంతిదర్శ నాలబ్ధభూమిక త్వానవస్థితత్వాని
చిత్తవిక్షేపా స్తే ఽ న్తరాయాః.

తా. రోగములు, యోగకర్మానర్హత, సందేహము, అజాగ్రత్త, మత్తత, అతృప్తి, భ్రమ, సమాధిస్థితి కుదురుకపోవుట, చిత్తస్థైర్యము లేకుండుట అను నీ చిత్తవికారములు యోగవిఘ్నము లనఁబడును.

వి. వాత పిత్త శ్లేష్మాదిధాతువైషమ్యముచే గలుగు జ్వరాదివ్యాధులును, అంగ పాటవముతప్పి చిత్తము పనిచేయుటకు దగియుండని కర్మానర్హత యనెడు స్త్యానమును, యోగము సాధ్య మగునో కాదో యను సంశయమును, యోగము నాచరింపక ఉదాసీనతతో నుండుట యనెడు అజాగ్రత్త ప్రమాదమును, చిత్తమును దేహమును మదించి యేమియు తోఁపక మత్తతగా నుండు ఆలస్యమును, విషయసుఖములయందు తృప్తి జెందని అవిరతియును, యోగమునందు భ్రమ జెందియుండు భ్రాంతిదర్శనమును, ఏవో కారణాంతరములవలన యోగము కలుగకపోవుట యను అలబ్ధభూమికత్వమును, సమాధిస్థితి కలిగినను దానియందు నిలుకడలేకపోవుట యనెడు అనవస్థితత్వమును అను నీతొమ్మిదియును చిత్తైకాగ్రతకు విరోధములు గాన ఇవి చిత్తవిక్షేపము లనియును, అంతరాయము (విఘ్నము) లనియును చెప్పఁబడెను.

అవ. మఱికొన్ని అంతరాయములను వర్ణించుచున్నారు.—

31. దుఃఖ దౌర్మనస్యాఙ్గమేజయత్వ శ్వాస ప్రశ్వాసా
విక్షేప సహ భువః.

తా. దుఃఖము, మనశ్చాంచల్యము, వణఁకుట, శ్వాసము, ప్రశ్వాసము అనునివి చిత్తవిక్షేపములకు (సహకారులు) తోఁబుట్టువులు.

వి. దుఃఖ మనఁగా:— అనుతాపముచేఁ గలిగిన చిత్తక్షోభము. ఈ దుఃఖము ఆధ్యాత్మికము, ఆధిభౌతికము, ఆధిదైవికము అని మూఁడువిధములు. ఈ ఆధ్యాత్మికము శరీరము, మానసము అని రెండువిధములు; శారీరము జ్వరము మొదలగునవి. మానసము కామము మొదలగువానిచేఁ గలుగునవి. ఆధిభౌతికము పులులు మొదలగువానిచేఁ గలుగునవి. ఆధిదైవికము పిశాచము మొదలగువానిచేఁ గలుగునవి.

దౌర్మనస్య మనఁగా:— బాహ్యాభ్యంతర కారణములచేతఁ గాని, కోరిక యీడేరక పోవుటచేతఁగాని, మనస్సు నిలుకడ లేక చంచలముగా నుండుట.

అంగమేజయత్వ మనఁగా:— ఆసనము (కూర్చుండుట,) మనస్సు, స్థిరముగా నిలువక సర్వావయవములు వడఁకుచుండుట.

శ్వాస మనఁగా:— వెలుపలిగాలిని దేహములోపలికి నెక్కువగా పీల్చుకొనుట. ఇదే ఉచ్ఛ్వాసము.

ప్రశ్వాస మనఁగా:— దేహములోపలి గాలిని యెక్కువగా బయటు విడుచుట. ఇదే నిశ్వాసము.

అవ. చిత్తవిక్షేపనివారణార్థమైయితరోపాయమును జెప్పుచున్నారు.—

౩౨. తత్ప్రతిషేధార్థ మేకతత్త్వాభ్యాసః.

తా. ఆ చిత్తవిక్షేపముల యొక్క నివారణముకొఱకు తనకు ఇష్టమైన ఏకతత్త్వమును అభ్యాసము చేయవలయును.

వి. తనకు అభిమత మైనట్టి యేదేని యొక తత్త్వాభ్యాసమువలన చిత్తవిక్షేపములను నివర్తింపవలయును. అనఁగా, ఒకతత్త్వమునందు మనస్సును నిలుపుటకు అభ్యసింపవలయును.

బౌద్ధమతమున చిత్తము క్షణిక మని చెప్పఁబడి యున్నది. క్షణిక మనఁగా, క్షణక్షణమునకు ఒక్కొక్క చిత్తము కలుగు చుండుట. అట్లగుట వలన అదియును ఆయావిషయములను గురించిన జ్ఞానమే గాని వేఱు కాదు కావున బౌద్ధుని (వైనాశికుని) మత ప్రకారము చిత్తమునకు నేకాగ్రతయు విక్షేప మనునది లేకపోవుచున్నది. ఇదికాక స్థిరమైన చిత్తము నంగీకరింపక యుండిన, ఒకవస్తువును చూచుచున్న నేను దానిని తాఁకుచున్నాను అని, చూచుటకును తాఁకుటకును సాధనమైన ఒక చిత్తము గలిగి యున్నట్లు కలుగు అనుభవమునకు విరోధము కలుగుచున్నది. కావున బౌద్ధమతమునఁ జెప్పిన చిత్తము క్షణిక మనునది ఖండింపఁబడియెను.

అవ. చిత్తసంస్కారము నొసఁగునట్టి బాహ్యపరికర్మము లైన వేఱే యుపాయములను జెప్పుచున్నారు.

33. మైత్రీ కరుణా ముదితోపేక్షాణాం సుఖదుఃఖ పుణ్యాఽపుణ్యవిషయాణాంభావనా తశ్చిత్త ప్రసాదనమ్.

తా. సుఖము, దుఃఖము, పుణ్యము, పాపము (అపుణ్యము,) అనువానిని గురించిన మైత్రి (స్నేహము), కరుణ (దయ), ముదిత (సంతోషమును), ఉపేక్ష (ఉదాసీనము), అను నీవృత్తులను భావన చేయుటవలన చిత్తమునకు స్వచ్ఛ (ప్రసాదనము) కలుగుచున్నది.

వి. మైత్రి యనఁగా:—సుఖింపుచున్న సాధువులయందు మిత్రభావము నవలంబింపవలయును.

కరుణ యనఁగా:—దుఃఖింపుచున్న వారియందు కనికరము వహింపవలయును.

ముదిత యనఁగా:—పుణ్యము కలవారిని చూచి సంతోషపడవలయును.

ఉపేక్షయనఁగా :—పాపులయందు ఉదాసీనుఁడై యుండవలయును. ఇట్లనఁగా, సుఖవంతులనుజూచి అసూయపడకూడదు. దుఃఖవంతులను జూచి ఉపేక్షతో నుండరాదు. పుణ్యవంతులయెడ ద్వేషము చేయఁదగదు. పాపులయొక్క పాపములను జూచి అనుమోదింపరాదు. మఱియు వారితో ద్వేషమును వహింపరాదు.

ఇట్లు ద్వేషరాగాదులకు ప్రతికోటులైన (విరోధులైన) మైత్ర్యాదులను భావముచేయుటచేత (మైత్ర్యాద్యాచరణవలన) చిత్తము ప్రసన్నమై సంప్రజ్ఞాతసమాధుల కుపయుక్త మగును, అనఁగా, రాగద్వేషాదులే చిత్తవిక్షేపములను కలుగఁజేయుచున్నవి. మైత్ర్యాదులమూలముగా ఆరాగాదులను నిర్మూలము చేయనగు. అట్లు చేయుటచేత చిత్తము ప్రసన్నమైయేకాగ్రతను బొందును.

అవ. చిత్తైకాగ్రతకొఱకు అన్యోపాయమును వచించుచున్నారు.—

34. ప్రచ్ఛర్దన విధారణాభ్యాం వా ప్రాణస్య.

తా. ప్రాణవాయువును (ఊపిరిని) విడుచుటచేతను, నిలుపుటచేతను (రేచక పూరక కుంభకములచేతను), చిత్తైకాగ్రత (చిత్తస్థైర్యము) కలుగును.

వి. ప్రచ్ఛర్దన మనగా :—లోపలి యూపిరిని ప్రమాణముచొప్పున విడుచుట, ఇదే రేచకము.

విధారణ మనఁగా :—లోపలివాయువును వెలుపలికి ప్రసరింపనీయక పట్టి యుంచుట ; ఇదే కుంభకము. ఇది వెలుపలివాయువును లోపలపూరించి దానిని నిల్పుటచే నైనను, క్రొత్తగా పూరింపక అప్పటికున్న ఊపిరిని మాత్రము పట్టుటచేనైనను కలుగును. వీనిలో వెలుపలిగాలిని లోపలికి పూరించుటను పూరక మని చెప్పఁబడును. (కుంభకములో పూరకము చేరియుండుటవలన పూరకమును గుఱించి సూత్రమున చెప్పఁబడలేదు.) ఈ మూఁడును ప్రాణాయామ మనఁబడును. దీనివలన చిత్తమునకు స్థిరత్వము కలుగును.

మఱియు ప్రాణాయామము నాడిని శుద్ధి చేయును. సకలదోషము లను పోఁగొట్టును. దీనివలన చిత్తైకాగ్రత కలుగు నని చెప్పుటవలన 33-వ సూత్రమున చెప్పిన మైత్ర్యాదులనువదలి ప్రాణాయామమునుమాత్రము చేసిన చాలు నని యెంచక యీరెంటిని అవలంబింపవలయును. (ఈ విష యము 2-వ పాదము 49-సూత్రమున వివరింపఁబడును) —

అవ. సంప్రజ్ఞాత సమాధికి పూర్వము చిత్తస్థైర్యమును కలుగఁజేయు నింకొకయుపాయమును చెప్పుచున్నారు.—

34. విషయవతీ వా ప్రవృత్తిరుత్పన్నా స్థితి నిబన్ధినీ.

తా. శబ్దాదివిషయములవలనఁ గలుగు ప్రవృత్తి యైనను చిత్తస్థైర్య మును కలుగఁజేయును.

వి. యోగాభ్యాసి నాసాగ్రమునందు (ముక్కుకొనయందు) చిత్త మును నిల్పినేని దివ్యగంధజ్ఞానమును; జిహ్వాగ్రమందు (నాలుకకొనయందు) చిత్తమును నిల్పినేని దివ్యరసజ్ఞానమును, తాలుమూలమందు (దౌడయందు) చిత్తమును నిల్పినేని దివ్యరూపజ్ఞానమును; జిహ్వామధ్యమందు (నాలుక నడుమ) చిత్తమును నిల్పినేని దివ్యస్పర్శజ్ఞానమును; జిహ్వామూలమందు (నా లుకఅడుగున) చిత్తమును నిల్పినేని దివ్యశబ్దజ్ఞానమును కలుగును. అనఁగా, ఈ అభ్యాసమువలన చిత్తైకాగ్రత కలుగును.

అవ. మీఁద వివరించునట్టి చిత్తస్థైర్యమునకు వేఱొక యుపాయ మును వచించుచున్నారు.

35. విశోకా వా జ్యోతిష్మతీ.

తా. రజస్తమోగుణములచేఁ గలుగు దుఃఖము (శోకము) లేని సాత్త్వికప్రకాశావలోకనమువలన, సకలవృత్తులును లయమై చిత్తము స్థిరముగా నుండును.

వి. విశోకా=శోకములేనిది; జ్యోతిష్మతి=మంచిజ్యోతి, అనఁగా, సత్త్వగుణ సంబంధి యైన ప్రకాశము.

హృదయకమలమధ్యమందు అలలు లేని క్షీరసముద్రమువలె నుండు చిత్తముయొక్క సత్త్వమును భావన చేయుటవలనఁ గలుగు తేజస్సువలన (సాత్త్వికప్రకాశాలోకనమువలన) వృత్తు లన్నియును నశించును. అందు వలన చిత్తమునకు స్థైర్యము కలుగును.

అవ. ఉపాయాంతరమును బోధింప నెంచి తత్ప్రయోజన మైన అసంప్రజ్ఞాతసమాధియొక్క లక్ష్యమును వచించుచున్నారు.—

37. వీతరాగవిషయం వా చిత్తమ్.

తా. లోక వ్యాపారములయం దాశయును. ఆ వ్యాపారముల భావనయును లేని చిత్తము స్థైర్యమును బొందును.

వి. విషయాగులయందు అభిలాషయును, వాని జ్ఞాపకమును చిత్తమునకు రానీక చేయునట్టి వారి చిత్తము యేకాగ్రముగా నుండును. ఇది అసంప్రజ్ఞాతసమాధికి కారణ మైన యుపాయము గాన నిర్విషయక మైన చిత్తమే ఆ సమాధికి సాధక మగును. మఱియు వేదవ్యాసుఁడు మొదలగువారు విషయాదులయం దభిలాష లేనివారు. ఇట్టివారి చిత్తమును భావన చేయుటవలన భావన చేయువారి చిత్తమును వేదవ్యాసాదులవంటి దగు నని చెప్పఁబడి యున్నది.

అవ. పైని వివరించిన దానినిగూర్చి వేఱువిధముగాఁ జెప్పుచున్నారు.—

38. స్వప్ననిద్రాజ్ఞానాలమ్బనం వా.

తా. స్వప్నజ్ఞానమునుగాని, నిద్రా (సుషుప్తి) జ్ఞానమును గాని, భావనచేసెడి చిత్తము స్థైర్యముగా నుండును.

వి. స్వప్న మనఁగా:— బాహ్యేంద్రియముల వ్యాపారములు లేక మనోమాత్రముచేతనే విషయానుభవము (సుఖదుఃఖానుభవము) కలుగు

యున్నదో, యా యుత్కృష్ట స్వప్నము. అనఁగా:— స్వప్నమందు నిర్జనప్రదేశమునం దర్శనీయమైన మహేశ్వరస్వరూపమును (విగ్రహమును) గాంచి మేల్కొని ఆ స్వరూపమును భావన చేయుటచేతను చిత్తస్థైర్యము కలుగును.

స్వప్నమువలె నందు అభ్యాసముచేత సంప్రజ్ఞాతసమాధికిని, సుషుప్తివలె నందు అభ్యాసముచేత అసంప్రజ్ఞాతసమాధికిని సాధక మగు నని తెలియవలయును.

నిద్రపోయి లేచినతర్వాత తనకు సుఖముగా నిద్రపట్టినదని యెప్పుడు తోఁచునో, యానిద్ర సాత్త్విక నిద్ర. అట్టి సమయమున చిత్తము స్థైర్యముగా నుండును.

(నిద్రాస్వరూపమును ఈ పాదమునందే 10-వ సూత్రమునఁ జెప్పంబడియెను.)

అవ. యోగికి యిష్టవస్తు ధ్యానముచేతను చిత్తస్థైర్యము కల్గునని చెప్పుచున్నారు.—

39. యథాభిమతధ్యానా ద్వా.

తా. తనకు ఇష్టమైన వస్తువును ధ్యానము చేయుటవలనను చిత్తమునకు స్థైర్యము కలుగును.

వి. లోకమునందు మనుజులకు అనేకవిధములైన వాసన లుండుటంబట్టి యోగి యగువానికి యే వస్తువునందు వాసన యధికముగనుండి దానిపై శ్రద్ధ కలిగి యున్నదో, ఆ వస్తువును ధ్యానము చేసినను చిత్తమునకు స్థైర్యము కలుగును.

అనఁగా:— వెలుపలివస్తువు లగు చంద్రాదులనుగాని, లోపలివస్తువు లగు నాడీచక్రాదులనుగాని, భావనచేయుటవలన చిత్తైకాగ్రత కలుగును. సహజముగా తన కిష్టమైన వస్తువు శివ, రామ, కృష్ణాది రూపములుగానే

యుండును. గాన అట్టి స్వరూపధ్యానమువలన చిత్తము స్థిరమై యుండు నని భావము.

అవ. చిత్తస్థైర్యమువలన ప్రయోజనమును వచించుచున్నారు.—

40. పరమాణు పరమమహత్త్వాన్తో ఽస్యవశీకారః.
(పరమహత్త్వాన్తో ఽస్య) అని పాఠాంతరము.

తా. మున్ను వివరించిన ఉపాయములచేత చిత్తము స్థైర్యము నొంది యుండువానికి పరమాణువు మొదలు శ్రేష్ఠమైన మహత్తత్త్వము (బుద్ధి తత్త్వము) వఱకును వశీకారము (కలుగుచున్నది.)

వి. వశీకార మనఁగా:— అడ్డుబాటులేక గోచరించుట. చిత్తస్థైర్యము కలవానికి అతిసూక్ష్మ మగు పరమాణువు మొదలగు పరమమహత్తులగు ఆకాశాదులవఱకును చిత్తవృత్తి అడ్డుబాటులేక ప్రవర్తించును. సూక్ష్మతత్త్వములు పరమాణువు లనియును, స్థూలతత్త్వములు ఆకాశాది బుద్ధి తత్త్వ పర్యంత మనియును తెలియఁదగినది.

అవ. ఇంతవఱకు చెప్పఁబడిన యుపాయములచేత నిర్మలమైనట్టి చిత్త స్వరూపముయొక్క లక్షణమును జెప్పుచున్నారు.—

41. క్షీణవృత్తే రభిజాతస్యేవమణే ర్గ్రహీతృ గ్రహణ గ్రాహ్యేషు తత్స్థతదఞ్జనతా సమాపత్తిః.
(అభిజాత స్యేవ) అని పాఠాంతరము.

తా. వృత్తులన్నియు నశించిపోయిన చిత్తము ఆత్మయందును, ఇంద్రియములయందును, విషయములయందును కూడి యున్నప్పటికిని, దాని వలెనే యుండుట సమాపత్తి (సమాధి). ఇది నిర్మలమైన స్ఫటికమణివలె నుండును.

వి. గ్రహీత యనఁగా:— ఆత్మ (పురుషుఁడు).

గ్రహణ మనఁగా:— ఇంద్రియములు.
గ్రాహ్యము లనఁగా:— విషయములు.

సూత్రమున వివరింపఁబడిన క్రమము అవివక్షితముగాఁ దోఁచినను దానిని యీ విధముగా నన్వయించుకొనఁదగును. ప్రథమమున గ్రాహ్యము లయిన విషయములయందే యోగము (సమాధి = సమాపత్తి) కలుగును. తర్వాత గ్రహణము లయిన ఇంద్రియములయందు చిత్తము కలుగును. ఆ మీఁద గ్రహీత యైన ఆత్మయందు సమాధి కలుగును. అనఁగా, ప్రథమము నందే ఆత్మను భావన చేయుటకు సాధ్యము కాదని భావము.

దీనికి దృష్టాంతముగా స్ఫటికమణిని చెప్పఁబడెను. అనఁగా, స్ఫటిక మణి యేరంగుగల వస్తువుతోఁ జేరుచున్నదో, ఆరంగుగలదిగాఁ గనఁబడును. అట్లే వృత్తులు లయించిన యోగియొక్క చిత్తము నిర్మలమైయుండుట కారణ మునఁబట్టి చిన్మాత్రుఁ డైన సాక్షిపురుషునియందుగాని, ఇంద్రియముల యందుగాని, శబ్దాదివిషయములయందుఁగాని చేరియుండునప్పుడు ఆయా వస్తువులవలె నుండును.

చిత్తవృత్తులు లయించినమీఁద భావన చేయునట్టి వస్తువువలె చిత్త మునకు బరిణామము కలుగును. ఇదియే సంప్రజ్ఞాతసమాధి యనఁబడును. (ఈ విషయము ఈపాదము 17–వ సూత్రమున చెప్పఁబడియున్నది.)

అవ. సంప్రజ్ఞాతసమాధిభేద మైన సవితర్కసమాధిలక్షణమును జెప్పు చున్నారు —

42. శబ్దార్థజ్ఞానవికల్పైః స్సంకీర్ణా సవితర్కా.
(తత్ర శబ్దార్థజ్ఞాన) అని పాఠాంతరము.

తా. శబ్దము, అర్థము, జ్ఞానము, వికల్పము, వీనియొక్క కూటమి సవితర్కసమాధి యనఁబడును.

వి. తత్ర అనఁగా:—ఆ సమాధులు నాలుగింటిలో అని యర్థము.

శ్రోత్రేంద్రియ గ్రాహ్యమైనది శబ్దము. ఆ శబ్దముయొక్క విషయ మైన అర్థము. ఆ యర్థమువలన కలుగునది జ్ఞానము. ఆజ్ఞానము ఏక విధముగా భేదములేక తెలియుట వికల్పము. “విప్రః” అనునది శబ్దము. ఈ శబ్దమునకు వేదపాఠకుఁడు (బ్రాహ్మణుఁడు) అనునవి అర్థము. బ్రాహ్మణుఁడని తెలియుట జ్ఞానము. ఇట్లు శబ్దముతో అర్థమునకును జ్ఞానమునకును గూడ వికల్పము (అభేదము) కనఁబడుచున్నది. అభేదజ్ఞాన ముండునప్పుడు కలుగునదే సవితర్కసమాధి. మనచెవికి వినఁబడు ధ్వనివలన సూచింపఁబడెడు స్ఫోట మనెడు నిత్యశబ్ద మొకటి కలదని వైయాకరణులు చెప్పెదరు. ఇచ్చట శబ్దము ఏదిగా నున్నను బాధలేదు.

(ఈ పాదము 17-వ సూత్రమున సమాధులు నాలుగింటి వివరము చెప్పఁబడియున్నది.)

అవ. నిర్వితర్కసమాధిని చెప్పుచున్నారు.—

43. స్మృతి పరిశుద్ధౌ స్వరూపశూన్యే వార్థమాత్ర నిర్భాసా నిర్వితర్కా.

తా. తాను ధ్యానించుచుండు శబ్దార్థజ్ఞానముల వికల్పము పోయి, మఱియు ఆవస్తువుయొక్క శబ్దార్థజ్ఞానముల జ్ఞాపకమే లేక, అధ్యానవస్తువు మాత్రము అభిముఖమైయుండుట నిర్వితర్కసమాధి యనఁబడును.

వి. అనఁగా:—శబ్దార్థముల తలంపు పోయినప్పుడు తన స్వరూపము లేనట్లు విషయముమాత్రము స్ఫురించును. ఇదే నిర్వితర్కము. ఇట్లనఁగా తాను ధ్యానించుచుండు వస్తువుమాత్రమే ప్రకాశించునని భావము.

విషయ మనఁగా:—ఘటము, గోవు మొదలగు వస్తువులు.

బౌద్ధులమతమున పరమాణువుల సముదాయము ఘటాది పదార్థము లనియును, వేఱువస్తువు లేదనియును చెప్పఁబడి యున్నది. ఇది సరికాదు, ఎట్లనఁగా, పరమాణువులే ఘట మని చెప్పఁగా అభేదమును, పరమాణువుల

కలన ఘటము గలిగెనని చెప్పుటవలన భేదమును గలుగుచున్నది. గాని, ఘటమునకును పరమాణువులకును తాదాత్మ్యము కలదని తెలియఁదగినది.

అవ. సవిచార నిర్విచార సమాధిలక్షణములను జెప్పుచున్నారు.—

44. ఏతయైవ సవిచారా నిర్విచారా చ సూక్ష్మవిషయా వ్యాఖ్యాతా.

తా. స్థూలవిషయకము లైన సవితర్క నిర్వితర్కసమాధుల నిరూపణమువలన సూక్ష్మవిషయకములు గల సవిచార నిర్విచార సమాధులు నిరూపింపఁబడెను.

వి. ఇదివఱకుఁ జెప్పఁబడిన సవితర్క నిర్వితర్క సమాధులు స్థూలవిషయకములు. సవిచార నిర్విచార సమాధులు సూక్ష్మవిషయకములు. తక్కినవి రెండును సమానములుగా నుండును.

ఎట్లనఁగా:—పృథివ్యాది పంచమహాభూతములును, దశేంద్రియములును స్థూలభూతములు. ఈ స్థూలభూతముల శబ్దార్థజ్ఞానవికల్పములు గలది సవితర్కసమాధి యగుచున్నది. శబ్దార్థజ్ఞానవికల్పములు లేని స్థూలభూతములు మాత్రము గలది నిర్వితర్క సమాధి యగుచున్నది.

సూక్ష్మవిషయము లైన తన్మాత్రలైదును, అంతఃకరణమును లక్ష్యము చేసికొని యివి, ఎప్పుడు, ఎక్కడ, ఎట్లుపుట్టిన దనెడు విమర్శనముతో భావించుట సవిచారసమాధి యగుచున్నది.

ఇవి, ఎప్పుడు, ఎక్కడ, ఎట్లుపుట్టినది, అనెడి విమర్శనము లేక వానినిమాత్రము భావించుట నిర్విచారసమాధి యగుచున్నది.

అనఁగా:—సూక్ష్మవస్తువులు అప్పటిది, ఇప్పటిది, దీని కిది పేరు, అని యిట్లు దేశ, కాల, నామ, నిర్దేశముతో భావించుట సవిచారసమాధి యని

యును; అట్లు భావింపక సూక్ష్మవస్తువులుమాత్రము స్ఫురించెడు సమాధి నిర్విచారసమాధి యనియును తెలియఁదగినది.

సూక్ష్మవిషయము లనఁగా:—పంచతన్మాత్రలవలనఁ గలిగెడు పరమాణువులు.

అవ. సూక్ష్మవిషయములయొక్క అవధిని చెప్పుచున్నారు.—

47. సూక్ష్మవిషయత్వం చాలిఙ్గ పర్యవసానమ్.

తా. సూక్ష్మవిషయము లనునది ప్రధానతత్త్వమును (అలింగమును) కడగాఁ గలది.

వి. గుణముల పరిణామములచేఁ గలుగు తత్త్వములు విశిష్ట లింగ మని యును అవిశిష్టలింగ మనియును, లింగమాత్ర మనియును, అలింగ మని యును నాల్గు విధములు.

విశిష్టలింగ మనఁగా:—పంచమహాభూతములు.

అవిశిష్టలింగ మనఁగా:—దశేంద్రియములును, పంచతన్మాత్రలును.

లింగమాత్ర మనఁగా:—బుద్ధితత్త్వము.

అలింగ మనఁగా:—ప్రధానతత్త్వము. ఈ ప్రధానతత్త్వమునకంటె సూక్ష్మమైన విషయము లేదు.

మఱియు లింగ మనునది యెప్పటికిని లయమొందనిదియును, ఎచ్చటి కిని పోనట్టిదియు నని భావము.

పరమాణువులకంటెను తన్మాత్రలు సూక్ష్మములు. వానికంటెను అహంకారతత్త్వము సూక్ష్మము. దానికంటెను మహత్తత్త్వ మనెడు బుద్ధితత్త్వము సూక్ష్మము. మహత్తుకంటెను ప్రధానము (అలింగము) సూక్ష్మము. కావున దానికంటె సూక్ష్మమైనది మఱి యేదియును లేదు.

అవ. సవితర్క నిర్వితర్క సవిచార నిర్విచార సమాధులయొక్క ఏకవాక్యమును నిరూపించుచున్నారు.—

46. తా ఏవ సబీజ స్సమాధిః.

తా. ఇదివఱకుఁ జెప్పిన సవితర్క, నిర్వితర్క, సవిచార, నిర్విచార సమాధులు నాలుగును సబీజసమాధు లనఁబడును.

వి. సబీజ మనఁగా:—ఆలంబనము; లేక సంప్రజ్ఞాతము. అనఁగా విషయమును తాను అనుభవించునట్లు తెలియునట్టి సమాధులు సబీజ సమాధులు.

మఱియు నీ సమాధులలో ఆత్మకును అంతఃకరణమునకును భేదజ్ఞానము వుండదు కావున, సబీజ సమాధు లనఁబడియెను. బీజ మనఁగా, సంసారబంధముయొక్క బీజ మనియుఁ గలదు.

అవ. నిర్విచార సమాధియొక్క ప్రయోజనమును జెప్పుచున్నారు.—

47. నిర్విచారవైశారద్యే ఽధ్యాత్మప్రసాదః.

తా. నిర్విచార సమాధియొక్క అభ్యాసబలము వలన అధ్యాత్మ ప్రసాదము (బుద్ధికి నిర్మలత్వము) కలుగు చున్నది.

వి. అనఁగా సవితర్కమునకు ఫలము నిర్వితర్కమును, నిర్వితర్కమునకు ఫలము సవిచారమును, సవిచారమునకు ఫలము నిర్విచారమును అగుటంబట్టి నిర్విచారమునకు ఫలము అధ్యాత్మప్రసాద మని చెప్పఁబడినది.

అధ్యాత్మ ప్రసాద మనఁగా:—లోకములో నిదివఱకు జరిగియున్న సకల వ్యాపారములను ఒక్కమాఱు తన ఆత్మలోనే స్ఫురించుట.

వైశారద్య మనఁగా:— నిర్మలత్వము. నిర్మలత్వము కలిగినచో చిత్తమునకు దృఢమైన స్థిరత్వము కలుగును. అప్పుడు ఆత్మయు పరిశుద్ధము గలదై యుండును.

అవ. ఋతంభరప్రజ్ఞా లక్షణమును జెప్పుచున్నారు.—

48. ఋతుమ్భరా తత్ర ప్రజ్ఞా.

తా. బుద్ధికి నిర్మలత్వము కలిగినమీఁద యెప్పుడును వికల్పము నొందని సత్త్వముతోఁ గూడిన ప్రజ్ఞ కలుగును.

వి. అధ్యాత్మ ప్రసాదమువలనఁ గలిగెడు తెలివియే ఋతంభరము. ఋత మనఁగా సత్యము. దానిని భరించునది ఋతంభరము. అనఁగా అస త్యము లేని ప్రజ్ఞ (తెలివి) యని భావము.

అనఁగా:—నిర్మలమైన బుద్ధియందు వికల్పములేని నిజమైన ప్రజ్ఞా విశేషము (ఋతంభరాప్రజ్ఞ) కలవాఁడా ప్రజ్ఞవలన సకల పదార్థముల నిజ స్వరూపమును చక్కఁగా తెలిసికొనెడి శక్తి గలవాఁడై యోగమునందు అత్యుత్తమస్థితిని పొందును.

అవ. ఋతంభరాప్రజ్ఞయొక్క విశేషమును ప్రశంసించుచున్నారు.—

49. శ్రౌతానుమాన ప్రజ్ఞాభ్యాం సామాన్య విషయా విశేషార్థత్వాత్. (శ్రుతానుమాన ప్రజ్ఞాభ్యా మన్యవిషయా) అని పాఠాంతరము.

తా. సామాన్యముగా స్థూలవిషయక ప్రజ్ఞలైన ఆగమ ప్రమాణము చేతను, అనుమానప్రమాణముచేతను పుట్టునట్టి ప్రజ్ఞలకంటెను; ఋతం భరాప్రజ్ఞ సూక్ష్మవిషయములయందును, చిన్మాత్రుఁడైన పురుషుని యందును గల విశేషములను గోచరింపఁజేయును; గాన విలక్షణమైనది.

వి. శ్రుత మనఁగా:—ఆగమ (శబ్ద) ప్రమాణమువలనఁ గలిగెడు జ్ఞానము. అనుమాన మనఁగా:—తెలిసిన దానింబట్టి తెలియని దానిని ఊహించుట. ఆగమువలన సామాన్యములైన స్థూలవిషయముల ప్రత్యక్ష మును, అనుమానమువలన భూతసూక్ష్మాదుల పరోక్షజ్ఞానమును కలుగును.

ఋతంభరా ప్రజ్ఞవలన భూతసూక్ష్మములైన తన్మాత్రములయొక్కయు, అంతఃకరణముయొక్కయు, చిన్మాత్రుఁడైన పురుషునియొక్కయు, విశిష్టస్వరూపస్థితులు ప్రత్యక్షముగా చక్కఁగా తెలియును. అనఁగా సూక్ష్మమైనట్టియు, దూరమునం దుండునట్టియు, దగ్గఱ నుండునట్టియు, సకల వస్తురూపములు విమర్శనముగా తెలియును. కాఁబట్టి శ్రౌతానుమాన ప్రజ్ఞలకంటెను ఋతంభరాప్రజ్ఞ విలక్షణ మైనది.

ఈ ఋతంభరాప్రజ్ఞను తార్కికులు యోగజప్రత్యక్ష మని చెప్పెదరు. ఇది యుక్తప్రత్యక్ష మనియును, యుంజానప్రత్యక్ష మనియును రెండు విధములు. యోగసిద్ధి గలిగినవాఁడు యుక్తుఁడు. యోగాభ్యాసము చేయువాఁడు యుంజానుఁడు. యుక్తునకు కావలసినప్పుడు సకలవస్తువులును గోచరించును. యుంజానునకు సదా సకలవస్తువులును గోచరించు చుండును.

అవ. ఋతంభరా ప్రజ్ఞయొక్క ఫలమును జెప్పుచున్నారు.

50. తజ్జ స్సంస్కారో ఽన్యసంస్కార ప్రతిబన్ధీ.

తా. ఋతంభరా ప్రజ్ఞవలనఁ బుట్టిన సంస్కారము, ఇతరము లైన బహిర్ముఖజ్ఞానముచేఁ బుట్టిన సంస్కారములను నిరోధించును.

వి. ఋతంభరాప్రజ్ఞ, బహిర్ముఖముచే జనించిన సంస్కారములను నిర్విచారసమాధివలనఁ గలిగిన సంస్కారములను సహా తమ కార్యములను చేయుటకు సామర్థ్యములేని వానినిఁగాఁ జేయును. అనఁగా, కార్యకారి కాకుండ చేయును. తత్త్వజ్ఞానరూపము లగు సంస్కారములును బలము గలది యగుటచే ఇతర (అజ్ఞానమువలనఁ గల్గిన) సంస్కారములను బాధించును. కాఁబట్టి ఋతంభరా ప్రజ్ఞను దృఢముగా నభ్యసింపవలయును.

అవ. అసంప్రజ్ఞాతసమాధిలక్షణమును జెప్పుచున్నారు.—

51. తస్యాపి నిరోధే సర్వనిరోధా న్నిర్బీజస్సమాధిః.

తా. ఆ ఋతంభరాప్రజ్ఞకును, సంప్రజ్ఞాతసమాధికిని సహా నిరోధము కలుగఁగా, చిత్తవృత్తులు నశించును. అందువలన నిర్బీజసమాధి కలుగును.

వి. సానందసాస్మితసమాధులను, ఋతంభరాప్రజ్ఞను నిగ్రహించుటచేత, చిత్తమునందు యేవృత్తి కలిగినను దానిని కలుగనీయదు. అనఁగా సమస్త చిత్తవృత్తులును, స్వకారణమైన చిత్తమునందు లయించును. అప్పుడు శుద్ధబుద్ధముక్త స్వరూపమును నిత్యనిరతిశయ మహాకైవల్యస్థితియు నైన పురుషునియొక్క స్వస్వరూపస్థితి కలుగుచున్నది. అనఁగా చిన్మాత్రుఁడైన పురుషుఁడు స్వస్వరూపమున నున్నవాఁ డగుచున్నాఁడు. ఇది జననమరణప్రవాహరూపమైన ఘోరసంసారములోఁ దగులనీయక చేయును; గాన నిర్బీజసమాధి యని చెప్పఁబడెను.

పాతంజల యోగశాస్త్రమునందు

యోగపాదము

సమాప్తము.

ఓమ్.

శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః.

పాతంజలయోగశాస్త్రము.

౨. సాధనపాదము.

శ్లో. తే తే దుష్ప్రాపయోగర్ద్ధి సిద్ధయే యేన దర్శితా,
ఉపాయా స్స జగన్నాథ స్త్ర్యక్షీశో ఽస్తు ప్రార్థితాప్తయే.

అవ. క్రియాయోగస్వరూపమును నిరూపించుచున్నారు.—

1. తప స్స్వాధ్యా యేశ్వరప్రణిధానాని క్రియాయోగాః.

తా. కృచ్ఛ్రచాంద్రాయణాది తపస్సులును, వేదమంత్రముల జపమును, ఫలాపేక్ష లేక తాను జేయుకర్మముల నీశ్వరున కర్పించుటయును, క్రియాయోగము లనఁబడును.

వి. ప్రథమపాదమున యోగస్వరూపమును, యోగోపాయములను, యోగవిధానములను, సమాహితచిత్తునకు (స్వస్థచిత్తునకు) సబీజ నిర్బీజ సమాధిరూపం బగు యోగమును చెప్పఁబడియె. ఇప్పుడు యోగాపేక్ష గల చపలచిత్తునకు (వ్యుత్థితచిత్తునకు) సాధ్య మెట్లగు నని యాలోచించి యోగమునకు సాధక మైన యీ సాధనపాదమునందు క్రియాయోగముల క్రమము మొదలగువానిని వివరింపఁబడెడిని. తపము చేయుటయైనను ధాతువైషమ్యమును బొడమించి చిత్తమును కలఁపునంత చేయఁదగదు.

ఎట్లనఁగా:—బంగారమును పుటము బెట్టుట, అందలి దోషమును దొలఁగించుటకు మాత్రమేగాక, బంగారమును భస్మముచేయుటకు గాదు. కాఁబట్టి జాగరూకతతో తపం బొనరింపవలయును.

తప మనఁగా:— శాస్త్రాంతరోపదిష్ట మైన కృచ్ఛ్రచాంద్రాయణాదులు.

స్వాధ్యాయ మనగా :—ప్రణవపూర్వక మైన మంత్రానుష్ఠానము.

ఈశ్వరప్రణిధాన మనఁగా :—ఓంకారవాచ్యుండైన ఈశ్వరుని ఉపాసించుట. (దీనిని **1**-పాదము **26-27**-వ సూత్రములను చూడుఁడు).

అవ. క్రియాయోగ ప్రయోజనము వచించుచున్నారు.—

2. సమాధిభావనార్థః క్లేశతనూకరణార్థశ్చ.

తా. పైని చెప్పిన క్రియాయోగము సమాధిస్థితికరణమునకును, క్లేశములు నశించుటకును వుపయోగ మైనది.

వి. ఈ క్రియాయోగము సమాధిని నిష్పన్న మొనరించి అవిద్యాది క్లేశములను క్షీణింపఁ జేయును. అందువలన నిర్మలసత్త్వ పురుషఖ్యాతియును, చిత్తైకాగ్రతయును కలుగును. యోగాపేక్ష కల చపలచిత్తు లగు వారెల్లరు నీ క్రియాయోగమును చేయవలయును.

అవ. పంచక్లేశములను నిరూపించుచున్నారు.—

3. అవిద్యాస్మితా రాగద్వేషాభినివేశాః పఞ్చక్లేశాః.

తా. అవిద్య, అస్మిత, రాగము, ద్వేషము, అభినివేశము అను నీ యైదును క్లేశములు.

వి. క్లేశము లనఁగా :—విపర్యయము లనియును, మిథ్యాదృష్టిరూపము లనియును తెలియునది. (ఈ విషయమును 1 పాదము 7-వ సూత్రమున చూడుము).

అజ్ఞానమనునది అవిద్య; నాకు సంభవించునదికదా యనునది అస్మిత. ప్రపంచసుఖ సాధనారూపమైనది రాగము; తన సంకల్పమునకు కలుగ విఘ్నములను తొలగించికొనుటకు బుట్టునది ద్వేషము; సకలలక్షణ సం స్థితితో జీవించుచుండవలయు నను ఆశారూపకమైనది అభినివేశము. ఇ యోగమునకు విఘ్నకారులు. సంసారమును వృద్ధిచేయును; దుఃఖమున కలుగఁజేయును; కావున క్లేశము లనఁబడియెను. అనఁగా, బాధారూ మైన పరితాపమును కలుగఁజేయునది. ఇవి చిత్తమునందు నెలకొని సంసా లక్షణమైన ప్రాపంచికధర్మమును దృఢపఱచును.

అవ. అవిద్యయే క్లేశమునకు ప్రధానకారణ మని చెప్పుచున్నారు.—

4. అవిద్యా క్షేత్రముత్తరేషా ప్రసుప్త తనువిచ్ఛిన్నో దారాణామ్.

తా. అవిద్యాదిక్లేశములు పరస్పరము సమానములుగా నున్నను, (నిద్రోపశమన విచ్ఛిన్నోదారములైనను) క్లేశములకు ప్రధాన కారణమైనది అవిద్య యనఁబడును.

వి. నేను నే నని బుద్ధికి అభేదముగా నాత్మనెఱిగించునట్టి అస్మిత యనెడు క్లేశమునకును; సుఖానుస్మృతిచేత నగునట్టి ఆయా వస్తువులయందు గలుగు స్వీకారేచ్ఛారూపంబగు రాగంబునకును; దుఃఖకర మనియెడు అనుస్మృతిచేత ఆయావస్తువులందుఁ గలుగు పరిహారబుద్ధిరూపంబగు ద్వేషంబునకును; ఇఁకను కాఁబోవు యిష్టభంగమరణాదికము ననుసరించి కలుగునట్టి భయరూపంబగు అభినివేశంబునకును; ఆధారమై (జన్మస్థానమై) యుండునట్టిది అవిద్య యనఁబడును.

అనఁగా:—ప్రాణులు బాల్యదశయందు తమతమపనులను చేయుటకు శక్తిచాలక చిత్తముఁను పరుండి నిద్రపోవునట్లుగను, ఆ బాల్యావస్థపోయి యౌవనావస్థవచ్చుట పూర్వస్థితియందుండు ప్రాణులయందు ప్రజ్ఞ గల

శరీరములు కలిగియుండునట్లును, యౌవనావస్థయందు ఒకదానిలో నొకటి మిశ్రము గాక తమతమ పనులను చేయుచుండునవిగను, యౌవనాంతరావస్థలయందు క్రమముగా వృద్ధి యగు ఉత్కృష్టదశ కలవిగను నుండునట్టి అస్మితము, రాగము, ద్వేషము, అభినివేశము అను వీనికి అవిద్యయే కారణము. ఎట్లన ; ప్రాణులయొక్క బాల్యాద్యవస్థలయందు వృద్ధి యగుచు వచ్చుచుండినట్లెల్లను, అస్మిత రాగ ద్వేషాభినివేశములు ఆ యవిద్యయొక్క సహాయబలముచేతనే క్రమక్రమముగా వృద్ధి యగుచు వచ్చుచుండుటవలన తక్కిన క్లేశములకు అవిద్యయే మూలకారణము. కాబట్టి అవిద్యను సమ్యగ్జ్ఞానముచే నివర్తింపఁజేసినచో తక్కిన క్లేశములు పుట్టుటకు అవకాశము లేక పోవును.

మఱియు అసంప్రజ్ఞాత సమాధినిష్ఠులయందు ఈ అవిద్యాదులు దగ్ధబీజములవలె నిర్మూలమగుచున్నవి. సానంద సాస్మిత సమాధినిష్ఠులయందు నిద్రపోవుచున్నవి. సవిచార నిర్విచార సమాధినిష్ఠులయందు శరీరములు కలవిగా నున్నవి. సవితర్క నిర్వితర్క సమాధినిష్ఠులయందు విరళములై తమతమ పనులను చేయుచున్నవి. కర్మఠులయందును ఇతరులయందును ఉత్కృష్ట స్థితియందున్నవి. గాన, అవిద్యను విడుచుటకు ప్రయత్నింపవలయును. అస్మితాదులు నాలుగింటికిని ప్రసుప్తి, కృశత, విచ్ఛేదము, ఔత్కట్యము అని నాలుగు దశలు కలవు. వీనికిని అవిద్యయే మూలము.

విదేహ ప్రకృతిలయులయందు బీజశక్తితోనే యుండుట ప్రసుప్తి; విరుద్ధముగా భావించుటచేత బలము తగ్గియుండుట కృశత; ఇవి రెండును రోగవశముచేఁ బుట్టిన యవస్థలు క్రోధము కలుగునప్పుడు కామమునకు కలుగుభంగము విచ్ఛేదము ; కామినీసమావేశాధి నిమిత్తములచేఁ గలుగు ప్రకోపము ఉత్కటము ; వీనికన్నిటికిని (కుండకు మన్ను ప్రకృతి యైనట్లు) అవిద్యయే ప్రకృతి అనఁగా నిమిత్తకారణము.

ఈ యవిద్య తగ్గుచు హెచ్చుచు ఉపచయాపచయములు గల వస్తువుతో తుల్యముగా నుండుటంబట్టి దీనికి నాశము కలుగును. కావున దీనిని నివర్తింపఁ జేయనగును.

అవ. అవిద్యాక్లేశస్వరూపమును నిరూపించుచున్నారు.—

5. అనిత్యాశుచి దుఃఖానాత్మసు నిత్యశుచి సుఖాత్మ ఖ్యాతి రవిద్యా.

తా. అనిత్యము లైన వస్తువులయందు నిత్యత్వమును, అపరిశుద్ధమైన దేహాదులయందు శుచిత్వమును, దుఃఖాదులైన ప్రపంచ విషయములయందు సుఖత్వమును, ఆత్మ కాని శరీరమునందు ఆత్మతత్త్వమును భావించుట అవిద్య యనఁబడును.

వి. అనిత్య మనఁగా :— పృథివి, వస్త్రములు, పాత్రములు, ఆభరణములు మొదలైనవి.

అశుచి యనఁగా :— కామినీదేహాదులందు పరభోగ్యతా రూపమును స్వదేహాదులును.

అసుఖత్వ మనఁగా :— దుఃఖాత్మక మగు జన్మము; లేక ప్రాపంచిక విషయజ్ఞానము.

అనాత్మ యనఁగా :— స్వశరీర పుత్త్ర దారాదులు.

అవిద్య యనఁగా :— లేని యంశమును వున్నట్లు కనఁబఱచునట్టి యొక విధమైన బుద్ధియేగాని అభావ మైనదికాదు ఇది అనాదిగా ఆత్మతో నంటి యుండు మత్తత దీనిని పరాకుగా నుండెడి మదదశ యనవచ్చును.

వి: భ్యారూపమైన అనిత్యమందు నిత్యత్వజ్ఞానమును, అశుచిత్వమునందు శుచిత్వజ్ఞానమును, దుఃఖాత్మకమునందు సుఖత్వజ్ఞానమును, అనాత్మయందు ఆత్మతత్త్వజ్ఞానమును కలిగియుండుటకు కారణము అవిద్యయగును. ఇట్లు అపుణ్యకార్యములందు పుణ్యత్వజ్ఞానమును, అనర్థములయందు అర్థత్వ

జ్ఞానమును కలిగించి సంసారమును వృద్ధిచేయును గాన, అవిద్యను తొలఁగఁ ద్రోయవలయును.

అవ. అస్మితాక్లేశ స్వరూపమును నిరూపించుచున్నారు.—

6. దృగ్దర్శనశక్త్యో రేకాత్మతై వాస్మితా.

తా. చిన్మాత్రుఁడైన సాక్షిపురుషుఁడు, రజస్తమోగుణములు లేని శుద్ధసాత్త్విక పరిణామరూపమైన అంతఃకరణము, వీనియొక్క ఐక్యము అస్మిత యనెడు క్లేశ మనఁబడును.

వి. పురుషుఁడు అజడము, అంతఃకరణము జడము; పురుషుఁడు భోక్తృవు, అంతఃకరణము భోగ్యము, ఇట్లు పరస్పరము భిన్నరూపములైనను, వీనిభేదము తెలియకయుండు జ్ఞానముచేఁ గలుగు నేననెడు అభిమానము అస్మిత యనఁబడును. చిన్మాత్రుఁడైన పురుషుఁడు దృక్ఛక్తి, బుద్ధితత్త్వము, దర్శనశక్తి; వీనియొక్క ఐక్యాధ్యాసము అస్మిత.

అనఁగా:—భోక్తృశక్తియైనట్టి పురుషతత్త్వమునకును, భోగ్యశక్తియైనట్టి బుద్ధితత్త్వమునకును అత్యంతవిభాగమును, అత్యంత సంకరమును కలిగియుండఁగా, నేననెడు అభేదాధ్యాసమువలన భోగకల్పనము కలుగును. ఇట్లు కలుగుటకు అస్మితయే కారణము.

అవ. రాగక్లేశలక్షణమును నిర్వచించుచున్నారు.—

7. సుఖానుశయీ రాగః.

తా. ప్రపంచసుఖమును అనుసరించుటయే రాగ మనెడు క్లేశ మనఁబడుచున్నది.

వి. విషయసుఖములను తెలిసినవానికి, ఆ సుఖముల జ్ఞాపకమువలన, అట్టి సుఖములకుఁ గారణమైన విషయములయందు అభిలాష కలుగుటయే రాగము. అనఁగా, సుఖజ్ఞునకు సుఖానుస్మృతి పూర్వకంబుగా సుఖసాధనంబున జనించు ఆసక్తి రాగము.

అవ. ద్వేషక్లేశ స్వరూపమును వివరించుచున్నారు.—

8. దుఃఖానుశయీ ద్వేషః.

తా. దుఃఖమును అనుసరించి యుండునది ద్వేష మనెడు క్లేశ మనఁబడుచున్నది.

వి. దుఃఖజ్ఞునకు దుఃఖానుస్మృతి పూర్వకముగా దుఃఖసాధనమున జనించునట్టి వైరమే ద్వేషము అనఁగా దుఃఖము ననుభవించియుండు తలంపు వలన ఆ దుఃఖమునకు హేతువులైన వానియందు అవి తనకు గలుగఁగూడ దనెడు తిరస్కారజ్ఞానము ద్వేషము.

అవ. అభినివేశక్లేశ లక్షణమును చెప్పుచున్నారు.—

9. స్వరసవాహీ విదుషోఽపి తథా రూఢోఽభినివేశః.

తా. పిపీలికాది బ్రహ్మపర్యంతముగల ప్రాణులకు నిమిత్తములేకయే జన్మాంతర సంస్కారబలముచేత శరీరమునకును, విషయములకును, తనకును యెడఁబాటు కలుఁగఁగూడ దనెడు భయరూపమైన జ్ఞానము అభినివేశమనెడు క్లేశ మనఁబడుచున్నది.

వి. తనకు పూర్వజన్మమున కలిగిన మరణదుఃఖానుభవ వాసనచేత శరీరమునకును, విషయములకును, తనకును, వియోగము (ఎడఁబాటు) కలుఁగఁగూడ దనెడు అభినివేశమును వహించియుండునట్టి భయరూపమైన నిత్యసంబంధము తెలిసినవానికిగూడ పైన జెప్పినవి గోచర మగుచుండుటయే అభినివేశ మనెడు క్లేశము.

స్వరస మనఁగా స్వభావము, అనఁగా, వాసనాత్మకముగా మొదటనుండి తొలఁగక వస్తువులజూచునపుడు పయికి వుప్పొంగు మరణభయము అభినివేశము. ఇది పరోక్షజ్ఞానము కలవానికిని అజ్ఞానికిని కలుగును.

అవ. సకల క్లేశపరిహారోపాయమును జెప్ప నుద్దేశించి యిపుడు సూక్ష్మరూప క్లేశములను త్యజించుట కుపాయమును వచించుచున్నారు.—

10. తే ప్రతిప్రసవహేయాః సూక్ష్మాః.

తా. సూక్ష్మరూపము లైన పైన జెప్పిన క్లేశములను ప్రతిలోమ పరిణామముచేత నిరాకరింపవలయును.

వి. సూక్ష్మరూపము లైన ఆ క్లేశములను క్రమముగా నొకదాని విడిచిన యనంతరము మఱియొకదానిని విడువవలయును. అనఁగా, అభినివేశమును విడిచినమీఁద ద్వేషమును, తర్వాత రాగమును, అవల అస్మితను, ఆ పిమ్మట అవిద్యను విడువవలయును ఇట్లు వీనిని తెలిసి క్రమక్రమముగా విడుచుటవలన అవిద్య నశించును. మఱల అవి కలుగవు.

అవ. స్థూలరూపములైన క్లేశములను నివృత్తి చేయుట కుపాయమును బోధించుచున్నారు.—

11. ధ్యానహేయాస్తద్వృత్తయః.

తా. తమకార్యములను చేయుటకు ప్రారంభించియుండు ఆక్లేశములయొక్క సుఖ దుఃఖ మోహ రూపము లైన వృత్తులను చిత్తైకాగ్రతవలన నివృత్తి చేయవలయును.

వి. సుఖ దుఃఖ మోహ రూపము లైన క్లేశవృత్తులను చిత్తైకాగ్రతవలన త్యజింపవలయును. స్థూలము లైన వృత్తులు చిత్తపరికర్మము లగు మైత్రి, కరుణ, ముదితాదులవలన నివర్తించును. ఎట్లనఁగా, మైలతోఁ గూడిన వస్త్రమును నీటిలో వైచి వుతికినమాత్రముచే నెట్లు మైల పోవుచున్నదో, అప్రకార మని భావము. మఱియును. ఆ వస్త్రమునందలి కఱ పొందలగువానిని చాటినీటిలో కడిపి వుడకబెట్టుటవలనను, ఎండలో వైచుటవలనను, ఏలాగు స్వచ్ఛ మగుచున్నదో, ఆలాగు క్లేశవృత్తులు వానికి విరోధము లైన కర్మానుష్ఠానములచేత నశించి పోవుచున్నవి.

అవ. కర్మములకును కర్మఫలములకును కారణ మైన క్లేశస్వరూపమును జెప్పుచున్నారు.—

12. క్లేశమూలః కర్మాశయో దృష్టాదృష్ట జన్మవేదనీయః.

తా. పుణ్యపాప మిశ్రకర్మములకు మూలకారణ మైనది దుఃఖరూపము లైన క్లేశములు. ఇట్టి వాసనారూప మైన కర్మములు ఈ జన్మమునందును, జన్మాంతరమునందును అనుభవింపఁదగినవిగా నున్నవి.

వి. దుఃఖమునకు హేతువును, క్లేశములకు కారణము నై యుండు పుణ్య పాప మిశ్రకర్మముల సంస్కారమును, వానియొక్క ఫలమును, ఈ జన్మమునందును జన్మాంతరమునందును అనుభవింపఁదగినవిగా నున్నవి. వాసనారూపము లైన యీ పుణ్య పాప మిశ్రకర్మములయొక్క ప్రబల దుర్బలానుగుణ్యముగా పూర్వజన్మమునందలి వానినికూడ ఈ జన్మమునందే అనుభవింపవలసిన దగుచున్నది. ఎట్లనఁగా:—

నందికేశ్వరుఁడు బాల్యమునందే అతిత్వరగా మహాపుణ్యఫలము నొసంగు పశుపతిపూజ యనెడి కర్మముచేత ఆజన్మమునందే దేవత్వమును, సంపూర్ణాయువును, దివ్యభోగములను బొందెను.

ధ్రువ, ప్రహ్లాదాదుల చరిత్రములును విస్పష్టమే.

విశ్వామిత్రుఁడు పుణ్యకర్మోత్కృష్టత్వముచేత క్షత్రియజాతిని విడిచి బ్రాహ్మణుఁ డాయెను.

నహుషుఁడు, అత్యంతపాతకము లొనర్చినందుచే ఆ జన్మమునందే సర్పజన్మమును బొందెను.

ఊర్వశి కుమారవనమునందు లతారూపము నొందెను.

సౌభరి కర్మవైచిత్ర్యముచేత ఆ జన్మమునందే అనేకశరీరములను బొందెను.

ఈ ప్రకారముగా పుణ్యపాప మిశ్రకర్మముల బలమునకుఁ దగినట్లు ఆ సంస్కారఫలములను ఈ జన్మమునందును, జన్మాంతరమునందును అనుభవింపవలసి యున్నది.

అవ. కర్మవాసనాఫలమును నిరూపించుచున్నారు.—

13. సతిమూలే తద్విపాకో జాత్యాయు ర్భోగాః

తా. అనాదికాల సంచిత కర్మపరిపాకముకలన జాతి, ఆయువు భోగము అనునివి యేర్పడుచున్నవి.

వి. అవిద్యాది క్లేశములు నశించువఱకును, ఆ పుణ్యపాప మిశ్ర కర్మముల పరిపాకఫల మగు జాతియు (జన్మమును), చిరకాల జీవితమును, సుఖదుఃఖములకుఁ గారణ మైన యింద్రియవిషయములను (భోగములను) కలుగుచుండును.

ఇంద్రియవిషయములు గంధాదులనియు; జాతి (జన్మము) యొక్క ఆయువు ఆయాప్రాణికి నిర్ణీతమై యుండు కాలమునకు కనియు నెఱుంగవలయును.

అవ. కర్మపరిపాక పుణ్యపాపఫలమును జెప్పుచున్నారు.—

14. తేహ్లాద పరితాపఫలాః పుణ్యాపుణ్య హేతుత్వాత్.

తా. పుణ్య పాప కర్మల హేతువువలన సుఖదుఃఖఫలములు కలుగుచున్నవి.

వి. పుణ్యపాప కర్మపరిపాకముచేఁ గలుగు జాత్యాయుర్భోగములు సంతోషమునకును, పాపకర్మపరిపాకముచేఁ గలుగు జాత్యాయుర్భోగములు దుఃఖమునకును కారణములై యున్నవి.

సుఖదుఃఖాదులను గలుగఁజేయు కర్మము, కాయిక వాచిక మానసిక భేదములచే సదా జరుగుచుండుటవలన అనేకజన్మములు కలుగుచున్నవి. ఈకర్మము జన్మజన్మమునందును వృద్ధి యగుచుండును.

అవ. కర్మఫలములు యోగులకు దుఃఖరూపమై యున్న దని చెప్పుచున్నారు.—

15. పరిణామ తాప సంస్కార దుఃఖైర్గుణవృత్తివిరోధా
చ్చ దుఃఖ మేవ సర్వం వివేకినః.

తా. వివేకులకు (యోగులకు) కర్మముచేఁ గలుగు సుఖదుఃఖాదు లన్నియును దుఃఖరూపములుగానే యుండును.

వి. సుఖముల ననుభవించుటయందు గల గుణవృత్తి దుఃఖరూపమే గావున, వివేకులకు సర్వమును దుఃఖమే యగును. పతితము క్లేశాదులస్వరూపము నెఱింగిన వివేకి (యోగికి) భోగసాధనమైన సకలమును, విషమిశ్రమైన అమృతమువలె దుఃఖరూపగానే యుండును.

ఈ దుఃఖము పరిణామదుఃఖమనియు, తాపదుఃఖమనియు, సంస్కార దుఃఖమనియు మూఁడువిధములుగాఁ జెప్పఁబడియున్నవి.

పరిణామదుఃఖ మనఁగా—తా ననుభవించునది ముగిసి పోవుటవలన మరల దానిని సంపాదింపవలయు ననెడి దుఃఖము.

తాపదుఃఖ మనఁగా—తా ననుభవించునట్టి విషయమునకు విరోధి యైనది పోలే దనెడి దుఃఖము.

సంస్కారదుఃఖ మనఁగా—తన కిష్టమైన పదార్థముతోఁ గూడ అనిష్టమైన పదార్థ ముండుటవలనఁ గలుగు దుఃఖము.

కావున సత్త్వాదిగుణములచేఁ గలుగు సుఖదుఃఖమోహరూప మైన వృత్తులను (భావించుచును) భావింపఁదగిన ఫలియును అను నీ భేదములవలన పరస్పరము విరోధము కలుగుచున్నది. వివేకి యగువాఁడు దుఃఖరూపకము లైనట్టి సర్వమును త్యజింపఁదగినది.

అవ. యోగి క్లేశకర్మాదులను త్యజింపక గాని, మోక్షము నొందఁడని చెప్పుట కుద్దేశించి రాఁగల దుఃఖమును త్యజింపవలయునని వచించుచున్నారు.

16. హేయం దుఃఖ మనాగతమ్.

తా. ఇఁకను రాఁగల (అనాగత) దుఃఖమును విడువఁ దగినది.

వి. ఇదివఱకు అనుభవించిన దుఃఖములు గడచిపోయినందువలనను, ఇప్పుడనుభవించుచుండు దుఃఖములను విడుచుటకు శక్యము గాకుండుటవలనను, రాఁగల సంసారదుఃఖమును త్యజింపఁదగినది.

అవ. దుఃఖకారణమును జెప్పుచున్నారు.—

17. దృగ్దృశ్యయో స్సంయోగో హేయ హేతుః.
(ద్రష్టృ దృశ్యయోః) అని పాఠాంతరము.

తా. దృగ్దృశ్యములసంయోగమే దుఃఖమునకు కారణము.

వి. చిన్మాత్రుఁడైన పురుషునకును, బుద్ధితత్త్వమునకును, అజ్ఞానమూలకముగాఁ గలిగిన సంబంధము, గుణపరిణామరూపమైన దుఃఖమునకు కారణమై యున్నది.

చిన్మాత్రుఁడైన, (సాక్షిభూతుఁడైన) పురుషుఁడు ద్రష్ట, ఆత్మ యనియుఁ జెప్పవచ్చును. బుద్ధి దృశ్యము.

దృశ్యమనఁగా—చూడఁబడునది. ద్రష్ట యనఁగా—చూచునది.

అనఁగా, బుద్ధి ఆత్మల సంయోగము సంసారమునకును దుఃఖమునకును గారణము.

అవ. దృశ్యస్వరూపమును, దాని కార్యమును, దాని ప్రయోజనమును నిరూపించుచున్నారు.—

18. ప్రకాశ క్రియాస్థితి శీలం భూతేన్ద్రియాత్మకం భోగాపవర్గార్థం దృశ్యమ్.

తా. ప్రకాశము, ప్రవృత్తి, స్థితి ఇవియే స్వరూపముగాఁ గలదియును, (పృథివ్యాది స్థూలభూతములు, గంధతన్మాత్రాది సూక్ష్మభూతములు, శ్రోత్రాది జ్ఞానేంద్రియములు, వాగాదికర్మేంద్రియములు, బుద్ధ్యాది అంతఃకరణములు, ఈ రూపకమైన కార్యరూపమైనదియును) భోగమోక్షములు ప్రయోజనముగాఁ గలదియును; అగునట్టిది దృశ్యమనఁబడును.

వి. ఎట్లనఁగా— ఈదృశ్యము ఆత్మవలన చేతనజ్ఞానములను పొందఁదగిన ప్రకాశరూపక మైన సాత్త్వికమును; ప్రవృత్తిరూపకమైన కర్మము చేయఁదగినట్టి రాజసమును, నియమరూపక మైన స్థితి గల తామసమును గలుగఁజేయునదిగా నున్నది.

అవ. దృశ్యావస్థాభేదములను, దాని ప్రయోజనమును జెప్పుచున్నారు.

19. విశేషావిశేష లిఙ్గమాత్రాలిఙ్గాని గుణపర్వాణి.

తా. మహాభూతములును ఇంద్రియములును విశేషలింగములు. తన్మాత్రలును, అంతఃకరణమును అవిశేషలింగములు. బుద్ధి లింగమాత్రము. ప్రధానము అలింగము ఇవి సత్త్వాదిగుణములయొక్క అవస్థలు.

వి. సత్త్వరజస్తమోగుణముల అవస్థావిశేషములు నాలుగు విధములు. ఇవన్నియును ప్రధానతత్త్వమైన అవ్యక్తముతోఁ జేరినవి. కావున ఈ నాలుగుభేదములను తెలిసికొనుట యోగమునకు ప్రయోజనకర మైనది. (1-వ పాదము 45-వ సూత్రమును చూడుము.)

అవ. చిన్మాత్రస్వరూపమును నిరూపించుచున్నారు.—

20. ద్రష్టా దృశిమాత్రశ్శుద్ధోఽపి ప్రత్యయానుపశ్యః.

తా. పురుషుఁడు చిన్మాత్రుఁడును, పరిణామాద్యవస్థలు లేనివాఁడు నైనను, విషయములను గ్రహించు బుద్ధిని యనుసరించి యుండుటవలన చూచువాఁడై యున్నాఁడని వ్యవహరింపఁబడుచున్నాఁడు.

వి. పురుషుఁడు (ద్రష్ట) సాక్షిరూపుఁ డైన చేతనమాత్రుఁడే. పరిణామాది ధర్మము లేవియు లేని పరిశుద్ధుఁ డైనవాఁడే. అయినను, విషయచైతన్యమును పరిగ్రహించు జ్ఞానము నంటియుండుటంబట్టి ద్రష్ట (సాక్షి) యని చెప్పఁబడుచున్నాఁడు.

పురుషుఁడు విషయోపరక్తయైనబుద్ధికి అతిసమీపమున నుండువాఁడగుటవలన బుద్ధికి యనుభవ మగు సకలదుఃఖాదులను తాను అనుభ

వించువాఁ డనెడు వ్యవహారములతో సంబంధించినవాఁ డగుచున్నాఁడు. అయినను ఈ పురుషుఁడు త్రికాలబాధ్యుం డనియును, ఆత్మయనియును చెప్పఁబడుచున్నాఁడు.

అవ. చిన్మాత్రుఁడే భోక్త యని తెలుపుచున్నారు.—

21. తదర్థ ఏవ దృశ్యస్యాత్మా.

తా. ఆ దృశ్యముయొక్క ప్రయత్నరూప మైన స్వరూపము ఆ పురుషునియొక్క ప్రయోజన మై యున్నది

వి. దృశ్యమునకు పురుషునిశక్తివినా వేఱొకశక్తి లేదు కావున ఆత్మచైతన్యమును బొంది పురుషునకు భోగ్యమై యుండు ఈ దృశ్యముయొక్క స్వరూపమును, ప్రయత్నమును, ఆ పురుషునికే యైయుండుటవలన అనుభోక్తృవు పురుషుఁడే యగుచున్నాఁడు.

ఎట్లన:— నిశ్చయముగా ఆత్మకు దేహముచం లేవిధ మైన భోగానుభవము (లోకానుభవము) లేకుండినను, ఆత్మచైతన్యమును బొంది యుండు కరణేంద్రియాదుల వ్యాపారము లన్నియును ఆత్మార్థముగ నెట్లున్నదో, అట్లే పురుషునియొక్క చైతన్యమును బొంది సృష్ట్యాది నానాకార్యములను చేసి నిర్వహించుచుండు ముఖ్య మైన పనులెల్లను, ఆ పురుషునికొఱకు భోగమును సంపాదించి యిచ్చెద ననెడు భావము కలిగియుండుటంబట్టి ఆ భోగములను అనుభవించువాఁడును, ఆ పురుషుఁడే యగు చున్నాఁడు. కాఁబట్టి, ఆ పురుషునికొఱకే ప్రధానమును ప్రవర్తించుచున్నది. అనఁగా ఆ పురుషుఁడే అనుభోక్తృ వని భావము.

అవ. బంధ ముండునంతదాఁక సంసార ముండునని చెప్పుచున్నారు.

22. కృతార్థంప్రతినష్టమప్యనష్టతదన్యసాధారణత్వాత్

తా. దృశ్య మైన ప్రధానము వివేకము గలవానికి నష్ట మైనను, ఇతరులగువారికి భోగమునకు సాధక మైయుండుటవలన సాధారణముగా సకల మైనవారును బంధరహితులు గా నేరరు.

వి. వివేకజ్ఞానముచే కృతార్థుఁడైనవానికి (యోగికి) మాత్రమే దృశ్యము వ్యాపారశూన్యముగా నుండును. తక్కిన యజ్ఞానుల కెల్లను దృశ్యము మిగిలియుండును; కావున బంధమునఁ దగిలినవా రగుచున్నారు. అనఁగా, ప్రపంచరూప మైన సంసారము నాశము కానేరదు.

అవ. సంయోగ స్వరూపమును నిరూపించుచున్నారు.—

23. స్వస్వామిశక్త్యోః స్వరూపోపలబ్ధి హేతుః సంయోగః.

తా. స్వశక్తి, స్వామిశక్తుల (చూడఁబడునట్టియు, చూచునట్టియు) స్వరూపముల సాక్షాత్కారమునకు సంయోగమే కారణము.

వి. స్వశక్తి చూడఁబడునట్టి స్వభావము. అనఁగా భోగ్యత్వము. స్వామిశక్తి చూచు స్వభావము. అనఁగా భోక్తృత్వము. దృశ్యమునకు భోగ్యత్వమును, పురుషునకు భోక్తృత్వమును అనాదిసిద్ధమై యుండుటచే, భోగ్యభోక్తృత్వ స్వభావమునకంటె వేఱే సంయోగసంబంధము లేదుగాన; దృశ్యమునకు భోగ్యత్వమును, పురుషునకు భోక్తృత్వము నుండుటయే సంయోగ మనఁబడుచున్నది. అనఁగా ఆత్మ భోక్త యనియును, బుద్ధి భోగ్య యనియును భావము. బుద్ధియొక్కయు ఆత్మయొక్కయు సంబంధమే అజ్ఞానము.

అవ. ఆ సంయోగమునకు కారణమును జెప్పుచున్నారు.—

24. తస్య హేతు రవిద్యా.

తా. ఆ సంయోగమునకు అవిద్యయే కారణ మగుచున్నది.

వి. అజ్ఞానరూప మైన అవిద్యయే సంయోగమునకు కారణముగ నున్నది. దీనిని త్యజింపనివాఁడు, వివేకి (యోగి) కాఁడు. ఇది దుఃఖమునకును కారణమై యున్నది. దీనిపను లెల్ల ఇహజీవనోపాయములుతప్ప పరసాధకమార్గములు కావు. (ఈవిషయము ఇదేపాదము 5 వ సూత్రమున వివరింపఁబడి యున్నది.)

అవ. సంయోగత్యాగలక్షణమును బోధించుచున్నారు.—

25. తదభావా త్సంయోగాభావో హానం తద్దృశేః కైవల్యమ్.

తా. సంయోగమునకు పదార్థములవలె నాశము కలుగుట లేదు. వివేకము గలిగినచో ప్రయత్నము లేకయే నివృత్తి యగును. ఇట్లగు సంయోగ నివృత్తియే కైవల్య మనఁబడును.

వి. ఆత్మజ్ఞానము కలుగనిచో అవిద్య నశింపదు. అవిద్యాకార్య మైన సంయోగనాశమే త్యాగము. సంయోగనివృత్తియే పురుషునకు మోక్షము.

వివేక జ్ఞాన ప్రకాశముచేత క్రమముగా బుద్ధియొక్కయు ఆత్మయొక్కయు ప్రతిబింబములును, బుద్ధియు, నశించిపోయి చేతనమునకు కైవల్యస్థితి కలుగును.

అవ. దృశ్యత్యాగోపాయమును నిరూపించుచున్నారు.—

26. వివేకఖ్యాతి రవిప్లవా హానోపాయః.

తా. చంచలము లేనట్టి వివేకమువలనఁ గలిగిన పరిశుద్ధజ్ఞానమే బుద్ధ్యాత్మలసంయోగ త్యాగమునకు నుపాయము.

వి. బుద్ధ్యాత్మలసంబంధముయొక్క పరిశీలనమే వివేకజ్ఞానము. ఈ వివేకజ్ఞానమును ముఖ్యముగా సంపాదింపవలయును.

అవిద్యారూపమైన యజ్ఞానమునకు విరుద్ధ మైన నిజజ్ఞానబలముచేత అవిద్య లయమై, జ్ఞాతృత్వ కర్తృత్వాద్యభిమానము అడఁగి రజస్తమోగుణములయొక్క సంబంధములేని శుద్ధసత్త్వప్రధాన మైన బుద్ధి అంతర్ముఖమై చిచ్ఛక్తియందు మిశ్రమ మగుటయే వివేకఖ్యాతి యనఁబడుచున్నది. అట్టి వివేకఖ్యాతి సర్వదా యేకస్వరూపమై ప్రవర్తించుచుండఁగా వికారస్వరూప మైన దృశ్యము నివర్తించును. ఈ దృశ్యముయొక్క కార్యములెల్లను లేక పోవుటవలన కైవల్యస్థితి కలుగును.

అవ. వివేకఖ్యాతిలక్షణమును వచించుచున్నారు.—

27. తస్యసప్తధా ప్రాన్తభూమిః ప్రజ్ఞా.

తా. వివేకజ్ఞానము కలిగినవానియొక్క ప్రజ్ఞావిశేషము యేడువిధములుగా నున్నది.

వి. వివేకజ్ఞానము పరిపాకమునకు రావలసియున్నయెడల సప్తభూమికలకు కడగా నుండవలయును.

చరాచరాత్మకమైన ప్రధానతత్త్వమునకు నెలకొనియుండు ఈ ప్రపంచముయొక్క విశిష్టానుభవము త్రివిధములచేతను దుఃఖరూపకమైనదని నేను చక్కఁగా తెలిసినవాఁడ నైతిని; ఇఁక ఈ ప్రపంచవిషయకమైన సంగతులయందు నేను తెలిసికొనవలసినది కొంచమైనను లేదనునది మొదటి భూమిక యగుచున్నది.

నాచిత్తమందున్న అవిద్యాదిక్లేశము లెల్లను నిశ్శేషముగా నశించిపోయినది; ఇఁక నాశము చేయఁదగిన క్లేశము లేవియు లేవనునది రెండవ భూమిక యగుచున్నది.

సంప్రజ్ఞాత సమాధియొక్క కడపటిభాగమైన నిరోధపరిణామమునకు గల స్థితులను సాక్షాత్తుగా అనుభవమునకు తెచ్చుకొంటిని; ఇఁక నాయొక్క ప్రయత్నముచేత అనుభవమునకు తెచ్చుకొనునట్టి అధ్యాత్మప్రమేయములు యేవియు లేవనునది మూఁడవభూమిక యగుచున్నది.

జననమరణ ప్రవాహరూపమై పరిణమించుచుండు సుఖదుఃఖమోహరూప ప్రపంచాత్మకమైన ప్రపంచమును జయింపఁదగిన ముఖ్యసాధనమైన వివేకజ్ఞానమును సంపాదించితిని; ఇఁక ప్రకృతిని జయించుటకు నేను సంపాదింపవలసిన దేమియు మిగిలి యుండ లేదనునది నాలుగవభూమిక యగుచున్నది.

భోగమోక్షరూపమైన విషయములందు చేయవలసినదాని నంతయు చేసి నాబుద్ధి కృతకృత్యమును పొందినదనునది ఐదవభూమిక యగుచున్నది.

మోహరూపమైన అవిద్యాదిక్లేశములు నశించిపోయినందువలన జగ ద్వ్యాపారమునకు కారణములైన సాత్త్వికాది గుణత్రయముల యొక్క వ్యాపార మెల్లను పాలనుండి విడదీసిన నేయి, మరల పాలలోఁ గలియని విధమున ఆ త్రిగుణములు మరల నాచిత్తమును పొందవనునది ఆఱవ భూమిక యగుచున్నది.

నాయొక్క బుద్ధి ధ్యానము ఆత్మయందైక్యమై నేను ప్రకృతి కతీతుఁడ నైనందున జీవించియుండియు స్వస్వరూపమైన కైవల్యస్థితిని స్వాభావికముగనే కలవాఁడనై యున్నాఁడ ననునది యేడవభూమిక యగుచున్నది.

స్వప్రయత్నముచేఁ గలుగఁజేసికొనఁదగిన మొదటి నాల్గుభూమికలచేత, ఇఁకముందు ప్రపంచానువర్తనయందును కర్మఫలములయందును నిశ్చయముగా ఆశ తప్పిపోయి, పరిణామము నొందలు ప్రధానతత్త్వము వఱకుఁగల ప్రకృతి యొక్క విషయకమైన సకలవిచారములయందును బుద్ధికి యే విధమైన మఱుఁగును లేకపోవునట్టి ప్రజ్ఞావిశేషములు కల్గును.

అనఁగా, స్వప్రయత్నముచే సాధింపఁదగిన మొదటి నాలుగు భూమికలును చిత్తవృత్తి విముక్తి (కార్యవిముక్తి) రూపకమైన దనియును, అప్రయత్నముగాఁ గలుగఁదగిన మిగిలిన మూఁడు భూమికలును చిత్తవిముక్తి రూపకమైన దనియును భావము.

అవ. వివేకఖ్యాతి కలుగుటకు కారణమును జెప్పుచున్నారు.—

28. యోగాఙ్గానుష్ఠానా దశుద్ధిక్షయే జ్ఞానదీప్తి రావివేకఖ్యాతేః.

తా. ఇదివఱకుఁ జెప్పఁబడిన యోగాంగానుష్ఠానము వలన కలుగునట్టి చిత్తసాత్త్వికపరిణామరూపమైన బుద్ధియొక్క ప్రకాశముచేత క్లేశరూపములైన చిత్తమలములు పోయి వివేకఖ్యాతి కలుగుచున్నది.

వి. వివేకఖ్యాతి కలుగు పర్యంతము యోగాంగముల నాచరింపుచుండవలయును. అప్పుడు చిత్తశుద్ధి కల్గును. దానివలన సాత్త్వికపరిణామ రూపమైన బుద్ధికి ప్రకాశము కలుగును. ఇట్లు బుద్ధికి ప్రకాశము కలుగుటయే వివేకఖ్యాతి యనఁబడును.

అవ. అష్టాంగయోగములను విభజించి చెప్పుచున్నారు.—

29. యమ నియ మాసన ప్రాణాయామ ప్రత్యాహార ధారణ ధ్యాన సమాధయోఽష్టావయవాఙ్గాని.

తా. యమము, నియమము, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణము, ధ్యానము, సమాధి; అను నివి యెనిమిదియు యోగాంగము లనఁ బడును.

వి. యమ మనఁగా:— ప్రాణిహింసచేయుట, అబద్ధమాడుట, పరధన మపహరించుట, భోగసాధన పదార్థములను స్వీకరించుట, అనునివి లేకుండుట.

నియమ మనఁగా:— పరిశుద్ధత, సంతుష్టి, నిష్ఠ (తపస్సు), మంత్రజపము, ఈశ్వరభక్తి, వీనిని యాచరించుట.

ఆసన మనఁగా:— వీర్యనిగ్రహము చేసి, దేహదార్ఢ్యమును సంపాదించుట, చిత్తస్థైర్యము నిమిత్తము కూర్చుండుట.

ప్రాణాయామ మనఁగా:— శాస్త్రోక్తప్రకారముగా ముక్కుయొక్క ఒక ద్వారముచే శ్వాసమును లోపలికి పీల్చి, దానిని లోపలనుండ నిచ్చిన తర్వాత మఱియొక ద్వారముచే బైటవిడుచుట మొదలగు శ్వాససంబంధకృత్యములు. (1-వ పాదము 34-వ సూత్రమును చూడుము).

ప్రత్యాహార మనఁగా:— ఇంద్రియములను తమతమ వ్యాపారములయందు ప్రవర్తింపనీకచేసి చిత్తమునకు మఱల్చుకొనుట.

ధారణ యనఁగా:— చిత్తమును ఒకచోట స్థిరముగా నిల్పుట.

ధ్యాన మనఁగా:—ధారణాస్థలమున బుద్ధిని నిల్పి కదలకుండుట.

సమాధి యనఁగా:—ధ్యానము దృఢమై ధ్యానము చేయుచున్నా ననెడి తలంపుపోయి చిత్తము విషయాంతరముల గోచరము లేక వ్యాపార శూన్యమైనదై ధ్యేయాకారమై యుండుస్థితిగా నుండుట. (సమాధివిషయమై మొదటిపాదమున చాలవఱకు జెప్పఁబడి యున్నది). అష్టాంగముల విషయము దిగువ నుదహరింపబడును.

[అష్టాంగవిషయములను విస్తారముగాఁ దెలిసికొనుట కిచ్ఛ గలవారు రాజయోగ రత్నాకరమునందు జూఁడదగును].

అవ. యమముయొక్క లక్షణమును జెప్పుచున్నారు.—

30. అహింసా సత్యాస్తేయ బ్రహ్మచర్యా పరిగ్రహా యమాః.

తా. ప్రాణులను హింసచేయకుండుట, మనః పూర్వకముగా సత్యము పల్కుట, పరులసొమ్మును అపహరింపకుండుట, ఇంద్రియనిగ్రహము చేయుట, భోగసాధన పదార్థములను గైకొనకుండుట ఇవి యమము.

వి. పైని చెప్పఁబడిన వాని నైదింటిని ప్రథమమున వర్జించి, అనంతరము నియమము నభ్యసించుటకు ప్రయత్నింపవలయును. యమముయొక్క కృత్యములను వర్జింపక, నియమము నాచరించుట సాధకునకు హానిని కలుగఁజేయును. ఇవి నిషిద్ధకార్యములుగాన అవశ్యము వర్జింపవలయును.

అవ. యమాంగముల నేకాలమునను విడువగూడదని చెప్పుచున్నారు.

31. ఏతే జాతి దేశ కాల సమ యానవచ్ఛిన్నా స్సార్వ భౌమా మహావ్రతమ్.

తా. జాతి, దేశము, కాలము, సమయము, అను వీనియందుఁ గాని; మతిరేక యవస్థయందుఁగాని, యమాంగములను తప్పక నాచరింపవలయును.

వి. బ్రాహ్మణత్వాది జాతులు, కాశీ రామేశ్వరాదిదేశములు, శివరాత్రి ఏకాదశ్యాది కాలములు, బ్రాహ్మణ ప్రయోజనము, వివాహాది సమయములు అగునివి మొదలగు నెట్టి సందర్భములలోఁ గాని హింస చేయకూడదను. అబద్ధము చెప్పకూడదను; పరద్రవ్యము నపహరింపఁగూడదను; ఇంద్రియమును ప్రయోగము చేయఁగూడదను (వ్యభిచరింపఁగూడదను); భోగసాధన వస్తువులను గ్రహింపఁగూడదను; అని యిట్లు సర్వదా జ్ఞాపకమునం దుంచుకొని ప్రవర్తించు చుండుట మహావ్రతము యమ మనఁబడును.

అవ. నియమలక్షణమును నిరూపించుచున్నారు.—

32. శౌచ సన్తోష తపస్స్వాధ్యాయేశ్వరప్రణిధానాని నియమాః.

తా. శుచిత్వము, సంతోషము, తపము, స్వాధ్యాయము, ఈశ్వర భక్తి, ఇవి నియమ మనఁబడును.

వి. మన్ను నీళ్లు మొదలగువానిచే దేహమును శుద్ధిచేయు బాహ్యశౌచము, మైత్ర్యాది పరికర్మములచే చిత్తమలమును పోఁగొట్టుకొనునట్టి అంతరశౌచము అను ద్వివిధ శుచిత్వమును, (1-పా. ౩౩-వ సూత్రమును చూడుము) సదా సమాధాన మనస్కుఁడై యుండు సంతోషమును, నిష్ఠయు, ప్రణవ పూర్వకమైన వేదమంత్రజపమును, పరమేశ్వరునియందు భక్త్యతిశయమును, (ఇదేపాదమున 1 సూత్రమును చూడుము) నియమ మనఁబడు చున్నది.

అవ. యమ నియమములచే యోగము సిద్ధించు ననుచున్నారు.—

33. వితర్కబాధనే ప్రతిపక్షభావనమ్.

తా. యోగప్రతిబంధకములైన హింసాదులను నశింపఁజేయుటకు అహింసాదుల భావనయే కారణమై యున్నది.

వి. యోగవిరోధమైన హింసాదులకు ప్రతిరోధమైన యహింసాదులను భావించుటవలన మహాపాతకములకు కారణములైన హింసాదులు నాశనమై

యోగము చేకూడును. కావున యమ నియమముల ఆచరణలేనివా రెన్నటికిని ఉత్తమస్థితికి యోగ్యులుకారు. సర్వోత్తమస్థితిని (యోగమును) అభిలషించిన వారికిది ఆవశ్యకమై యున్నది.

అవ. యోగవిరోధముయొక్క స్వరూపమును, దానికి కారణమును దానియొక్క భేదమును, దానిఫలమును జెప్పుచున్నారు.—

34. వితర్కా హింసాదయః కృతకారి తానుమోదితా లోభ క్రోధ మోహ పూర్వకా మృదుమధ్యాధి మాత్రా దుఃఖాజ్ఞానానన్త ఫలా ఇతి ప్రతిపక్ష భావనమ్.

తా. తానుచేయుట, ఇతరులచేఁ జేయించుట, ఇతరులు చేసినదానిని జూచి సంతోషించుట, అనునివి స్వరూపముగాఁ గలదియు; ఆశ, ద్వేషము, భ్రమ, ఇవి కారణముగాఁ గలదియు; మందము, మధ్యము, తీవ్రము, అను భేదములు గలదియు; దుఃఖము, అజ్ఞానము, ఇవియే పారము లేని ఫలముల నొసంగునదియు; అగు నిట్టి యోగవిరోధమైన హింసాది కార్యములను విడుచుటకు అహింసాదులను అభ్యసింపవలయును.

వి. హింసాదులయందు తగిలిన చిత్తము తనను చేయునట్లు చేయును, పరులచేఁ జేయింప పరికొల్పును, ఇతరులు చేసినదానిని జూచి సంతోషింప జేయును, దానిపై ఆశను పుట్టించును, క్రోధమును కలుగఁజేయును. మోహము గలుగును. మంద మధ్య తీవ్రము లగు అవస్థలలో పడునట్లు చేయును, దుఃఖమును, అజ్ఞానమును కలుగును, వీనివలన అపారమైన దుఃఖఫలములు సంప్రాప్తమై అనేక జన్మముల నొందింపఁజేయును. అందువలన ముక్తినొందుటకు సాధ్యము లేకపోవును, కాఁబట్టి యోగప్రతి బంధకములైన హింసను చేయక యుండవలయును. హింసచేయమియే అహింసను అభ్యసించుట యనఁబడును.

అవ. అహింసాభ్యాసముయొక్క ప్రయోజనమును జెప్పుచున్నారు.

35. తత్సన్నిధౌ వైరత్యాగః

తా. అహింసాభ్యాసము చేయునట్టి యోగి నివసించు స్థలమునందు, స్వాభావికముగా వైరము గల గోవ్యాఘ్రములు, గజసింహములు మొదలగు నవికూడ వైరమును విడిచి ప్రవర్తించును.

వి. జాగ్రత్స్వప్నాదులయందు సహా మనోవాక్కాయములచే హింసఁ జేయఁగూడదని తలంచియుండు యోగి (వివేకి) సమీపమున స్వభావసిద్ధముగా ద్వేషముతోఁ గూడి ప్రవర్తించు వైరివర్గములగు ప్రాణులెల్లను తమతమ వైరమును విడిచి పరస్పర స్నేహభావముతో నుండును.

అవ. సత్యాభ్యాసికి గల్గు ఫలమును నిరూపించుచున్నారు.—

36. సత్యప్రతిష్ఠాయాం క్రియాఫలాశ్రయత్వమ్.

తా. సత్యము నభ్యాసముగా గలవాఁడు, అగ్నిష్టోమాది కర్మములు చేయకపోయినను, వానికి అట్టి కర్మఫలములు లభించును.

వి. సదా సత్యమును విడువక అభ్యాసము చేయువానికి, (సత్యము పలుకువానికి) ఏ విధమైన సత్కర్మములు చేయకపోయినను, ఆ కర్మములకుఁ దగిన ఫలములెల్లను ప్రాప్తించును. మఱియు వాని వచనమాత్రము చేతనే, కర్మములు చేయని యితరులకును ఆ కర్మఫలము లభించును. అనఁగా సత్యము నందు దృష్టి కలవానికి నిగ్రహానుగ్రహశక్తి కలదని భావము.

అవ. చౌర్యము చేయనివానికిఁ గలుగు ఫలమును జెప్పుచున్నారు.-

37. అస్తేయప్రతిష్ఠాయాం సర్వరత్నోపస్థానమ్.

తా. దొంగతనము చేయకుండువానికి సమస్త రత్నములును ప్రాప్తించును.

వి. పరులద్రవ్యమును అపహరింపకుండుటను అభ్యసించిన దృఢచిత్తునకు తాను ఆశలేని వాఁడైనను, అప్రయత్నముగనే సకల స్థలములయందుఁగల సమస్తరత్నములు తనంతట లభించును.

అవ. ఇంద్రియ నిగ్రహమువలని ప్రయోజనమును వచించుచున్నారు.

38. బ్రహ్మచర్య ప్రతిష్ఠాయాం వీర్యలాభః.

తా. బ్రహ్మచర్యమును అభ్యసించుటవలన బ్రహ్మవర్చస్సు లభించును.

వి. ఇంద్రియ నిగ్రహమును అభ్యసించు స్థైర్యము గలవానికి వీర్యము (తేజము = బ్రహ్మవర్చస్సు) యొక్క లాభము కలుగును. మఱియు బలము కలుగును. మేధస్సు పరిశుద్ధ మగును. దీనివలన ఆత్మజ్ఞానము గోచరించును. కావున యింద్రియమును చలింపనీయక కాపాడఁదగినది.

అవ. భోగసాధన వస్తువులను గ్రహింపనివానికి గలుగు ఫలమును నిరూపించుచున్నారు.—

39. అపరిగ్రహ స్థైర్యే జన్మకథంతా సంబోధః.

తా. భోగసాధన వస్తువులను స్వీకరింపని అభ్యాసముగలవానికి, పూర్వజన్మములందు తా నేలాగున నుంటిననెడు జ్ఞానము ప్రాప్తించును.

వి. ఎల్లప్పుడును అపరిగ్రహమును అభ్యాసము చేయు దృఢమనస్కునకు జన్మాంతరములయందు తాను యే ప్రాణిగ నుండినదియు, ఏపని చేసినదియు, ఏ ఫలము నొందినదియు నివి మొదలుగాఁగల విషయములు జ్ఞప్తికి వచ్చును. అనఁగా, పూర్వజన్మ జ్ఞానము గోచరించునని భావము. కాఁబట్టి దీనిని యోగి యగువాఁడు ప్రారంభమునందే అభ్యసింపవలసినది.

అవ. శౌచముయొక్క ఫలమును జెప్పుచున్నారు.—

40. శౌచాత్స్వాఙ్గజుగుప్సాపరైరసంసర్గః.

తా. శుచిత్వమును అభ్యసించుటవలన తన అవయవములయందు అసహ్యమును, ఇతరుల సంబంధము కూడదనియును బోధ మగును.

వి. పరిశుద్ధతను అభ్యాసముచేయువానికి తన దేహోత్పత్తికిఁ గారణము లైన మాతా పితృ దేహజన్య శుక్లశోణిత రూపమైన పర్యాలోచన వలన తన దేహమునందు జుగుప్సయును, పరులను స్పృశించుట కేవల మసహ్యమని

యుండు లోపము. మఱియు, శుచిత్వమువలన బుద్ధి మాంద్యముపోయి జాగరూకత గలుగును పాపుల సంసర్గమును తప్పింపజేయును. అందువలన వారి సంసర్గముచే గలుగు దోషములును దుర్గుణములును రవంతమాత్రమును దగ్గఱ జేరవు. కావున దీనిని అందఱును అభ్యసింపఁ దగినది.

అవ. శౌచమువలనఁ గలుగు విశేషఫలమును వచించుచున్నారు.—

41. సత్త్వశుద్ధి సౌమనస్యైకాగ్ర్యేన్ద్రియ జయాత్మ దర్శనయోగ్యత్వాని చ.

తా. శుచిత్వమువలన సత్త్వశుద్ధియును, దీనివలన సౌమనస్యమును, దీనివలన చిత్తైకాగ్రతయును, దీనివలన ఇంద్రియజయమును, దీనివలన ఆత్మదర్శన జ్ఞానమును కలుగును.

వి. పరిశుద్ధుఁడైనవానికి రజస్తమోగుణముల వశతయును, మనస్సునందు శాంతియు దుఃఖములేని ప్రీతియును, చిత్తస్థైర్యమును, విషయములయందు విముఖతయును, బ్రహ్మజ్ఞానమునందు సమర్థతయును కలుగును.

అవ. సంతోషముతో నుండువానికిఁ గలుగు ప్రయోజనమును జెప్పుచున్నారు.—

42. సంతోషా దనుత్తమ స్సుఖలాభః.

తా. సంతోషాతిశయమువలన నిరతిశయమైన ఆనందము కలుగును.

వి. సర్వదా సంతోషముగా నుండువానికి బ్రహ్మానందమువలె నిరతిశయానందము ప్రాప్తించును. అనఁగా, సంతుష్టిచే ప్రాప్తించిన దానిని పొంది, సంతోషించువానికి ఆశలు కలుగుటకు అవకాశము లేకుండును. అందువలన సకల దుఃఖములను నివృత్తియగును.

అవ. తపస్సువలని ప్రయోజనమును వచించుచున్నారు.—

43. కాయేన్ద్రియసిద్ధి రశుద్ధిక్షయా త్తపసః.

తా. తపస్సు చేయుటవలన చిత్తమునందలి మలినము తొలఁగు చున్నది. అందువలన జ్ఞానేంద్రియ కర్మేంద్రియములకు అద్భుతశక్తి కలుగుచున్నది.

వి. కృచ్ఛ్రచాంద్రాయణాదులవలన, చిత్తము మలరహితమై పరిశుద్ధమై యుండును. అందువలన స్వేచ్ఛానుసారముగా తనదేహమును అణురూపముగాఁ గాని మహద్రూపముగాఁ గాని చేసికొను శక్తియును; మఱియు, ఇంద్రియముల కెదురుగా నుండు సూక్ష్మవస్తువులను గాని, మఱుఁగుగాఁ గనబడకుండు ఏవస్తువులను గాని గోచరింపఁజేసుకొను శక్తియును కలుగును.

అవ. జపము చేయువానికిఁ గలుగు ఫలమును జెప్పుచున్నారు.—

44. స్వాధ్యాయా దిష్టదేవతా సంప్రయోగః.

తా. తనకు ఇష్టమైన మంత్రమును జపించుటవలన, తాను కోరిన దేవత ప్రత్యక్షమగును.

వి. వేదమంత్రములయందు తనకు అభిమతంబైన దేవతామంత్రమును ఓంకారపూర్వకముగా జపించుటవలన ఆదేవత సాక్షాత్కారమై తన యిష్టార్థముల నొసంగును. మఱియు ప్రణవపూర్వకమైన ఈశ్వరోపాసన వలన చిత్తము నిర్మలత్వము నొందును. అందువలన దుస్స్వప్నకల్పము లెల్లను తొలఁగును.

అవ. ఈశ్వరప్రణిధానమువలని లాభమును జెప్పుచున్నారు.—

45. సమాధిసిద్ధి రీశ్వరప్రణిధానాత్.

తా. పరమేశ్వరునియందు అతిశయమైన భక్తి చేయుటవలన సంప్రజ్ఞాత సమాధిలాభము కలుగును.

వి. ఈశ్వరునియందు అధికమైన భక్తిని చేయుచుండుటవలన చిత్తము నందలి సకలపాపములును నశించును. ఆ పరమేశ్వరునకు సమీపమునం దుండు సంప్రజ్ఞాతసమాధికలుగుట నిరాటంకముగా సిద్ధించును. (సంప్రజ్ఞాతసమాధి లక్షణము 1-వ పా. 17-వ సూత్రమున విపులముగా నిరూపింపఁబడి యున్నది).

అవ. ఆసనాభ్యాసమువలని ప్రయోజనమును నిరూపించుచున్నారు.

46. స్థిర సుఖ మాసనమ్.

తా. ఆసనములు స్థిరమును సుఖమును కలుగఁజేయును.

వి. వీరాసనము, స్వస్తికాసనము, పద్మాసనము, సిద్ధాసనము, సింహాసనము, కుక్కుటాసనము, భద్రాసనము, యోగాసనము మొదలుగాఁగల ఆసనములలో నెవరికి యే ఆసనము నిశ్చలమై సుఖకరమైయుండునో దానిని వారు అభ్యసింపవలసినది. ఆసనములయొక్క దృఢాభ్యాసమువలన చిత్తమునకు స్థిరత్వము కలుగును.

ఆసనములు ఎనుబదినాలుగు. ఇదియును గాక మతాంతరములును గొన్నిగలవు. అందు ముఖ్యమైనవానిలోఁ గొన్నిటిని యిచట చెప్పఁబడును.

వీరాసనము:—ఒకతొడమీఁద నొకపాదమును, ఇంకొక తొడమీఁద వేఱొకపాదము నుంచి శరీరమును వంకరలేక నిల్పుట.

స్వస్తికాసనము:—పిక్కలయొక్కయు తొడలయొక్కయు మధ్యలో పాదములనుంచి దేహమును చక్కఁగ నిక్కించుట.

పద్మాసనము:—ఎడమతొడపై కుడిపాదమును, కుడితొడపై యెడమపాదమునుంచి, వెనుకప్రక్కనుండి కుడిచేతితో నెడమతొడపై నున్న కుడికాలి పెద్దవ్రేలిని, ఆ ప్రకారముగానే యెడమచేతితో కుడితొడపై నున్న యెడమకాలి పెద్దవ్రేలిని పట్టుకొని, ఱొమ్మునందు గడ్డమునుంచి, భ్రూమధ్యమందు దృష్టినిల్పుట.

సిద్ధాసనము:—ఎడమకాలి మడమను మూలాధారమునందును, కుడికాలిమడమను లింగస్థానమందు నుంచి, శిరస్సు కంఠము భుజము వీనిని చక్కఁగా నిక్కించి, భ్రూమధ్యమును జూచుచుండుట.

మతాంతరసిద్ధాసనము :—లింగముమీఁద యెడమ మడమనుంచి, దానిపై కుడిమడిమ నుంచి, నాసాగ్రమును చూచుచుండుట. దీనినే వజ్రాసన మనియు, ముక్తాసన మనియుఁ, గుల్ఫాసన మనియుఁ జెప్పుదురు.

సింహాసనము :—అండకోశముల క్రింది ప్రదేశములందు తొడల యొక్క వెనుకటి భాగములు అంటునట్లు, కుడియెడమల మడమలను మార్చి యుంచి, కుడి యెడమచేతులవ్రేళ్లను మోఁకాళ్లమీఁద సవ్యంబుగ వెడల్పుగ నుంచి, నిక్కి కూర్చుండి నోరుదెఱచికొని, భ్రూమధ్యమందలి చిద్బిందువును వీక్షించు చుండుట.

కుక్కుటాసనము:—పద్మాసనమున నుండి మోకాళ్లతొడలసందులలో చేతులనుదూర్చి, చేతులను నేలనూని పై కెగసినట్లుండుట.

భద్రాసనము:—అండకోశములకు దిగువ చీలమండనుంచి, మడమల రెంటిని రెండుచేతులతోఁబట్టి కదలకుండుట దీనినే గోరక్షాసన మనియును జెప్పుదురు.

యోగాసనము :—వంశదండమును మోకాళ్లక్రింద నుంచుకొని పాదములను నేలపై నిల్పి తొడలసందున చేతులనుంచి పిక్కలను బట్టుకొని ఆత్మావలోకనము జేయుచుండుట.

కూర్మాసనము:—ఆధారమునకు రెండుప్రక్కలయందు రెండుకాళ్ల మడమలను హత్తించి, రెండుమోఁకాళ్లను భూమియందుంచి నిక్కి చక్కఁగాఁ గూర్చుండుట.

గోముఖాసనము :—ఎడమకాలిమడమ కుడివీపుప్రక్కగాను, కుడికాలిమడమ యెడమవీపుప్రక్కగాను, మోఁకాలిమీఁద మోఁకాలుకదియ

నుంచి పాదాంగుష్ఠములను చేతులతోఁ బట్టి శిరమును వెక్కఁగ నిక్కించి భ్రూమధ్యావలోకనము చేయుచుండుట.

ధనురాసనము:—పాదాంగుష్ఠముల రెంటిని రెండుచేతులతో ధనురాకారముగా వీపువెనుక చెవులకు సరిగాఁ బట్టియుండుట.

కపాలాసనము:—తలక్రిందుగ నిలిచి భ్రూమధ్యమందలి బిందువును చూచుచుండుట.

ఇందు గృహస్థులకు పద్మాసనమును సిద్ధాసనమును ఉత్తమమైనను, గృహస్థులకు పద్మాసనమే మేలు. తక్కిన ఆశ్రమస్థులకు సిద్ధాసనము మేలు. సిద్ధాసనమువలన ఇంద్రియనిరోధము, శరీరదార్ఢ్యము, నిర్మల చిత్తవృత్తి, ఇవి కలుగును. మతాంతరసిద్ధాసనము సకలాసనములలోను మేలైనది. ఇది ముక్తిద్వారకవాటపాటన పటువైనది. కపాలాసనమును ప్రతినిత్యము జాముసేపు అభ్యాసము చేయుచుండినచో మూఁడు నెలలకు మీఁద జరారహితుండును మృత్యుంజయుండును అగును.

(ఇంకను అనేకాసనములు కలవు. వానిని ఆసన విధాన స్వరూప పటములతో ముద్రించిన "హఠయోగప్రదీపిక" యందుఁ గనందగును).

అవ. ఇష్టాసనసిద్ధికి ఉపాయమును చెప్పుచున్నారు.—

47. ప్రయత్నశైథిల్యానన్త సమాపత్తిభ్యామ్.

తా. ఆసనమును అభ్యాసము చేయుచున్నను, తనకు (ఆసనము) సిద్ధింపవలయునను తలంపు సదా యుండెనేని సులభముగా సిద్ధించును.

వి. తాను ఇచ్ఛయించిన ఆసనమును క్రమప్రకారము అభ్యసింపక పోయినను, తాను కోరినట్టి ఆసనము అవిచ్ఛిన్నముగా జ్ఞాపకమునం దుండెనేని తనంతట సిద్ధించును. అయినను వారివారి శక్తికిఁ దగిన ఆసనమును అభ్యసించుటకు ప్రయత్నము చేయుటయే ఉత్తమము.

అవ. ఆసనసిద్ధియొక్క ఫలమును బోధించుచున్నారు..

48. తతో ద్వన్ద్వానభిఘాతః.

తా. ఆసనము సిద్ధించినమీఁద శీతోష్ణాది ద్వంద్వములచే బాధింపఁబడఁడు.

వి. తాను కోరిన ఆసనము సిద్ధించిన పిమ్మట, శీతోష్ణ క్షుత్పిపాసాది ద్వంద్వములు వానిని బాధింపవు.

అవ. ఆసన సిద్ధ్యనంతరకర్తవ్యమైన ప్రాణాయామమును చెప్పుచున్నారు.—

49. తస్మిన్ సతి శ్వాసప్రశ్వాసయో ర్గతివిచ్ఛేదః ప్రాణాయామః.

తా. ఆసనసిద్ధి కలిగిన తర్వాత ఉచ్ఛ్వాస నిశ్వాసములయొక్క గమనాగమనముల నిరోధము చేయుటయే ప్రాణాయామ మనఁబడును.

వి. శ్వాసమును విడుచుటయును, శ్వాసమును పీల్చుటయును, క్లుప్త ప్రకారము చేయవలయునని యోజింపఁగునది.

అవ. ప్రాణాయామ విభాగాది విశేషమును జెప్పుచున్నారు.—

50. సతు బాహ్యాభ్యన్తర స్తమ్భవృత్తి ర్దేశకాల సంఖ్యాభిః పరిదృష్టో దీర్ఘ సూక్ష్మః.

తా. ప్రాణాయామ మనునది త్రివిధము. శ్వాసమును వెలుపలవిడుచుట రేచకప్రాణాయామ మనియును, శ్వాసమును లోపలికి పీల్చుట పూరక ప్రాణాయామ మనియును, శ్వాసమును లోపలనే నిల్పియుంచుట కుంభక ప్రాణాయామ మనియును చెప్పఁబడును. ఇది దేశముచేతను, కాలము చేతను, సంఖ్యచేతను, దీర్ఘముచేతను, సూక్ష్మముచేతను. క్లుప్తమై (నియమితమై) యున్నది.

వి. నాసికమునుండి 12 అంగుళములవఱకు శ్వాసమును విడుచుట దేశక్లుప్తము.

శ్వాసమును 16 మాత్రలకాలము రేచకమును, 32 మాత్రలకాలము పూరకమును, 16 మాత్రలకాలము కుంభకమును చేయుట కాలక్లిప్తము.

ఈ రేచక పూరక కుంభకములను ప్రతిదినమును యిన్నిమాఱు లని లెక్కపెట్టుట సంఖ్యాక్లిప్తము.

నాసికమునుండి 16 అంగుళములవఱకు శ్వాసమును విడుచుట దేశదీర్ఘము.

శ్వాసమును 24 మాత్రలకాలము రేచించుట కాలదీర్ఘము.

రేచకాదులను తాను నిర్ణయించుకొనిన లెక్కకంటె యెక్కువగా చేయుట సంఖ్యాదీర్ఘము.

తనక్లిప్తముకంటె నెక్కువగాఁజేయుట దీర్ఘము.

తనక్లిప్తముకంటె తక్కువగాఁ జేయుట సూక్ష్మము. దీనికి వైకృత ప్రాణాయామ మనియును పేరు కలదు.

అవ. త్రివిధప్రాణాయామములను వచించి, చతుర్థ ప్రాణాయామ లక్షణమును బోధించుచున్నారు. —

51. బాహ్యాభ్యన్తర విషయాక్షేపీ చతుర్థః.

తా. బాహ్యాభ్యంతరవిషయము లైన రేచక పూరకములను విడుచుట చతుర్థప్రాణాయామ మనఁబడును.

వి. రేచక పూరకములను విడిచి, కుంభకమునందుమాత్ర ముండుట చతుర్థప్రాణాయామ మనఁబడుచున్నది, దీనికే కేవలకుంభక మనియు పేరు కలదు. ఇదియే యోగాంగముగ నున్నది.

అవ. ప్రాణాయామ ప్రయోజనమును జెప్పుచున్నారు. —

52. తతః క్షీయతే ప్రకాశావరణమ్.

తా. ప్రాణాయామము చేయుటవలన చిత్తమునందలి సాత్త్వికభాగమును ఆవరించుకొనియుండు మలినము నశించును.

వి. చిత్తముయొక్క సాత్త్వికభాగమును చుట్టుకొని పాపమును చేయునట్లు ప్రేరేపించు మలినము, ప్రాణాయామమువలన నివర్తించును.

అవ. ప్రాణాయామ విశేషప్రయోజనమును వచించుచున్నారు.—

53. ధారణాసు యోగ్యతా మనసః.

తా. ధారణయందు చిత్తమునకు స్థైర్యము కలుగును.

వి. ప్రాణాయామముచేత నిర్మలమై యుండు చిత్తమును యెప్పుడు నిల్పిన నప్పుడు నిల్చుశక్తి కలిగినతర్వాత, ఇఁక చెప్పఁబోవు ధారణయందు మనస్సు స్థిరమై నిలుచును.

(ప్రాణాయామ లక్షణమును విపులముగా "హఠయోగ ప్రదీపిక" యందుఁ గనందగును).

అవ. ప్రత్యాహార లక్షణమును నిరూపించుచున్నారు.—

54 స్వవిషయాసంప్రయోగే చిత్తస్వరూపానుకార ఇవేన్ద్రియాణాం ప్రత్యాహారః.

తా. ఇంద్రియములను తమతమ విషయములయందు పోనీక, నిర్మల చిత్తమునకు మరల్చి, తమతమ స్థానమున నిల్పుటయే ప్రత్యాహారము.

వి. చక్షురాదీంద్రియములు తమతమవిషయములైన రూపాదివిషయములనుండి చిత్తమునం దైక్య మగునట్లు చేయుటయే ప్రత్యాహార మనఁబడును.

అవ. ప్రత్యాహారముయొక్క ఫలమును జెప్పుచున్నారు.—

55. తతః పరమావశ్యతేన్ద్రియాణామ్.

తా. ప్రత్యాహారాభ్యాసమువలన యింద్రియములు స్వాధీన మగును.

౫. ప్రత్యాహారము సిద్ధించిన యోగికి యింద్రియములు వశమై యుండును. ఈ యింద్రియవ్యాపారములు వశమైనతర్వాత చిత్తచాంచల్యము లేక పోవును. ధ్యానమునందు చిత్తము స్థిరముగా నిల్చును.

పాతంజలయోగశాస్త్రమునందు

సాధనపాదము.

సమాప్తము.

హఠయోగప్రదీపిక

ఇందు హఠయోగము చేయుటవలన ప్రయోజనమును, అష్టాంగములగు యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధి లక్షణములును, ఆహార నియమములును, ఆసనప్రయోజనమును, ఆసన భేదములును ప్రాణాయామ భ్యాస లక్షణమును ప్రాణాయామ భేదములును, ప్రాణాయామ సౌకర్యార్థము ధౌతికర్మ, వస్తికర్మ, నేతికర్మ, త్రాటక కర్మ, నౌలి, కపాలభాతియను షట్కర్మల లక్షణములును, వాని గుణములును, కుంభకభేదములును, కుండలీ ప్రయోజనమును, కుండలీ ప్రబోధ ప్రయోజనమును, దశవిధముద్రా స్వరూపమును, బంధత్రయ ప్రయోజనమును, రాజయోగ మహిమయు, ప్రాణలయ క్రమమును, శాంభవీ ముద్రాప్రభావము, ప్రత్యాహారభేదములు, ధారణాభేదములు, ధ్యానభేదములు, బ్రహ్మజ్ఞాని లక్షణము మొదలగు యోగి అనుసరింపవలసిన సమస్త విషయములను సులభ శైలితో వ్రాయబడి 128 ఆసనపటములును గలిగి మిక్కిలి ఆకర్షణీయమై యున్నది. యోగాభ్యాసము చేయువారికి ఈ గ్రంథము కల్పవృక్షమువంటి దని చెప్పుట అతిశయోక్తికాదు గ్లేజు కాగితములతో 216 పేజీలు గలిగి క్యాలికో బైండు చేయబడినది. వెల రూ. 2-8-0

ఓమ్.

శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః.

పాతంజలయోగశాస్త్రము.

౩. విభూతిపాదము.

శ్లో. య త్పాదపద్మస్స్మరణా దణిమాది విభూతయః,
భవన్తి భావినా మస్తు భూతనాథ స్స భూతయే.

అథ. ధారాలక్షణమును వచించుచున్నారు —

1. దేశబన్ధ శ్చిత్తస్య ధారణా.

తా. నాభిచక్రాది ప్రదేశములయందు చిత్తమును చలింపక నిల్పుట ధారణ యనఁబడును.

వి. యోగాభ్యాసి ప్రథమమునందు అభ్యాసము నిమిత్తమై యేవస్తువు నందుఁగాని, ఏ స్థలమునందుగాని చిత్తమును నిల్పవలయును. ఇట్లు నిల్పినచో చిత్తమునకు చలనము కలుఁగదు. అట్టి స్థితి ధారణ యనఁబడును.

ద్వితీయపాదమునందు సంగ్రహముగాఁ జెప్పిన ధారణాది అంగత్రయములను నిరూపించుటకొఱకును, మఱియు సంయమాదులను బోధించుటకొఱకును తలంచినవారై, యీ పాదమునందు పూర్వోక్తధారణాది ప్రయోజన విశేషమును (బాహ్యాభ్యంతర సిద్ధులను) క్రమముగాఁ జెప్పుటకు నిశ్చయించిరని తెలియునది.

అవ. ధ్యానక్రమమును నిరూపించుచున్నారు.—

2. తత్ర ప్రత్యయైకతానతా ధ్యానమ్.

తా. ధారణాస్థలమునందు జ్ఞానముయొక్క ధ్యానేతర వస్తువులను చిత్తమున రానీక చేయుటయే ధ్యానమనఁబడుచున్నది.

వి. ధారణయొక్క స్థలమున తాను ధ్యానించు వస్తువునకంటె వ్యతిరిక్తమైన దానిని రానీయక, తాను ధ్యానించువస్తువును మాత్రమే భావించుట ధ్యానము. అనఁగా, ధారణయందు బుద్ధినియుంచి మఱవకుండుట.

అవ. సమాధి లక్షణమును జెప్పుచున్నారు.—

3. తదే వార్థమాత్ర నిర్భాసం స్వరూపశూన్య మివ సమాధిః

తా. ముందు జెప్పిన ధ్యానము ధ్యానించు వస్తువుయొక్క స్వరూపమై, ఆ ధ్యానము లేకుండుటయే సమాధి యనఁబడును.

వి. ధ్యానము, ధ్యానించు వస్తువుయొక్క స్వరూపముగా పరిణమించి, నేను ధ్యానించుచున్నాననుటకూడ మఱచిపోవుటయే సమాధి యనఁబడు చున్నది.

అవ. యోగాంగత్రయముయొక్క సంకేతనామమును వచించు చున్నారు.—

4. త్రయ మేకత్ర సంయమః.

తా. ఒకే విషయమందు ధారణ ధ్యానము సమాధియును నీ మూఁడును కూడియుండుట సంయమ మనఁబడును.

వి. ధారణా ధ్యాన సమాధులు కూడియుండుటకు సంయమ మని నామము. ఈ మూఁడును యోగమునకు అంతరంగ సాధనములై యున్నవి.

అవ. సంయమసిద్ధియొక్క ఫలమును నిరూపించుచున్నారు.—

5. తజ్జయా త్ప్రజ్ఞా లోకః.

తా. సంయమముయొక్క అభ్యాసము స్థిర మగుటవలన తెలియవలసిన స్వరూపము తెలియును.

వి. సంయమమును చక్కఁగా నభ్యసించి యుండువానికి తాను చూడఁ గోరిన సకలవస్తు స్వరూపములును చక్కఁగా కనఁబడును. అనఁగా, ఇది దృఢమైనచో నేయే వస్తువును అడ్డుబాటులేక గోచర మగు నని భావము.

అవ. సంయమమును వుపయోగించు పద్ధతిని బోధించుచున్నారు.

6. తస్య భూమిషు వినియోగః.

తా. ఆ సంయమమును చిత్తముయొక్క స్థూలాది భూమికలయందు వుపయోగింపఁదగి యున్నది.

వి. చిత్తమునం దొకటికన్న నొకటి సూక్ష్మమై యుండు భూమికల యందు క్రమముగా అభ్యాసము చేయుచుండవలయును. అట్లు చేయని యెడల సంయమముచేఁ గలుగు ప్రయోజనములను పొందనేరఁడు. (ఈ భూమి కలనుగూర్చి ఇదేపాదము 9-వ సూత్రమున వివరింపఁబడును.)

అవ. సాధన పాదమునందు యోగముయొక్క అయిదంగములను జెప్పి, తక్కిన మూఁడంగములను జెప్పనిదానికి కారణమును వచించుచున్నారు.—

7. త్రయ మన్తరఙ్గం పూర్వేభ్యః.

తా. యమాది రైదంగములకంటెను. ధారణాది మూఁడంగములు సంప్రజ్ఞాతసమాధికి అంతరంగములు.

వి. పరంపరగా సమాధికి ఉపయుక్తములైన యమాదులైదంగములు సంప్రజ్ఞాత సమాధియొక్క బాహ్యాంగము లనియును, ధారణాది మూఁడంగములు సంప్రజ్ఞాత సమాధియొక్క అంతరంగము లనియును, తెలియఁదగినది.

మఱియు యోగాంగముల నెనిమిదింటిని రెండవపాదమున వివరించి, అందు ఆయైదంగముల లక్షణములను ఆ పాదమునందు జెప్పి, మిగత మూఁడంగములను అచోట చెప్పకపోయిన కారణ మేమనఁగా, ఈ మూఁడవపాదమునందు యోగముయొక్క దృఢీకరణమును చెప్పుటచేత నిచ్చట వానిని చెప్పఁబడుచున్న దని గ్రహించునది.

అవ. ధారణాది మూఁడంగములను నిర్బీజసమాధికి బహిరంగములని చెప్పుచున్నారు.—

8. తదపి బహిరఙ్గం నిర్బీజస్య.

తా. అసంప్రజ్ఞాత సమాధికి ధారణాదులు మూఁడును బహిరంగములు.

వి. ధారణాదులు నిర్బీజసమాధికి (నిరాలంబన రూపమైన అసంప్రజ్ఞాత సమాధికి) బహిరంగములై యుండుటవలన, ఈ సంయమమున కుపయుక్తమైన సమాధి సబీజ మనఁబడుచున్నది.

అవ. యోగసిద్ధిని జెప్ప నుపక్రమించిన వారై ప్రథమమున నిరోధపరిణామమును బోధించుచున్నారు.

9. వ్యుత్థాన నిరోధ సంస్కారయో రభిభవ ప్రాదుర్భావౌ నిరోధలక్షణ చిత్తాన్వయో నిరోధపరిణామః.

తా. చిత్తభూమికలైన క్షిప్తము, మూఢము, విక్షిప్తము, ఏకాగ్రము, నిరుద్ధము అను నీ యైదింటిలో, క్షిప్త మూఢ విక్షిప్తములు మూఁడును వ్యుత్థాన మనియును; ఏకాగ్ర నిరుద్ధ భూమికలు రెండును నిరోధ మనియును తెలియఁదగినది. అనఁగా, ఈ వ్యుత్థాన నిరోధములవలనఁ గలిగిన వాసనలయందు వ్యుత్థాన వాసనా తిరస్కారము నిరోధ సంస్కారము యొక్క ఆవిర్భావ మనియును; ఆ నిరోధ సంస్కారముయొక్క ప్రారంభమునందుండు చిత్తమునకు నిరోధ పరిణామ మనియును భావము.

వి. చిత్తమునందు రజోగుణోద్రేకముచే బహిర్ముఖమై సుఖదుఃఖాదులయందు ప్రేరేపింపఁబడి చంచలమై యుండు చిత్తముయొక్క స్థితి క్షిప్తము.

చిత్తమునందు తమోగుణోద్రేకముచే కృత్యాకృత్యవివేకము లేక క్రోధాదులచే విరుద్ధ కార్యములయందు ఆసక్తి గలిగియుండు చిత్తముయొక్క స్థితి మూఢము.

చిత్తమునందు సత్త్వగుణోద్రేకముచే సుఖసాధనములైన విషయములయందు ప్రవర్తించి సుఖమయమై యుండు చిత్తముయొక్క స్థితి విక్షిప్తము.

చిత్తమునందు సత్త్వగుణ మధికమై బాహ్యమునందు ప్రసరింపనీయకుండు చిత్తముయొక్క స్థితి ఏకాగ్రము.

చిత్తమునందు సత్త్వగుణోత్కర్షముచే ఆనందమై యుండు చిత్తముయొక్క స్థితి నిరుద్ధము.

ఇందు మొదటి మూఁడు భూమికలును సమాధికి నుపయుక్తములు కావు. మిగిలిన రెండు భూమికలును సమాధికి నుపయుక్తములు. (ఈ విషయమును 1-వ పా, 2-వ సూత్రమున మాడఁదగును.)

అవ. నిరోధ పరిణామమును బొందిన చిత్తమునకు గలుగు ఫలమును జెప్పుచున్నారు.—

10. తస్య ప్రశాన్తవాహితా సంస్కారాత్.

తా. నిరోధ పరిణామమును బొందిన చిత్తమునకు ఆ నిరోధ పరిణామ సంస్కార బలమువలన కేవల సత్త్వగుణ ప్రవాహము కలుగుచున్నది.

వి. నిరోధ పరిణామబలముచే చిత్తక్లేశములచేఁ గలుగు చంచలము నశించి కేవలసత్త్వగుణ సమానమైన సజాతీయ సత్త్వోత్కృష్ట ప్రవాహము కలుగును.

అవ. సమాధి పరిణామమును నిరూపించుచున్నారు.—

11. సర్వార్థతైకాగ్రతయోః క్షయోదయౌ చిత్తస్య సమాధి పరిణామః.

తా. అనేక విషయములయందు పరిణమించు చిత్తధర్మము సర్వార్థత యనఁబడుచున్నది. ఒకే విషయమునందు పరిణమించు చిత్తధర్మము యేకాగ్రత యనఁబడుచున్నది. సర్వార్థతా పరిణామముయొక్క లయమును, యేకాగ్రతా పరిణామముయొక్క ఉదయమును కలుగుచుండఁగా, సమాధి పరిణామ మని చెప్పఁబడుచున్నది.

వి. ఇదివఱకుఁ జెప్పిన నిరోధ పరిణామమునకును, ఈ సమాధి పరిణామమునకును భేద మెయ్యది యనఁగా.

అనుభవముచేఁ గలిగిన వ్యుత్థాన సంస్కార రూపముయొక్క వాసనలను త్యజించుచు, నిరోధరూప సంస్కారవాసనయందుఁ బ్రవేశించుట నిరోధ పరిణామము.

నానా విషయాకారమై పరిణమించు చిత్తధర్మముచే ననుభవించుటయొక్క లయమును. సత్త్వోత్కృష్టమునందు సుఖమయమై యుండు అనుభవముయొక్క ఆవిర్భావమును సమాధి పరిణామము.

అవ. ఏకాగ్రతా పరిణామమును బోధించుచున్నారు.—

12. శాన్తోదితౌ తుల్య ప్రత్యయౌ చిత్తస్యైకాగ్రతా పరిణామః.

తా. చిత్తమునకు శాంతము కలుగుచుండఁగా సమానములైన వృత్తి విశేషములు ఏకాగ్రతా పరిణామ మనఁబడుచున్నది.

వి. ఏకాకారమై యుండు చిత్తముయొక్క కేవల సత్త్వోత్కృష్ట ప్రవాహమునందు మొదటి స్థితియొక్క శమనమును, రెండవ స్థితియొక్క

ఉదయమును, ఇట్లుగా స్థితి కలుగుచుండుటయే ఏకాగ్రతా పరిణామ మనఁబడును.

ఎట్లనఁగా :—బహు దూరమైన మార్గమునందు నడచి పోవువానికి నడచిపోయినమార్గము నిలిచిపోయినట్లును, ముందుమార్గమునందు తాను ప్రవేశించు చుండునట్లును తెలియఁదగినది.

అవ. పరిణామ భేదములను చెప్పుచున్నారు.—

13. ఏతేన భూతేన్ద్రియేషు ధర్మలక్షణావస్థా పరిణామా వ్యాఖ్యాతాః.

తా. పైని జెప్పఁబడిన నిరోధసమాధి, ఏకాగ్రతా పరిణామముల నిరూపణచేత ; భూతములయందును, ఇంద్రియములయందును, ధర్మ పరిణామ మనియును, లక్షణపరిణామ మనియును, అవస్థాపరిణామ మనియును వివరింపఁబడిన దగుచున్నది.

వి. ఎట్లనఁగా :—స్వభావమై యుండు ధర్మికి, ముందున్న ధర్మము పోయి వేఱే ధర్మము కలుగుట ధర్మ పరిణామము. అనఁగా, మన్ను రూపమైన ధర్మికి ముందున్న ముద్దరూపమైన ధర్మముపోయి ఘటత్వ రూపమైన వేఱే ధర్మము కలుగుచున్నది ; అది మట్టికి ధర్మ పరిణామ మనఁబడును. ఇది నిరోధ పరిణామమునకు ప్రతిగా నున్నది.

ఆ ఘటము ముందు మట్టిచే కప్పఁబడియుండెను, అది మట్టిలోనుండి పైటికివచ్చెను, బైటవచ్చినది నష్టమై పోయినది అనుట ఘటమునకు లక్షణా పరిణామము. ఇది సమాధి పరిణామమునకు ప్రతిగా నున్నది.

ప్రతి క్షణమునందును ప్రతివస్తువునకును పరిణామము కలుగుచున్నది. ఎట్లన, ఒక వస్తువును మనము చూచునప్పుడు దానియందు అంతకుముందున్న స్థితి, ఆ చూచినప్పుడు లేదు. ఇట్లు చూచినక్షణమం దున్నస్థితి అనంతర క్షణమునందు లే దనుట ప్రతిదానికిని అవస్థాపరిణామ మనఁబడును. ఇది ఏకాగ్రతా పరిణామమునకు ప్రతిగా నున్నది.

ఇట్లు చిత్త పరిణామములను ఇతర స్థలములయందును అన్వయించు కొనవలయును. వీనివలన చిత్తమునందలి పరిణామ లక్షణములు తెలియును.

అవ. ధర్మియొక్క లక్షణ మిట్టిదని వచించుచున్నారు.—

14. శాన్తోదితా వ్యపదేశ్య ధర్మానుపాతీ ధర్మీ.

తా. తనతన పనులను చేయుటకు సామర్థ్యము లేక విశ్రాంతిని పొందియుండు నప్పుడును, తమతమ పనులను చేయుచుండు నప్పుడును, ఇట్టి పనులను చేయఁగల మని నిర్ణయించుటకు అశక్యమై యుండునప్పుడును వుండునట్టి ధర్మములను ఆశ్రయించి యుండునది ధర్మి యనఁబడుచున్నది.

వి. తమతమ పనులను చేయుటకు శక్తిచాలక శాంతమై యుండునట్టి ధర్మములను, తమతమ పనులను చేయుచుండు ధర్మములను, ఇట్టి పనులనే చేయఁగలమని నిర్ణయించుటకు అసాధ్యమైయుండు ధర్మములను యెడఁబాయక ఆశ్రయించి యుండునది ధర్మి యనఁబడును.

ఎట్లనఁగా:—బంగారమనెడు ధర్మి ఘట్టిరూపమైన ధర్మమును వహించి యుండు కాలమునందు, ఉంగరము రూపమైనధర్మము లేక యుండినట్లును, మరల అదే ఉంగరము రూపమైన ధర్మమును పొందియుండు కాలమునందు ఘట్టిరూపమైన ధర్మములేక యుండినట్లును; ఈ ఘట్టియందును, ఉంగరమునందును సహితము యెడఁబాటులేక యేకరూపమై యుండు బంగారము ధర్మి యనఁబడుచున్నది.

అవ. ఒక్క ధర్మికే అనేక పరిణామములు కలుగునని చెప్పుచున్నారు.

15. క్రమాన్యత్వం పరిణామాన్యత్వే హేతుః.

తా. ధర్మికి యేక్రమము గలదో, అట్టి క్రమమునందు ప్రతిక్షణమునను వేఱుగాఁ గనఁబడుట పరిణామాంతర కారణ మనఁబడుచున్నది.

వి. పృథివియందు మొదట చూర్ణము రూపము, అనంతరము ఆ చూర్ణముకలననుండి మృద్రూపము, తర్వాత దానివలననుండి కపాలములు.

అగల ఆ కపాలములవలననుండి ఘటము. ఇట్లు మట్టిరూప మైన ఒకే ధర్మము నందు అనేకపరిణామములు కనఁబడుచుండుటవలన నొక ధర్మికి అనేక పరిణామములు కలుగుటకు సందేహము లేదు. ఆకారణమునుబట్టి ఇదేలాగున చిత్తమునకును, భూతములకును, ఇంద్రియములకును, అనేక పరిణామములు కలవని తెలియఁదగినవి.

అవ. పరిణామములసంయమముచేత త్రికాలజ్ఞానము కల్గునని నిరూపించుచున్నారు. —

16. పరిణామత్రయ సంయమా దతీతానాగతజ్ఞానమ్.

తా. ఈ ధర్మికి ఈధర్మము, ఈ లక్షణము, ఈయవస్థ, అని పరిణామత్రయముయొక్క సంయమముచేతఁ గడచిపోయిన వస్తువుల విషయముల యందును జ్ఞానము కలుగును.

వి. ధర్మ లక్షణావస్థా పరిణామములవలన యోగికి ఈ వస్తువు ఈలాగున నుండెను, ఈలాగున నున్నది, ఈలాగున నగు నని వస్తువిషయక మైన త్రికాలజ్ఞానము కలుగును. అనఁగా భూతభవిష్యద్వర్తమానజ్ఞానము చక్కఁగాఁ గలుగును.

అవ. సకలజంతుభాషాజ్ఞానసిద్ధి కలుగుటకు ఉపాయమును జెప్పుచున్నారు.—

17. శబ్దార్థప్రత్యయానా మితరేతరాధ్యాసా త్సంకర స్తత్ప్రవిభాగ సంయమా త్సర్వభూతరుతజ్ఞానమ్.

తా. క్లుప్తవర్ణాత్మక మైన శబ్దము, జాతి గుణ క్రియారూప మైన ఆ శబ్దముయొక్క అర్థము, ఆ క్లుప్తమైన అర్థముచేఁ గలుగు జ్ఞానము, వీనియొక్క శబ్దార్థజ్ఞానములయందు ఒకదానిని వేఱొకదానినిగా బుద్ధికి చెప్పుకొనుటవలన ఒకదానిలో నొకటి కలిసిపోవుచున్నది. అట్లు పోనీయక ప్రత్యేక

ప్రత్యేకముగా విభజన చేసి సంయమము చేయుటవలన సకలప్రాణులభాషా జ్ఞానము కలుగును.

వి. ఇది ఈశబ్దము, ఇది దీనియర్థ మైన వ్యక్తి, ఇది ఈవ్యక్తియొక్క జ్ఞానము, అని వేర్వేఱుగా విభజనచేసి సంయమము చేయుటవలన మృగ పశు పక్షి సర్ప పిపీలికాదుల భాషాజ్ఞానము కలుగును.

ఎట్లనఁగా:— "గోవును తీసికొనిరా" అని చెప్పినప్పుడు, గోవు అను శబ్దమునకు గోస్వరూప మైన అర్థమనియు, ఈ అర్థమును జెప్పునది గోవు అను శబ్ద మనియు, ఈ శబ్దార్థముల రెంటివలన గలిగినది ఈ జ్ఞానమనియు విమర్శలేక వీని నన్నిటిని అభేదముగనే తెలియునట్టివాఁడు, "ఇది గోవు" అను వ్యక్తికి వాచకమైన "గోవు" అనెడు శబ్ద మనియు, ఈ "గోవు" అను శబ్దమునకు "గోవు" అను వ్యక్తిరూపమైన ఈ యర్థమనియు, ఈశబ్దార్థములను దెలియుచేయు జ్ఞాన మిది యనియు, పరస్పరము భేదమును దెలిసికొని వ్యవహరించుటలేదు. ఏలాగనఁగా, "గోవు" అనుచోట ఏది శబ్దము, ఏది అర్థము, ఏది జ్ఞానార్థ మని వానిని అడిగినచో, నీమూఁడు ప్రశ్నలకును "గోవు" అని ఏకరూపమైన ఉత్తరమును చెప్పఁగలఁడుగాని, పరస్పరభేదమును దెలిపి ఉత్తర మీయఁగలవాఁడు కాఁడు ఏలన, ఆ ఉత్తరము నిచ్చినవాఁడు శబ్దార్థ జ్ఞానములను అభేదముగాఁ దెలిసికొనినయెడల, శబ్దార్థజ్ఞానములు మూఁటికిని ఒకే ఉత్తరము నీయఁడు; కావున శబ్దార్థజ్ఞానములను చక్కఁగా విభజించి సంయమము చేయుటవలన సకల జీవజంతువుల భాషలు బోధపడును.

అవ. పూర్వజన్మజ్ఞానసిద్ధి కలుగుట కుపాయమును జెప్పుచున్నారు.

౧౮. సంస్కార సాక్షాత్కరణా త్పూర్వజాతి జ్ఞానమ్.

తా. ద్వివిధము లైన చిత్త సంస్కారములయందు సంయమము చేయుటచే కలుగు జ్ఞానమువలన, తనయందు తోఁచుచుండు సంస్కారములను విమర్శింపఁగా జన్మాంతరములయందు తనకుఁ గలిగిన జాతి మొదలగునవి గోచరించును.

వి. ద్వివిధ సంస్కారము లనఁగా.— జన్మ జన్మాంతరా ద్యనుభవములవలన చిత్తమునందు వాసనారూపమై నిలిచినది, ఇప్పుడు స్మృతిని కలుగఁజేయఁదగిన సంస్కారము లనియును, సుకృతదుష్కృతకర్మములను చేసి యుండుటవలన గల్గిన పుణ్యపాప పరిపాకమువలన సుఖదుఃఖములకుఁ గారణమైన జాత్యాయుర్భోగరూపమైన సంస్కారము లనియును రెండు విధములు.

ఈ రెండువిధము లైన చిత్తసంస్కారముల సంయమముచేఁ దాను పూర్వజన్మమునందు ఏజాతిప్రాణియై యున్నది మొదలగునవి చక్కఁగాఁ దెలియును.

అవ. పరచిత్తజ్ఞానమును దెలిసికొనుట కుపాయమును జెప్పుచున్నారు.

19. ప్రత్యయస్య పరచిత్తజ్ఞానమ్.

తా. పరుల సుఖరాగాది భావములవలనఁ గలుగు జ్ఞానమునందు సంయమము చేయుటవలన వారి అభిప్రాయములు గోచరించును.

వి. అన్యులయొక్క మాటలు, నడవడికలు, ముఖవికాసము, మొదలగువానిని జాగ్రత్తగా కనిపట్టినయెడల వారియొక్క చిత్తమందలి అభిప్రాయము ఇట్టి దని చెప్పునట్టి జ్ఞానము కలుగును.

అవ. పరచిత్తజ్ఞానమును దెలియమికి కారణ మిట్టి దని వచించుచున్నారు.—

20. నచ తత్సాలమ్బనం తస్య విషయీభూతత్వాత్.

తా. ఆ పరపురుషులయొక్క ఆలోచన చేయు చిత్తవికారాదులు బాహ్యమున కనఁబడనీయక లోపలనే ఆలోచించునప్పుడు, అట్టి దానిని సంయమమువలన కనిపట్టుటకుఁ గాఁ నేరదు.

వి. వీఁడు నల్లనిరంగు ఆలోచనయందున్నాఁడు, వీఁడు తెల్లని రంగు ఆలోచనయం దున్నాఁడు, అను నిట్టి విషయములతోఁ గూడి

యందు పరులచిత్తము, సుఖరాగాదిభావములచే బైట గోచరింపకుండుట వలన ఆచిత్తమందు సంయమమును చేయుట అశక్యము.

అవ. అదృశ్యకరణసిద్ధిని నిరూపించుచున్నారు.—

21. కాయరూపసంయమా ద్గ్రాహ్యశక్తిస్తంభే చక్షుః ప్రకాశసంయోగే న్తర్ధానమ్.

తా. తన ఆకారాది విశిష్టస్వరూపమునందు సంయమము చేయుట వలన, ఇతరులు గ్రహింపఁదగిన శక్తికి ప్రతిబంధకము కలుగుటయే గాక, ఇతరుల దృష్టికి శరీరము కనఁబడక అదృశ్య మగును.

వి. తనయొక్క శరీరాద్యవయవములను సంయమము చేయుటవలన పరులకు తన శరీరమందలి రూపాదులు ప్రతిబంధక మగుటవలన (శరీరము) కనఁబడక అదృశ్య మగుచున్నది.

అవ. శబ్దాద్యదృశ్యకరణిలక్షణమును జెప్పుచున్నారు.—

22. ఏతేన శబ్దాద్యన్తర్ధాన ముక్తమ్.

తా. క్రింద జెప్పఁబడిన దేహాదృశ్యకరణోపాయముచేత నే శబ్దాదులను దెలియక చేయ నగును.

వి. అదృశ్యకరణోపాయముచేత శబ్ద స్పర్శ రస గంధములను అదృశ్యము చేయవచ్చును.—

అవ. మరణకాలము నెఱుంగునట్టి సిద్ధిని వచించుచున్నారు.—

23. సోపక్రమం నిరుపక్రమంచ కర్మతత్సంయమా దపరాన్తజ్ఞాన మరిష్టేభ్యో వా.

తా. కర్మము తనకు ఫలము నిచ్చుటకు ఉపక్రమించిన దనియును. తనకు ఫలము నిచ్చుటకు ఉపక్రమింపక యున్నదనియును రెండువిధములు. ఆ రెండువిధములకర్మములను సంయమము చేయుటవలన అరిష్టసూచనలు మరణకాలము ఇవి గోచరించును.

వి. ఫలము నిచ్చుట కుపక్రమించినది సోపక్రమకర్మము. మంద ఫలము నిచ్చుటకు మిగిలి యుండునది నిరుపక్రమకర్మము. వీని సంయమము వలన మరణకాలము గోచరించును.

ఎట్లనఁగా:—ఉష్ణప్రదేశమునందు ఆరఁగట్టిన బట్టయొక్క తేమ శీఘ్రముగా నెండిపోవునట్లు, సోపక్రమకర్మము ప్రతిదినమును ఫలముల నిచ్చుటచేతను, దానికి విరోధమైన కర్మాచరణచేతను సహా శీఘ్రముగా క్షయించుచున్నది. శీతలప్రదేశమునందు మడతపెట్టియుంచినబట్ట నిదానముగా ఎండుచువచ్చునట్లు, నిరుపక్రమకర్మము కాలక్రమముచేతను దానికి వ్యతిరిక్తమైన కర్మము చేయుటచేతను, సావకాశముగా క్షయించుచున్నది. ఈ ద్వివిధములైన కర్మలయందును సంయమము చేయుటవలనఁ దనకు ఈ దేశమునందు, ఈ స్థలమునందు, ఈ వేళయందు, ఈరీతిగా శరీరవియోగము కలుగునని నిస్సంశయముగాఁ దెలియును. అరిష్టసూచనలవలనను మరణకాలము గోచరించును. అసూచనలు మూఁడువిధములు.

(1) తర్జనివ్రేళ్లతోఁ (చూపుడువ్రేళ్లతో) చెవులను గట్టిగా మూసికొనినయెడల చెవిలోపలి శబ్దము వినఁబడకుండుట, నాలుకను చాఁచి చూడఁగా నాలుకకొన కనఁబడకుండుట, దీపమును జూచిన రెండు శిఖలుగాఁ గనఁబడుట. ఇవి అధ్యాత్మిక (దేహమునకు సంబంధమైన) అరిష్టము లనఁబడును.

(2) వికారరూపములు కనఁబడుట, సూర్యునిజూచిన ముక్కలైనట్లును తూట్లుపడినట్లును కనఁబడుట, వీనిచేతను మరణకాలము సమీపించినదని తెలిసికొనవచ్చును. ఇవి ఆధిభౌతికారిష్టము లనఁబడును.

(3) ఎన్నఁడు చూడనట్టి స్వర్గాది లోకాంతరముల పదార్థములు కనఁబడుట, ఇవి పొందరైనవానిచేతను అంత్యకాలము సమీపించినదని యెఱుఁగవచ్చును. ఇవి ఆధిభౌతికము లనఁబడును.

అవ. చిత్తపరికర్మసిద్ధిని నిరూపించుచున్నారు.—

24. మైత్ర్యాదిషు బలాని.

తా. మైత్రి, ముదిత, కరుణ, ఉపేక్ష, అను వీనిని సంయమము చేయుటవలన ఆ మైత్ర్యాదులు వృద్ధి యగును.

వి. మైత్ర్యాదుల సంయమమువలన తాను అభ్యాసము చేయక పోయినను అవి వృద్ధి యగును. (ఈ విషయము 1-వ పా. 33-వ సూత్రమున వివరింపఁబడియున్నది.)

అవ. దేహబలమును తాను కోరినట్లుగాఁ జేసికొనుట కుపాయము జెప్పుచున్నారు.—

25. బలేషు హస్తిబలాదీని.

తా. ఏనుఁగు, సింహము, మొదలగువాని బలమునందు సంయమము చేయుటవలన, ఏనుఁగు సింహము మొదలగువాని బలము కలుగును.

వి. గజ సింహ హనుమద్గరుడ శరభ గండభేరుండ తిమి తిమింగల వాయ్వాది మహాశక్తిగలవానియందు సంయమము చేసినయెడల, తాను చేసిన దానియొక్క బల పరాక్రమ సాహస వేగాదులు కలుగును.

అవ. పరోక్షముగా నుండు వస్తువులను గాంచుటకు ఉపాయమును వచించుచున్నారు.—

26. ప్రవృత్త్యాలోకన్యాసాత్సూక్ష్మ వ్యవహిత విప్రకృష్ట జ్ఞానమ్.

తా. విషయవతి, జ్యోతిష్మతి అను విషయములయందు, సాత్త్విక ప్రకాశదృష్టిచేఁ జూచి సంయమము చేయుటవలన పరమాణువు మొదలు గాఁగల అతిసూక్ష్మమైన వస్తువులును, భూమిలో నిక్షేపము చేసియుండు నవియును, మేరువు మొదలగు పర్వతముల వెనుకటి భాగమునందు కనఁబడక యుండు సిద్ధరసాది వస్తువులును గోచరించు జ్ఞానము కలుగును.

వి. విషయవతీ జ్యోతిష్మతులచే సంస్కృష్టమైన చిత్తేంద్రియముల యందు ఆయావిషయములను జేర్చికొని సంయమము చేయుటవలన అతిసూక్ష్మమైనవిషయమును, భూమిలోనివిషయమును దూరమునందు కనఁబడకుండు నవిషయమును, మేరువు పశ్చాద్భాగమునందుండు సిద్ధమూలికాదులను గోచరించును. (1-వ పా, 35-వ సూత్రమున విషయవతిని గుఱించియును, 36-వ సూత్రమున జ్యోతిష్మతినిగుఱించియును చెప్పఁబడియున్నది).

అవ. లోకాంతర జ్ఞానసిద్ధిని చెప్పుచున్నారు.—

27. భువనజ్ఞానం సూర్యసంయమాత్.

తా. సూర్యునియందు సంయమము చేయుటవలన భూమ్యాది చతుర్దశలోకముల జ్ఞానము కలుగును.

వి. ప్రకాశమయుఁడైన సూర్యునియందు చేయు సంయమము వలన భూలోక, భువర్లోక, సువర్లోక, మహోలోక తపోలోక, జనలోక, సత్యలోకము లగు ఊర్ధ్వలోకములయొక్కయు; అతల, వితల, సుతల, తలాతల, రసాతల, మహాతల, పాతాళము లగు అధోలోకములయొక్కయు సకలవస్త్వాదిజ్ఞానము గోచరించును.

అవ. గ్రహనక్షత్రజ్ఞాన సిద్ధిని చెప్పుచున్నారు.—

28. చన్ద్రే తారావ్యూహజ్ఞానమ్.

తా. చంద్రునియందు సంయమము చేయుటవలన నక్షత్ర సమూహముయొక్క జ్ఞానము సిద్ధించును.

వి. ప్రకాశాత్మకుండైన చంద్రునియందు సంయమము చేయుట వలన భౌతికవస్తువులు (సకలగ్రహనక్షత్రములు) గోచరించును.

అవ గ్రహనక్షత్ర సంచార జ్ఞానసిద్ధిని నిరూపించుచున్నారు.—

29. ధ్రువే తద్గతిజ్ఞానమ్.

తా. ధ్రువునియందు సంయమము చేయుటవలన ఆగ్రహనక్షత్రముల సంచారజ్ఞానము కలుగును.

వి. గ్రహనక్షత్రములకు ప్రధానమైయుండు ధ్రువనక్షత్రమునందు సంయమము చేయుటవలన గ్రహ నక్షత్రాదుల సంచారాదులు గోచరమగును.

అవ. శరీరాంతరగకోశాది జ్ఞానసిద్ధిని చెప్పుచున్నారు.—

30. నాభిచక్రే కాయవ్యూహజ్ఞానమ్.

తా. నాభిచక్రమునందు సంయమము చేయుటవలన కాయవ్యూహజ్ఞానము కలుగును.

వి. దేహములోపలి నాభిచక్రమునందు సంయమము చేయుటవలన రస మల ధాతు నాడీ చక్రకోశములయొక్క సమస్తస్వరూపములను చక్కగా గోచరించును.

అవ. క్షుత్పిపాసానివారణసిద్ధిని వచించుచున్నారు.—

31. కణ్ఠకూపే క్షుత్పిపాసా నివృత్తిః.

తా. కంఠము లోపలిభాగమును సంయమము చేయుటవలన ఆకలి దప్పులు నివారణ మగును.

వి. కంఠకూప లోభాగమునందు ప్రాణాదులస్పర్శచే ఆకలి దప్పులను కలుగఁజేయు గుంటగా నుండు ప్రదేశమునందు సంయమము చేయుటవలన ప్రాణాదుల స్పర్శము తప్పిపోయి క్షుత్పిపాసానివృత్తి యగును.

అవ. దేహస్థైర్యసిద్ధిని జెప్పుచున్నారు.—

32. కూర్మనాడ్యాం స్థైర్యమ్.

తా. కుత్తుక దిగువభాగము నందుండు కూర్మనాడియందు సంయమము చేయుటవలన స్థైర్యము కలుగును.

వి. కూర్మనాడీ సంయమము వలన దేహమునకును, శరీరములోపలి కోశ ధాతు నాడీచక్రాదులకును స్వస్థత కలుగును.

అవ. దేవతాసిద్ధపురుష సందర్శనసిద్ధిని చెప్పుచున్నారు.—

33. మూర్ధ జ్యోతిషి సిద్ధదర్శనమ్.

తా. శిరస్సులోపల బ్రహ్మరంధ్ర మను స్థలమున ప్రకాశాత్మకమైన సుషుమ్నాంతమందుండు మహాతేజస్సునందు సంయమము చేసినయెడల సిద్ధ పురుషులు పొందఁబడఁగల మహాత్ముల దర్శనము కలుగును.

వి. గర్భగుడియందుండు అఖండజ్యోతియొక్క ప్రభ, వాకిలియొక్క రంధ్రముచే బైటప్రసరించునట్లు, శిరస్సులోపల సహస్రారమునందు జ్యోతి ర్మయమై యుండు శుద్ధసాత్త్విక ప్రకాశము సహస్రారముయొక్క క్రింది భాగమునందుండు బ్రహ్మరంధ్రముద్వారా బైటప్రసరించుచుండును. ఆ ప్రభ యందు సంయమము చేయుటవలన, అంతరిక్షమునందు సంచరించుచుండు దేవతలు, సిద్ధపురుషులు పొందలగు మహాత్ముల దర్శనమును, వారితో సంభా షించుటయును గలుగును. మఱియు ఆ ప్రదేశమున చిత్తమునందు సంస్కార రూపమైయుండు బింబములయందు సంయమము చేయుటవలన యేజన్మము నందైనను గాని తాను చూచినట్టి గతించినవారిని చూడనగును.

అవ. సర్వజ్ఞత్వ సిద్ధినొందుట కుపాయమును జెప్పుచున్నారు.—

34. ప్రాతిభాద్వా సర్వమ్.

తా. ప్రతిభయందుఁగాని, ఈ ప్రతిభయొక్క సంబంధమైన ప్రాతిభ మందుఁగాని, సంయమము చేయుటవలన సమస్తమును గోచర మగును.

వి. చిత్తముయొక్క సత్త్వభాగమునందు నెలకొని యుండు చిత్తు యొక్క ప్రభ (చిత్ప్రభ) ప్రతిభ యనఁబడును. అనఁగా, స్వాత్మత్వము, లేక శుద్ధజ్ఞానము, లేక ప్రతిబింబము ప్రతిభ యనఁబడుచున్నది.

ఈ ప్రతిబింబములవలన అంకురించుచుండు ప్రకాశకిరణములు (బుద్ధికి అహర్దేశ్యమై శక్షణమందు పుట్టుజ్ఞానము) ప్రాతిభ యనంబడును. ప్రతిభ యందుఁగాని, ప్రాతిభయందుఁగాని సంయమము చేయుటవలన సకల విషయ వస్తు విచారములును చక్కఁగాఁ దెలియును.

బ్రహ్మరంధ్రమునకు పైగను, సహస్రారమునకు దిగువను, చిత్తము యొక్క సత్త్వభాగమును, బ్రహ్మరంధ్రప్రాంతము రాజసభాగమును బ్రహ్మరంధ్రమునకు క్రింద తామసభాగమును నెలకొనియున్నది. ఈ ప్రతిభాగము నందును పరంపరగా చిత్ప్రతిభ చేరియున్నది. వీనివలన ప్రతిప్రభలు బయలు పడుచున్నవి. చిత్సంబంధమైన ప్రతిప్రభకును ఆ ప్రభను పొందియుండు వస్త్వనుగుణముగా జ్ఞానము కలిగియున్నది. ఈ జ్ఞానములు అంతఃకరణములై యున్నవి. ఎట్లనఁగా, శుద్ధసత్త్వభాగప్రభకు ప్రజ్ఞ యనియును, జ్ఞానమనియును; సత్త్వభాగప్రభకు బుద్ధి యనియును; రాజసభాగప్రభకు మనస్సనియును; తామసభాగప్రభకు అహంకార మనియును; వీనియం దంతయు అనాదిగా నెలకొనియుండునట్టియు, నెలకొనుచు వచ్చుచుండునట్టియు, సంస్కారరూపమైన చిహ్నములుగల భాగములకు చిత్తమనియును; ఈ శుద్ధసాత్త్వికాది భాగములకు వీనియొక్క స్వభావానుసారమై జ్ఞాతృత్వాది నామములు కలిగియున్నవి. వీనికన్నిటికి అంతఃకరణమనియు, చిత్తమనియు వ్యవహారము కలిగి యున్నవని తెలియఁదగినది. వీనిలో జ్ఞాతృవను కరణమునకు త్రికాలజ్ఞానమును, బుద్ధికి వర్తమాన కాలజ్ఞానమును, మనస్సునకు భవిష్యత్కాలజ్ఞానమును, చిత్తమునకు భూతకాలజ్ఞానమును, అహంకారమునకు అజ్ఞానమును, ఇట్లు అంతఃకరణములకు ప్రత్యేక ప్రత్యేకజ్ఞానము లున్నవి. వీనియందు బుద్ధ్యాదులు నాలుగును ప్రపంచాను వర్తనయందే యుండుటవలనను, మఱియు తమతమ స్వరూపములను తెలిసికొనకయుండుట వలనను, ఇవి అంతఃకరణ రూపమైనవగనే యున్నవి. జ్ఞాతృవు అంతఃకరణమైనను ప్రపంచవిషయములకు సాక్షిభూతుఁడుగా నుండునేగాని, విషయ

ములయందు అనువర్తించుటలేదు గాన, అంతఃకరణ మనెడు వ్యవహారము లేదు. సూర్యోదయ కాలమునందు సూర్యునిచే కిరణములు అంకురించుచుండునట్లు జ్ఞాతృసంబంధమైన ప్రజ్ఞ అంకురించుచున్నది. ఈ అంకురప్రసరణ సదా కలిగి యున్నప్పటికిని, ప్రపంచవాసనయం దుండు బుద్ధికి బోధ మగుట లేదు.

[దీనిని గురుముఖముగా తెలిసికొనవలయును. ప్రాతిభసంయమమే గాయత్రీ విద్యారహస్యమై యున్నది].

అవ. తనయొక్కయు నితరులయొక్కయు చిత్తవాసనల నెఱుంగుట కుపాయమును జెప్పుచున్నారు.—

35. హృదయే చిత్తసంవిత్.

తా. అంతఃకరణముల కాధారమైన శరీరముయొక్క మధ్యప్రదేశమునందు సంయమము చేయుటవలన తన చిత్తమునందలివియు, పరుల చిత్తమునందలివియు విషయములను తెలిసికొనవచ్చును.

వి. అంతఃకరణస్థానమైన హృదయ మధ్యభాగమునందు అధోముఖమై యుండు సూక్ష్మపుండరీకాకారమునందు సంయమము చేయుటవలన తనయొక్కయు, పరులయొక్కయు చిత్తమునందలి విషయజ్ఞానము (పూర్వ దహరవిద్య) కలుగును.

అ. జ్ఞాతృత్వజ్ఞానసిద్ధిని వక్కాణించుచున్నారు.—

36. సత్త్వపురుషయో రత్యన్తాసంకీర్ణయోః ప్రత్యయావిశేషోభోగః పరార్థా త్స్వార్థసంయమాత్పురుషజ్ఞానమ్.

తా. కేవలము పరస్పరము వేఱుగానట్టి ప్రకాశమానమైన భోగ్యరూపమైన బుద్ధితత్త్వమునందును, స్వాత్మరూపుఁడైన భోక్తృవగు జ్ఞాతృతత్త్వమునందును, తాను భోగ్యభోక్తృవనెడు జ్ఞానముయొక్క భేదము

లేకుండుట భోగ మనఁబడును. భోగ్యమైన బుద్ధి తత్త్వము తనకు ప్రయోజన మనెడి జ్ఞానమును విడిచి భోక్తృరూపుఁడైన పురుషునకు భోగమును సంపాదించి యీయఁగల ననెడి జ్ఞానముచే జ్ఞాతృవునందు సంయమము చేయుటవలన జ్ఞాతృరూపుఁడైన పురుషునియొక్క జ్ఞానము కలుగును.

వి. భోగ్య భోక్తృవులయొక్క పరస్పరభేదమును తెలియకయుండుట భోగము. ఈ యజ్ఞానమును విడిచి బుద్ధి భోగ్యము, పురుషుఁడు భోక్తృవు అను వ్యవహారమునకు లోఁబడినవాఁడను తెలివిచే చిత్స్వరూపుఁడైన పురుషునియందు సంయమము చేయుటవలన స్వరూపుఁడైన పురుషుని జ్ఞానము కలుగును. ఇది భూమావిద్యకు సంబంధించినది.

అవ. స్వాత్మరూపుఁడైన పురుషుని సంయమముయొక్క ఫలమును జెప్పుచున్నారు.—

37. తతః ప్రాతిభ శ్రావణ వేదనాదర్శాస్వాద వార్తా జాయన్తే.

తా. ఆ స్వాత్మసంయమాభ్యాసమువలనఁ గల్గిన ప్రాతిభజ్ఞానము వలన దివ్యజ్ఞానము, దివ్యస్పర్శజ్ఞానము, దివ్యరూపజ్ఞానము, దివ్యరసజ్ఞానము దివ్యగంధజ్ఞానము కలుగును.

వి. స్వాత్మపురుష సంయమముచే ప్రాతిభజ్ఞానము కలిగి అందువలన లోకాంతరముల యందుండు దేవతలు మొదలగువారితో మాటలాడుట, వారిని తాఁకుట, వారిని చూచుట మొదలగునవి సంప్రాప్తించును.

[ప్రాతిభమనఁగానేమి ఇదేపాదమున, 34-వ సూత్రమున చెప్పఁబడియె 36-వ సూత్రమున చెప్పఁబడినజ్ఞానము ఇహలోక సంబంధమును మాత్ర మనుసరించినది.]

అవ. ఇదివఱకుఁ జెప్పఁబడినట్టి సంయమసిద్ధులయొక్క గుణదోషములను నిరూపించుచున్నారు.—

38. తే సమాధా వుపసర్గా వ్యుత్థానే సిద్ధయః.

తా. ఇదివఱకుఁ జెప్పఁబడిన సిద్ధులవలనఁ గలిగిన ఫలములు, సమాధి యొక్క అభివృద్ధియందు విఘ్నరూపములై యున్నవి. సమాధిని విడిచిన కాలమున ఫలరూపములై యున్నవి.

వి. సమాధిని అభివృద్ధిచేసికొనుటకు సంయమముచేఁ గలిగిన ఫలములు విఘ్నకారులుగా నున్నవి. కాఁబట్టి నిరతిశయానంద రూపమైన కైవల్య మహా పదవిని యపేక్షించుయోగి, తుచ్ఛములైనట్టివియు అన్యులచే మహా పురుషుఁడని యనిపించుకొనుటకుఁ దగినట్టివియు నగు ఫలములను విడిచి సద్గతిని బొందు మార్గమునఁ బ్రవేశింపవలయును.

అవ. పరకాయప్రవేశ ప్రకారమును జెప్పుచున్నారు.—

39. బన్ధకారణ శైథిల్యాత్ప్రచార సంవేదనాచ్చ చిత్తస్య పరశరీరావేశః.

తా. చిత్తమును, పురుషుఁడును, అజ్ఞానమూలకమైన కర్మలేశముచేత శరీరమునందు బంధింపఁబడి యుండుటవలనను, దానికిఁ గారణమైన పుణ్య పాపకర్మములును నశించిపోవుటవలనను, చిత్తము హృదయప్రదేశ మందలి ఇంద్రియములద్వారా విషయములయందు ప్రసరించునట్టి సామర్థ్యము కలదిగా నుండుటవలనను, పరశరీరమందు ప్రవేశించుచున్నది.

వి. చిత్తము పురుషుఁడు సహా వ్యాపకులై యున్నప్పటికిని, అజ్ఞాన మూలకముగా కర్మమువలన భోగ్యభోక్తృవు లనిపించుకొని యుండుటకుఁ గారణమై యుండు పుణ్యపాపములు సమాధి బలమువలన క్షీణించుచువచ్చుట చేతను, చిత్తము ఈ ప్రదేశమునందు ఈ నాడిని ఆశ్రయించుకొని యున్నది, ఈ నాడులమార్గముగా ఇంద్రియములద్వారా విషయములను తెలిసికొను చున్నది, మఱియు ఇంద్రియములను ప్రాణాదివాయువులను వహించుకొని యుండు నాడులు ఈలాగున నున్నవి; అని తన శరీరమందును పరప్రాణిశరీ

అవ. పరేంగితజ్ఞానముల సిద్ధికొఱకు క్లేశకర్మనివృత్తి సిద్ధిని బోధించు చున్నారు.

44. బహిరకల్పితావృత్తిర్మహావిదేహా తతః ప్రకాశావరణక్షయః.

తా. శరీరముయొక్క వెలుపల శరీరాపేక్ష లేనట్టి చిత్తవృత్తి దేహాహంకారములు లేని మహావిదేహ మనఁబడుచున్నది. ఆ మహావిదేహమనెడు పేరుగల చిత్తవృత్తియందు సంయమము చేయుటవలన, ప్రకాశరూపమైన చిత్తమును చుట్టుకొనియుండు మలినరూపమైన క్లేశకర్మాదులు నశించిపోవుచున్నవి.

వి. శరీరాహంకారములతోఁ గూడియుండు చిత్తముయొక్క బాహ్యవృత్తి కల్పిత మనఁబడుచున్నది. శరీరాహంకారములను విడిచియుండు చిత్తముయొక్క బాహ్యవృత్తి మహావిదేహ మనఁబడుచున్నది. మహావిదేహవృత్తియందు చేయు సంయమమువలన క్లేశాదిమలములు నివర్తించును.

అవ. ఇదివఱకు వివిధసిద్ధులను బోధించి యిప్పుడు యోగికి స్వరూపదర్శనోపయోగమైన సబీజ నిర్బీజ సమాధిసిద్ధికొఱకు వివిధోపాయములను బోధింప నెంచినవారై, ప్రథమమున పంచభూతజయోపాయమును జెప్పుచున్నారు.—

45. స్థూలస్వరూపసూక్ష్మాన్వయార్థవత్త్వ సంయమాద్భూతజయః.

తా. పృథివ్యాది పంచభూతముల యందును, వాని స్వరూపములయందును, గంధాది పంచతన్మాత్రలయందును, వాని క్రియలయందును, భోగాపవర్గరూపశక్తియందును; క్రమముగా సంయమము చేయుటవలన పంచభూతముల జయము కలుగును.

వి. పృథివ్యప్తేజోవాయురాకాశములను పంచభూతముల (స్థూలభూతముల) యందును, వీనియొక్క స్వరూపము లైన కఠినాదుల యందును, గంధాదితన్మాత్ర లైన సూక్ష్మతత్త్వములయందును, వీనియొక్క స్థితుల యందును, ఇంద్రియములయందును, వీనియొక్క కర్మములయందును, అంతఃకరణములయందును, వీనియొక్క ప్రకాశరూప మైన వృత్తులయందును, క్రమముగా సంయమము చేయుటవలన పంచభూతజయము కలుగును.

అవ. పంచభూతజయముయొక్క ఫలమును చెప్పుచున్నారు.—

46. తతోఽణిమాదిప్రాదుర్భావః కాయసంపత్తద్ధర్మానభిఘాతశ్చ.

తా. ఆ భూతజయసిద్ధిచేత అణిమాద్యష్టసిద్ధులును, దేహసంపదయును, దేహరూపాదులు శాశ్వతముగా నుండుటయును సంభవించుచున్నది.

వి. పంచభూతజయమువలన అణిమాద్యష్టసిద్ధులును, రూపలావణ్యాది దేహసంపదయును, దేహబాహ్యాంగములు స్థిరమై యుండుటయును కలుగును (దేహసంపదనుగూర్చి క్రిందిసూత్రమున వివరింపఁబడును).

అణిమాద్యష్టసిద్ధుల వివరణము.

(1) పరమాణువుకంటె సూక్ష్మ మగుట అణిమము.

(2) మహత్తుకంటె గొప్పగా అగుట మహిమము.

(3) భారమునకంటె భార మగుట గరిమము.

(4) దూదికణముకంటె తేలిక యగుట లఘిమము.

(5) సూర్యచంద్రాదులను సహా అనాయాసముగా తాఁకునట్టి శక్తి గల్గుట ప్రాప్తి

(6) తాను తలఁచినరీతిగా అగుట ప్రాకామ్యము.

(7) మహిమ గలవాఁడుగా నగుట ఈశత్వము.

(8) చరాచరప్రపంచమంతయు తన ఆజ్ఞకు లోఁబడుట వశిత్వము.

అవ. పూర్వోక్త సూత్రమున జెప్పఁబడిన దేహసంపదను వివరించుచున్నారు.—

47. రూప లావణ్య బలవజ్రసంహననత్వాని కాయసంపత్.

తా. రూపము, లావణ్యము, బలము, కఠినము, ఇవి శరీరసంపదయనఁబడును.

వి. మన్మథ వసంత జయంతాదులకంటె మించిన సౌందర్యమును, సూర్యచంద్రాగ్నులను మించిన కాంతియును, బ్రహ్మ విష్ణు రుద్రాదులకంటె మించినశక్తియును, పర్వతపక్షములను ఛేదించినట్టి వజ్రమును మించిన కఠినత్వమును ఇవి శరీరసంపత్తనఁబడును.

అవ. ఇంద్రియజయమును జెప్పుచున్నారు.—

48. గ్రహణ స్వరూపాస్మితాన్వయార్థవత్వ సంయమాదిన్ద్రియజయః.

తా. ఇంద్రియ వృత్తులయందును, ఇంద్రియ ప్రకాశములయందును, అస్మితయందును, ఇంద్రియములయొక్క పాటవము శౌర్యము దార్ఢ్యము అగు వీనియందును, ఇంద్రియఫలమునందును, క్రమముగా సంయమము చేయుటవలన ఇంద్రియములు తన స్వాధీన మగును.

వి. విషయాభిముఖమై యుండు ఇంద్రియవృత్తులయందును, సామాన్యముగా ఇంద్రియగోచరముల (తెలిసికొనుట) యందును, అహంకారధర్మమైనట్టి నేను తెలిసికొన్నాను అనుటయందును, ఇంద్రియములపాటవము, పటు, దృఢము అగు వీనియందును, సంయమము చేయుటవలన ఇంద్రియజయము కలుగును.

అవ. ఇంద్రియజయముయొక్క ఫలమును జెప్పుచున్నారు.—

49. తతో మనోజవిత్వం వికరణభావః ప్రధానజయశ్చ.

తా. ఇంద్రియజయమువలన మనస్సువలె దేహములోని ఇంద్రియములు గమనాగమనాదులను, దేహముయొక్క బాహ్యేంద్రియప్రచారమును, మూలప్రకృతియొక్క స్వాధీనమును కలుగుచున్నది.

వి. ఇంద్రియస్వాధీనమువలన స్వేచ్ఛగా దేహమునందు ఇంద్రియములు సంచరించుటయును, దేహాపేక్షలేక బైటసంచారమును, అనఁగా, కన్నులు మూసికొనియున్నను బైటి రూపములు కనఁబడుచుండుటయును, మూలకారణజయమును కలుగును. ఈ సిద్ధులు మధుప్రతీకము లనఁబడును. అనఁగా, తేనెకుట్టెయందలి యే ప్రక్కనుండు తేనియను జుర్రినను ఎట్లు రుచికరమై యుండునో, అట్లు ఒక ఇంద్రియమును జయించినప్పటికిని ఆ యింద్రియాను గుణమైనసిద్ధి మహాసంతోషకరమైనదిగానే యుండును.

అవ. చిత్తముయొక్క సంయమమును, దాని ఫలమును జెప్పుచున్నారు.

50. సత్త్వపురుషాన్యథాఖ్యాతి మాత్రస్య సర్వభావాధిష్ఠాతృత్వం సర్వజ్ఞాతృత్వం చ.

తా. చిత్తముయొక్క సాత్త్వికభాగమునందు సంయమముచేయుటచేత; బుద్ధియు, పురుషుఁడు, వేర్వే అను జ్ఞానము కల్గును. ఈ జ్ఞానము కలవానికి సమస్తమైన ప్రకృతిపరిణామములకు తాను ఆధారభూతుఁడనియును వానియొక్క జ్ఞానము గలవాఁ డనియును బోధ మగును.

వి. చిత్తసాత్త్విక పరిణామమునందు చేయు సంయమమువలన పురుషునియందును బుద్ధియందును అన్యథా జ్ఞానము కలఁగును. అనఁగా బుద్ధియే పురుషుఁడు, లేక ఆత్మ అనెడు అజ్ఞానము తొలఁగును. మఱియు ప్రకృతిపరిణామములకు ఆధారభూతుఁడై యుండుటయును, సర్వజ్ఞాతృత్వ

మును కలుగుచున్నది. ఇట్టి జ్ఞానమునకు వశీకారమనియును, ఈ సిద్ధికి విశోకా అనియును సంజ్ఞకలిగి యున్నది.

అవ. విశోకాసిద్ధిని చెప్పుచున్నారు.—

51. తద్వైరాగ్యా దపి దోషబీజక్షయే కైవల్యమ్.

తా. ఆ విశోకానామకసిద్ధియందు వైరాగ్యము కలుగుటవలన రాగాదిక్లేశములకు కారణమైన అవిద్య నాశమై ముక్తి కలుగును.

వి. విశోకాసిద్ధియందు వైరాగ్యముచేయుటచే క్లేశాదులకు బీజమైన అజ్ఞానము క్షీణమై, అంతట నిరతిశయానందస్వరూపమైన కైవల్యము సిద్ధించుచున్నది.

అవ. యోగివిఘ్నములగువానిని పరిహరింపవలయునని వక్కాణించుచున్నారు.—

52. స్థాన్యుపనిమన్త్రణే సంగస్మయాకరణం పునరనిష్ట ప్రసంగాత్.

తా. దేవతలు భోజనముచేయుమని ప్రార్థించునపుడు, అభిలాషయు ఆశ్చర్యము నొందకూడదు. అభిలషించినయెడల, మరల దుఃఖరూపమైన సంసారముయొక్క సంబంధము కలుగును.

వి. ఆయాయా తత్త్వస్థానములకు అధిపతులైన తత్త్వాభిమానదేవతలు మొదలగువారు యోగియొక్క ఉత్కృష్టపదవికి సహింపనివారై విఘ్నము చేయదలంచి, మాయొద్ద భోజనముచేసి మాకోరికను నెఱవేర్పవలసినదని స్వర్గాదిలోకాంతరములయందుండు దివ్యస్త్రీలను, రసాయనాది పదార్థములను యోగి ముందు తెచ్చిపెట్టి స్వీకరింపవలయు నని ప్రార్థింతురు. వీరి ప్రార్థనను అంగీకరించినచో, యోగి మరల జననమరణప్రవాహరూపమైన ఘోరసంసారమునందు పడవలసివచ్చును; కాన వారి ప్రార్థనను అంగీకరింపఁ గూడదు.

యోగులు వారివారిస్థితులచే నాలుగుతరగతులవారుగ నున్నారు.

(1) యోగాభ్యాసి యైనవాఁడు ప్రవృత్తిమాత్రజ్యోతిష్కుఁడు.

(2) ఋతంభరాప్రజ్ఞా వంతుఁడు.

(3) భూతేంద్రియ జయశీలుఁడు.

(4) అతిక్రాంత భావనీయుఁడు.

నాలుగవతరగతివాఁడుమాత్రము సమాధిబలమువలన సప్తభూమికల ప్రజ్ఞగలవాఁడై మధుమతి యనెడు పేరుగల భూమికను సాధించుచుండు వాఁడు గాన, వీనినిమాత్రము ఆ దేవతలు ప్రార్థింతురు. ఈ యోగి ఆప్రార్థనము నంగీకరింపఁ దగదు.

అవ. సమాధిసిద్ధికై వేరొక యుపాయమును జెప్పుచున్నారు—

53. క్షణతత్క్రమయోః సంయమాద్వివేకజం జ్ఞానమ్.

తా. క్షణకాలముయొక్క ముందటి వెనుకటి క్షణములను సంయమము చేయుటవలన వివేకముచేఁ బుట్టిన జ్ఞానము కలుగును.

వి. కాలముయొక్క కడపటి అవయవమై, మఱియు విభాగశూన్యమై నదైయుండుకాలము క్షణకాలమనఁబడును. ఈ క్షణమునకు ఇది ముందటి క్షణము, ఈ క్షణమునకు ఇది వెనుకటి క్షణము అనునట్టి క్షణములయందు సంయమము చేయుటవలన ఆ క్షణకాలములు గోచరించు చుండును. అప్పుడు ఇతరములైన మహదాది పదార్థములయందుఁ గల తత్త్వములు తెలియును. ఇట్లు తెలియుటయే వివేకజ్ఞానము.

అవ. యథార్థజ్ఞానసిద్ధికల్గుట కుపాయమును జెప్పుచున్నారు—

54. జాతిలక్షణదేశైరన్యతానవచ్ఛేదాత్తుల్యయో స్తతః ప్రతిపత్తిః.

తా. ప్రాణుల జాతులయందును, వాని ఆకారాది రూపవిశేషముల యందును, వాని స్థానవిశేషములయందును, పరస్పరభేదము తెలియఁబడక

యుండునట్టి సమానవస్తువులయందు సంయమముచేయుటవలన అవి వేర్వేఱను నిశ్చయజ్ఞానము కలుగును.

౫౩. జాతిచేతను, ఆకారముచేతను, స్థానముచేతను సహా పరస్పర భేదము విభజనగాక యుండునట్టి సమానవస్తువులయందు సంయమము చేయుట వలన, అవి వేర్వేఱు అనునట్టి జ్ఞానము కలుగును. అనఁగా, వస్తువులయందు పరస్పరభేదము తెలియుటకు జాతియు, లక్షణము, ప్రదేశము, ఇవి కారణములై యున్నవి.

ఎట్లనఁగా; ఇది ఆవు, ఇది యెనుము, అను రెండువస్తువుల భేదము తెలియుటకు జాతి కారణమై యున్నది. మఱియు ఇది నల్లనియావు, ఇది తెల్లనియావు అను రెండువస్తువులయందు భేదము తెలియుటకు జాతి కారణముగాక, నల్లన తెల్లన అనెడు లక్షణమాత్రమే కారణమై యున్నది. సమమైయుండు రెండు ఉసిరికఫలముల భేదము తెలియుటకు జాతియు లక్షణము సహా కారణమై యున్నది. ఆ రెంటియందు దీనికి అది ముందుగను దానికిది ముందుగ నున్నదని వానిభేదము తెలియుటకు దేశము కారణమై యున్నది. దేనిచేతగాని జాతిలక్షణదేశములు మూఁడింటివలన భేదము తెలియుటకు అశక్యమై యుండు ఒకేజాతి, ఒకేలక్షణము, ఒకదేశమునం దుండునట్టి పృథ్వీపరమాణువుల భేదము అగు వీనిని తెలియుటకు వానియొక్క సంయమము చేయువానికి, వానియొక్క భేద మెప్పుడు తెలియవచ్చునో, ఆక్షణమునందే అతిసూక్ష్మములైన సకలవిషయముల జ్ఞానము కలుగుచున్నది. ఏలాగనఁగా, తనకు మఱుఁగునసుండు స్థలమునందు ఒకే శ్రుతి చేసియుండు నాలుగు వీణెలనుంచి ఆ నాలుగువీణెలయందును, ఒకే స్వరమును ఒకేకాలమున వాయించినయెడల ఆస్వరము ఒకటిగానే వినంబడినను, ఆ ఒకేస్వరము నందుండు భేదములుమాత్రము కనఁబడుచుండును.

౫౪. తారకశబ్దార్థమును నిర్వచించుచున్నారు.

౫౫. తారకం సర్వవిషయం సర్వథా విషయమక్రమం చేతి వివేకజం జ్ఞానమ్.

తా. వివేకమువలనఁ బుట్టిన జ్ఞానమునకు తారక మని నామము. ఈ తారకజ్ఞానము మహదాది సమస్తతత్త్వములు విషయముగాఁ గలది. మఱియు క్రమరహిత మైనది. ఇది వివేకమువలనఁ బుట్టిన జ్ఞానము.

వి. ముందుఁ జెప్పఁబడిన వివేకజన్యజ్ఞానము తారకము (ఘోరసంసారమునం దుండి గట్టెక్కింపఁగలిగినది, లేక యథార్థ మైనది) అనఁబడు చున్నది. తారకజ్ఞానమువలన పరమాణువు మొదలు మహాల ప్రకృతివఱకుఁ గల స్థూల సూక్ష్మాది నానావస్థాభేదములయం దుండు సర్వమును సర్వతోముఖమై ఏకకాలమునందే గోచరించును.

అవ. తారకజ్ఞానప్రయోజనమైన కైవల్యమును నిరూపించుచున్నారు.

56. సత్త్వపురుషయోః శుద్ధిసామ్యే కైవల్యమ్.

తా. చిత్తముయొక్క సత్త్వమునకును పురుషునకును, నిర్మలత్వము ఏకకాలమునందు కలుగుటయే కైవల్యము.

వి. చిత్తమునందలి సత్త్వమునకు కర్తృత్వాద్యభిమానములు గల గుణములయమై, తన స్వకారణమైన సమాత్రుండైన పురుషునియందు ప్రవేశించుటయు, పురుషునియందు ఆరోపితమై యుండు భోగము నివర్తి యగుటయు, ఇట్లు ఒకేస్థితి కలుగుటయే నిరతిశయానంద కైవల్య స్వరూప మైన మోక్షపదవి యనఁబడును.

పాతంజలయోగశాస్త్రమునందు

విభూతిపాదము

సమాప్తము.

ఓమ్.

పరాత్పరాయ నమః.

పాతంజలయోగశాస్త్రము

౪. కైవల్యపాదము.

శ్లో. యత్పదా[illegible]యోగసేవ దత్తే సిద్ధిం చ సర్వదా
కైవల్యాస్పదమపి నౌమి తం పార్వతీపతిమ్.

అ॥ పూర్వోక్తపాదములయందు జీవునకు కైవల్యస్వరూపము బోధమగుటకుఁ దగిన సాధనములను నిరూపించి, ఈ కైవల్యపాదమునందు సకలసిద్ధులకు సమాధియే కారణమనియును; ఈ సిద్ధులు పూర్వజన్మములందలి విరర్జితమైనను అభివ్యక్తమగునవియును: సమస్తమైన సమాధులయొక్క ఫలము కైవల్య మహాపదవి యనియును బోధించుచున్నారు.—

1. జన్మౌషధి మన్త్ర తపః సమాధిజాః సిద్ధయః.

తా. జన్మములు, మూలికలు, మంత్రములు, తపస్సు, సమాధి, అను వీనివలనఁ బుట్టునట్టి సమాధిసిద్ధులైదువిధములు గలవిగా నున్నవి.

వి. సమాధిసిద్ధులు నానావిధములైన జన్మములవలనను, మూలికలను సేవించుటవలనను, మంత్రములను జపించుటవలనను, తపస్సు చేయుటవలనను, సమాధులను అభ్యసించుటవలనను గల్గును. ఎట్లనఁగా:—

జన్మమేవలన నిమిత్తముచేసికొని ఆకాశమున సంచరించుట, జలమునందుండుట, జీవనాద్యములేక దేహమునుంచికొనియుండుట. బహుకాలము

జీవించుట, మనస్సునకు తోఁచినట్లెల్ల ఆకారములను ధరించుట, పరకాయ ప్రవేశము చేయుట, ఈ మొదలగునవి సమాధివలనఁ గల్గిన సిద్ధులు.

పూర్వ జన్మములయందు గలిగిన సమాధిబలమువలన పక్షులు, జలచరములు, సర్పములు, పిశాచప్రారబ్ధములు, ఈ విధమైన యొక్కొక్క ప్రాణులను నిమిత్తము చేసికొనియుండుట జన్మమువలనఁ గలిగిన సిద్ధులు.

నిద్రాహారములు లేక యుండుట, శీతోష్ణవిషవ్యాధుల నిగ్రహము, ఇంద్రియపటుత్వము, శరీరదార్ఢ్యము, జరామరణాదుల నిరోధము, దూరగమనాగమనములు మొదలగు సిద్ధులు, లేహ్య చూర్ణ కాయకల్ప సిద్ధరసాయన ఘుటికా పాదుకలు, ఇవి మొదలగు సిద్ధులు మూలికలవలనఁ గల్గిన సిద్ధులు.

ఆయా మంత్రాధిష్ఠానదేవతల శక్త్యనుగుణముగా కలుగునట్టిది మంత్రములవలనఁ గలిగిన సిద్ధులు.

వానివాని తపోబలము ననుసరించి గల్గు సిద్ధులు తపమువలనఁ గలుగు సిద్ధులు.

మఱియు సమాధివలనఁ గలుగు సిద్ధులనుగూర్చి 12-3 పాదములయందు విస్తరముగా జెప్పఁబడి యున్నది.

ఈ సిద్ధులు పూర్వ జన్మముయొక్క సమాధిబలమువలనఁ గలుగునవి యని నిరూపింపఁబడినది. మఱియు సమాధి యనునది సిద్ధులకు ముఖ్యకారణమైన దనియును, జన్మాదులు నిమిత్తకారణమైన దనియును చెప్పినందువలన, సమాధికి అధికప్రాశస్త్యము కలిగెను.

అవ. ఒక్క జన్మమునందే సమాధిఫలమును బొందవచ్చు నని చెప్పుచున్నారు.—

2. జాత్యన్తరపరిణామః ప్రకృత్యా పూర్వాత్.

తా. ఒక్క జన్మమునందే వేఱుజాతిగా పరిణమించుట యనునది ప్రకృతి పరిణామ సమాప్తివలనఁ గలిగినది.

వి. ప్రకృతి యనఁగా, ప్రధానము మొదలు పృథివివఱకు నుండు పదార్థములు.

ఈ పదార్థములయంశము సర్వ దేహములయందు నుండుటవలన, ప్రతిక్షణమునందును పరిణమించుచుండును.

ఇందువలన ఒకేజన్మమునందే పూర్వజాతి పరిణామము పూర్తియై వేఱొజాతిపరిణామము కలుగును.

దృష్టాంతము:—నందీశ్వరునకు ఆ జన్మమునందే పూర్వజాతి పరిణామము సమాప్తియై, వేఱొజాతి పరిణామము కలిగినందువలనను, జన్మాంతరాభ్యస్తమైన సమాధిఫలము అభివ్యక్తము కాఁగా, ఆ మొదటిజాతి అనర్హమైన దై పోయినందు వలనను, ఆ రెండవజాతి దేహమునందు ఫలము అభివ్యక్తమైనది. ఎట్టు లనఁగా, పట్టుపురుగు మొదట కంబళిపురుగుగా నుండి ఆ పరిణామము తీరఁగానే ఆ దేహమునందే సంజీవిపురుగువలె పరిణమించుచున్నది, కాఁబట్టి ప్రకృతియొక్క పరిణామము పూర్తియగుటయే వేఱొజాతి జన్మమునకు కారణ మని యెఱుఁగునది.

అవ. సకల జన్మములకును ప్రకృతియే కారణ మని వర్ణించుచున్నారు.—

3. నిమిత్త మప్రయోజకం ప్రకృతీనాం వరణభేదస్తు తతః క్షేత్రికవత్.

తా. కర్మము ప్రకృతి భాగములయొక్క కార్యమైన జాత్యంతర పరిణామమునకు కారణ మైనది కాదు. ఆ కర్మమువలన వ్యవసాయము చేయువాఁడు అడ్డముగానుండు వానిని తీసి పాఱవైచినట్లు ఆ ప్రకృతియొక్క ఆవరణము నివృత్తి యగుచున్నది.

వి. ప్రకృతిచేఁ గలుగునట్టి జాత్యంతర పరిణామమునకు కర్మము కారణ మగుట లేదు. ఏలననఁగా, కారణముచేఁ గార్యము కలుగుటయే

కాని, కార్యముచేఁ గారణము కలుగుటలేదు. గాన, ఈ పుణ్యపాప రూపమైన కర్మము ప్రకృతియొక్క కార్యమై యుండుటవలన, ఇది తనకుఁ గారణమైన ప్రకృతియొక్క స్వభావరూప పరిణామమైన జన్మములకు గారణమగుటలేదు. అయినను, పుణ్యపాప రూపమైన యీ కర్మము ప్రకృతియొక్క పరిణామముచేఁ గలుగు జన్మములకు ప్రతిబంధకముగాని, బలవంతముగాని చేయునదిగా నున్నది. ఎట్లనఁగా, కృషిచేయువాఁడు ఒక మడినుండి మఱియొక మడికి నీళ్లు పాఱించునపుడు మధ్య అడ్డమై యుండు మట్టిని తీసివైచినప్పుడు, ఆ మడియందుండు జలము మఱియొక మడికి కర్షకుని ప్రేరేపణలేకయే స్వభావముగాఁ బ్రవేశించి చౌకము, త్రికోణము మొదలగు ఆకారములు గల ఆ మడి వలెనే యెట్లు పరిణమించునో, అట్లే పుణ్యపాపములు అనుభవించిగాని, తమకు విరోధమైన కర్మము చేయుటవలనఁ గాని సమాప్తియై పోఁగా, ప్రకృతియొక్క పరిణామమునకుఁ గల ప్రతిబంధకము తప్పిపోయి, తన స్వభావమువలెనే పరిణమించును. కాఁబట్టి ప్రకృతియొక్క పరిణామక్రమమునందు అనేక జాతి జన్మములు కలవు. కర్మముచేత యీ జన్మములయందు దేనినైనఁ గాని సంపాదించుకొనవచ్చును. లేక పోఁగొట్టుకొనవచ్చును.

అవ. తత్త్వసాక్షాత్కారముగల యోగి స్వేచ్ఛానుసారముగా ననేక శరీరములను నిర్మించుకొనఁ గలఁడని చెప్పుచున్నారు.—

4. నిర్మాణచిత్తా న్యస్మితామాత్రాత్.

తా. యోగి నిర్మించునట్టి దేహములయందుఁ గల చిత్తములు కలుగ నిమ్ము, అని తలఁచిన మాత్రముచేతనే నానాదేహములను చిత్తములును కలుగుచున్నవి.

వి. కర్మలేశములేని యోగి (తత్త్వసాక్షాత్కారము గల యోగి) కర్మఫలములైన సుఖాదుల ననుభవించుట కిచ్ఛగించినంతనే, అగ్నివలన నేలాగున నిమిషమాత్రమునందు అనేకములైన కరణములు కలుగుచున్నవో, అట్లే అనేకములైన దేహాకారములై పరిణమించును.

అవ. యోగి శరీరములు వేరైనను అతని చిత్తమాత్రము యేకరీతి గానే యుండునని చెప్పుచున్నారు.—

5. ప్రవృత్తిభేదే ప్రయోజకం చిత్తమేక మనేకేషామ్.

తా. బహువిధములైన చిత్తప్రవృత్తులయొక్క భేదమునందు (కూడ) యోగియొక్క స్వకీయచిత్తము ఒకటే కారణమై యున్నది.

వి. ఆ అనేక చిత్తములయొక్క ప్రవృత్తినివృత్తులు భేదము గలవిగా గనబడినను, యోగియొక్క స్వయమైన చిత్తమాత్రము ఒకే కారణమైనదిగా నుండును. ఎట్లనంగా, ఒక దేహమునందుండు చిత్తము యింద్రియాదులను తన యిచ్ఛానుసారముగా నెట్లు ప్రేరేపించునో అట్లే యని భావము.

అవ. యోగియొక్క ప్రకృతిజన్మచిత్తమే శ్రేష్ఠమైనదని బోధించుచున్నారు.—

6. తత్ర ధ్యానజ మనాశయమ్.

తా. ఆ యనేకచిత్తము లన్నిటికంటె, ఇప్పటి సమాధిచేఁ గలిగిన చిత్తము కర్మవాసనా రహితమైనది.

వి. ఇదివఱకుఁ జెప్పఁబడిన జన్మాది కారణములచేఁ గలిగిన అయిదు విధములైన చిత్తములకంటెను ఇప్పటి సమాధిచే ననేకచిత్తములై పరిణమించు శక్తి గల చిత్తము కర్మవాసనారహితమైనదై విలక్షణమైనదై యుండును.

అవ. ఇతరు లాచరించు కర్మముకంటెను యోగులయొక్క కర్మము వుత్తమమైనదని చెప్పుచున్నారు.—

7. కర్మాశుక్లాకృష్ణం యోగిన స్త్రివిధ మితరేషామ్.

తా. యోగులకంటెను ఇతరులైన వారియొక్క కర్మము శుభ్రమైనదనియును, నీలమైనదనియును, మిశ్రమైనదనియును మూఁడు విధములు గలదిగా నున్నది.

వి. యోగులకంటెను ఇతరులయొక్క కర్మము పుణ్య పాప మిశ్ర రూపమైన సుఖదుఃఖ మిశ్రఫలముల నిచ్చునట్టిదిగా నున్నది. శుభఫలముల నొసంగఁదగిన యాగాది సత్కర్మములు శుక్లకర్మము లనియును, అశుభఫలముల నొసంగఁదగిన బ్రహ్మహత్యాది దుష్కర్మములు కృష్ణకర్మములనియును, మిశ్రఫలముల నొసంగఁదగిన వాపీకూపతటాకారామ నిర్మాణాది మిశ్రకర్మములు సుఖదుఃఖఫలముల నొసఁగు మిశ్రకర్మము లనియును, కర్మము మూఁడు విధములు గలవి. కర్మవాసనా రహితులైన యోగులు ఏ కర్మము చేసినను అది సంచితమై నిలువక జ్ఞానాగ్నిచే దహింపఁబడుచున్నది గాన యోగి యొక్క కర్మము విలక్షణమైనదిగా నున్నది.

అవ. పుణ్యపాప మిశ్రకర్మముల సంస్కారఫలమును నిరూపించుచున్నారు —

౮. తత స్తద్విపాకానుగుణానామే వాభివ్యక్తి ర్వాసనానామ్.

తా. ఆ కర్మములవలన, ఆయా జాతిదేహముల పరిపాకమునకు అనుకూలించు నట్టివిగా నుండు సంస్కారములయొక్క ఆవిర్భావము కలుగుచున్నది.

వి. కర్మ సంస్కారఫలములు స్మృతిమాత్ర సంస్కారఫలము లనియును, జాత్యాయుర్భోగఫలము లనియును రెండువిధములు.

స్మృతిమాత్ర సంస్కారఫలము లనఁగా:—చేయుటవలనను, అనుభవించుటవలనను, తెలిసికొనుటవలనను కలుగు సంస్కారము చిత్తమునందుండి తగిన కారణముల మూలకముగా జ్ఞాపకమునకు వచ్చునట్టివిగా నున్నవి. ఎట్లనఁగా, మొదట దేవతాదేహము వచ్చినప్పుడు కలిగిన సంస్కారము లన్నియు చిత్తమునం దుండి, మఱల దేవతాదేహము వచ్చినప్పుడు తప్పక అభివ్యక్త మగుచున్నది. ఆ దేవతాదేహములు రెంటిమధ్య, కలిగిన యితరదేహ

ములయందు అభివ్యక్త మగుటలేదు, ఈ ప్రకారముగా, మొదట మనుష్య దేహమునందు గలిగిన సంస్కారములు మఱల మనుష్యదేహము కల్గినప్పుడు అభివ్యక్త మగుచున్నది. ఆ మనుష్యదేహములు రెంటినడుమ కలిగిన యితర జాత్య శ్వాన శూకరాది దేహములయందు ఆ మనుష్యదేహమునందు కల్గిన సంస్కారములు అభివ్యక్త మగుట లేదు. ఇట్లు ముందు ఏజాతిదేహము వీని యందు గలిగినను ఆవాసన మఱల అట్టి దేహము వచ్చినప్పుడు మాత్రమే అభివ్యక్త మగును. ఇతర దేహములు కలిగినప్పుడు ఆ సంస్కారములు అభివ్యక్తము గాక చిత్తమునందు ఆచ్ఛాదితమై నిలిచియుండునే గాని అభివ్యక్తము కాదు. (జాత్యాయుర్భోగములను గూర్చి 2-వ పాదము 13-వ సూత్రమును చూడుడు.)

అవ. ప్రాణులయొక్క జన్మాదివాసనలు చిత్తమునందుండి సమాన దేహములయందే అభివ్యక్తమగు ననుటను దృఢపఱచుచున్నారు.—

9. జాతి దేశ కాల వ్యవహితానా మప్యానన్తర్యం స్మృతి సంస్కారయో రేకరూపత్వాత్.

జ్ఞాపకము, వాసన, ఇవి రెండు నొకేరీతిగా నుండుటవలన మనుష్యత్వ పశుత్వాదిజాతులు, కాశీరామేశ్వరాది దేశములు, జయవిజయాది సంవత్సరకాలములు, వీనివలన నొకటి కొకటి దూరదూరముగా నున్నను, ఆ స్మృతి సంస్కారములు ఒకటినుంటి మఱొకటి క్రమముగా నుండునట్టివిగా నున్నవి.

వి. జాతి దేశ కాలములవలన, ఒక జన్మమునకు మఱియొక జన్మము దూరదూరముగా నున్నను, అనఁగా మనుష్యజన్మమునుండి మఱల మనుష్య జన్మమువచ్చుటకు విలంబమైనను, ఆ మొదటి దేహమునుండి ఈ రెండవ దేహము క్రమముగా అతిసమీపమునం దుండునది యని యెన్నవలసినదిగా నున్నది. కాఁబట్టి, ఆ మొదటి దేహముయొక్క స్మృతి సంస్కారములు ఈ

రెండవదేహమునందు అభివ్యక్త మగుచున్నవే కాని, ఈ రెండవదేహము వచ్చుటకు అతిసమీపమునందలి వేఱే దేహముయొక్క స్మృతి సంస్కారములు కలుగుటలేదు. అనఁగా, సమానజాతి దేహముయొక్క స్మృతి సంస్కారముల కైకమత్యము కలుగునేగాని, భిన్నజాతి దేహములయొక్క స్మృతి సంస్కారములకు కార్యకారణభావము సంబంధించుట లేదు.

ఎట్లనఁగా:—పుణ్యముచే మొదట నొకనికి దేవతాదేహము కల్గియుండెను. ఆ పుణ్యము ముగిసిపోయినంత వాని సంచిత కర్మానుగుణముగా వేర్వేఱైన పశు పక్షి క్రిమి కీటకా ద్యనేక దేహములు వచ్చెను. ఆ జన్మములు తీరగానే పుణ్యఫలమైన దేవతాదేహము మరల వచ్చెను. రెండవ దేహము వచ్చినప్పుడు ఆ మొదటి దేవతాదేహమునందు సంపాదించిన స్మృతి సంస్కారములు అభివ్యక్త మగునేగాని ఈ రెండు దేవతాదేహముల నడుమ కలిగి తీరిపోయినట్టి పశుపక్ష్యాది దేహములయందు అవి అభివ్యక్త మగుటలేదు. ఈ పశుపక్ష్యాది దేహములు కలిగినప్పుడు ఆ దేవతా దేహముయొక్క స్మృతి సంస్కారములు అభివ్యక్తముగాక చిత్తమునందు బీజరూపమై నిలిచియున్నవి. ఆ దేవతాజన్మమునకు నీ రెండవదేవతా జన్మము సమానజాతియైన కారణమును బట్టి అతిసమీపమైన దని అనిపించుకొనుచున్నది. ఇట్లు సమానజాతిదేహములు కలిగినప్పుడు మాత్రమే ఆయా దేహముల స్మృతి సంస్కారములు కలుగుచున్నవి.

అవ. స్మృతి సంస్కారములు సమాన దేహములయందే అభివ్యక్తమగునని చెప్పి, యిపుడు ఆ స్మృతి సంస్కారములు అనాది యని నిరూపించుచున్నారు.—

10. తాసా మనాదిత్వ మాశిషో నిత్యత్వాత్.

తా. సదా సుఖసాధనములెల్ల నాకు కలుఁగనిమ్ము, ఎప్పుడును తప్పిపోఁగూడదు అనెడి చిత్తమునందలి మహా మోహారూపమైన సంకల్పమునకు

తా. సత్త్వాదిగుణముల యొక్క స్వరూపములైనట్టి ఆ ధర్మి ధర్మములు స్థూలములుగను సూక్ష్మములుగను ఉన్నవి.

వి. ధర్మిధర్మములు రెండును, సత్త్వాదిగుణ పరిణామముచే స్థూలములుగను, సూక్ష్మములుగను నున్నవి. ప్రకృతిసంబంధమైన సకల వస్తువులును బాహ్యాభ్యంతరభేదముచే వేర్వేఱుగా స్థూలసూక్ష్మములనుబట్టి పరిణమించుచున్నప్పటికిని, భావవస్తువులకుమాత్రము పరస్పరముగా కార్యకారణభావము కూడుచున్నది. అనఁగా, ఏ వస్తువు ఏ ఆకారమును బొంది యున్నదో, ఆ వస్తువు ఆయాకారమై పరిణమించియున్నది. ఎట్లనఁగా, ఘటము, మృత్తిక అను వస్తువుచేఁ గూడియుండుటవలన ఆ ఘటము మృత్తికయొక్క పరిణామ రూపమై యున్నది.

అవ. త్రిగుణములు వేర్వేఱైనను ధర్మిమాత్రము ఒక్కటేయని చెప్పుచున్నారు.—

14. పరిణామైకత్వాద్వస్తుతత్త్వమ్.

తా. త్రిగుణముల పరిణామముయొక్క ఐక్యమువలన భిన్నభిన్న రూపములై పరిణమించియుండు పదార్థములకు ఏకత్వము (ఒక్కటే యను వ్యవహారము) కలిగి యున్నది.

వి. గుణపరిణామముచే పదార్థము వేర్వేఱు రూపములను బొంది యున్నప్పటికిని, ఆ గుణములు పరిణామముయొక్క ఐక్యమువలన ఆ పదార్థము ఒక్కటే యను వ్యవహారము కలిగియున్నది.

ఏలాగనఁగా:—గుణముల పరిణామమునందు కొన్నిచోట్ల సత్త్వగుణము దేహియై యుండినచో (శరీరముకలదియై యున్నచో) మిగిలిన రాజస తామసగుణములు దేహమై (అంగమై) యుండును. కొన్నిచోట్ల రాజసము దేహియై యున్నచో, మిగిలిన సత్త్వతమోగుణములు దేహమై యుండును. కాఁబట్టి గుణముల పరిణామమువలన వేర్వేఱుగా నుండు ప్రతిపదార్థము

నందును ఈ త్రిగుణములు యెడఁబాయక యున్నవి గాన, ఆ పదార్థము ఒక్కటే యని వ్యవహరింపఁబడెను.

ఎట్లనఁగా:—పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, మొద లగు వస్తువులయందు అంగాంగిభావసంబంధము (దేహదేహిభావసంబంధము) వలన ప్రతిపదార్థమునందును త్రిగుణము లున్నను, ఆ పదార్థములు ఒక్కటే పదార్థ మని వ్యవహారము సిద్ధించి యున్నది.

అవ. ధర్మియొక్క వివిధ భేదములకు కారణమును నిరూపించుచున్నారు.—

15. వస్తుసామ్యే చిత్తభేదాత్తయో ర్విభక్తః పన్థాః.

తా. విజ్ఞానార్థములకు పదార్థములయొక్క సమత్వమునందు చిత్తముల భేదదశవలన, అనేకము లైన మార్గములు కలిగి యున్నది.

వి. ప్రకృతికార్య మైనపదార్థములును, చిత్తమును (విజ్ఞానమును) సహా ఒక్కటే యైనప్పటికిని, లోకమునందు వాసనాబలముచేత ననేక చిత్తము లుండుటవలన, వస్తువులకును, చిత్తములకును అనేకము లైన మార్గములు కలిగియున్నవి. కాఁబట్టి విజ్ఞానవ్యతిరిక్త మైన పదార్థము లున్నవి.

ఉదాహరణము:—ఒకేవస్తు వైన స్త్రీ యొక్క పురుషునకు దొరికిన యెడల ఆ స్త్రీ ఆ పురుషునకు సుఖకరముగాను, అదే స్త్రీ సవతికి దుఃఖకరముగాను, సన్న్యాసికి నిందితురాలుగాను నుండును. కావున ఆ స్త్రీ ఒకేవస్తు వైనను పరుల చిత్తములయొక్క వాసనాభేదములచేత ననేక విధములుగా గానఁబడుచుండును. విజ్ఞానవ్యతిరిక్త మైన వస్తువులు లేకపోయిన యెడల, ఒకేవస్తువు ఒక చిత్తమునకు సుఖమును, వేఱొకచిత్తమునకు దుఃఖమును, మఱొకచిత్తమునకు అసహ్యమును కలుగఁజేయుటకు కారణము లేదు. కాన విజ్ఞానవ్యతిరిక్తమైన వస్తువు లున్నవియని గోచరించుచున్నవి మఱియు నందఱియొక్క చిత్తములు నేకరీతిగా నున్నవి యని చెప్పినప్పుడు, ఒకని

అవ. చిన్మాత్రుఁడగు పురుషుఁడు గ్రహీతృ వనియును, పరిణామమును బొందనివాఁడనియును జెప్పుచున్నారు.—

17. సదా జ్ఞాతా శ్చిత్తవృత్తయ స్తత్ప్రభోః పురుషస్యా పరిణామాత్.

తా. ఆ చిత్తమురొక్క అధిపతియైన చిన్మాత్రుఁడగు పురుషునకు పరిణామము లేకుండుటవలన చిత్తముయొక్క వృత్తులు నిరంతరమును తెలియఁబడినవిగా నున్నవి.

వి. చిత్తమునకు ప్రభువైన పురుషునకు పరిణామాద్యవస్థలు లేకుండుటవలన ఆ చిత్తవృత్తులను సదా చూచుచున్నాఁడు, పురుషుఁడు పరిణామము కలవాఁడైనయెడల చిత్తవృత్తులు తెలియకపోవలసి వచ్చును.

అయినను పురుషుఁడు చిత్తమునకు ఆధారభూతుఁడై యుండుటంబట్టి చిత్తము ఏయే విషయములయొక్క వస్తువులయందు చేరుచున్నదో, ఆయా విషయములయొక్క వస్తువులనంతయు పురుషుఁడు చూచుచునే యున్నాఁడు గాన పురుషునకు పరిణామాది ధర్మములు లేవు.

అవ. చిన్మాత్రుఁడైన పురుషునియొక్క ప్రయోజనమును జెప్పుచున్నారు.—

18. నత త్స్వాభాసం దృశ్యత్వాత్.

తా. ఆ చిత్తము పురుషునకు దృశ్యమై యుండుటవలన స్వప్రకాశక మైనది.

వి. చిత్తము చిన్మాత్రుఁడైన పురుషునకు కనఁబడునట్టి పదార్థమై యుండుటంబట్టి, కనబడునట్టి ఘటపటాదులవలె స్వప్రకాశక మైనదికాదు. అనఁగా తనను ప్రకాశింపఁజేసికొనునట్టిది కాదు. ఇట్లనుటచే స్వయంప్రకాశక మైన దని తెలియఁదగినది.

అవ. చిత్తముయొక్క స్వభావస్థితిని వివరించుచున్నారు.

19. ఏకసమయే చోభయానవధారణమ్.

తా. ఏకకాలమునందే స్వరూపమును వస్తువును సహా గ్రహించుటకు సాధ్యము కాదు.

వి. ఒకేసమయమున తన స్వరూపమును ఇతరవస్తువులను సహా గ్రహించుశక్తి చిత్తమునకు లేదు గాన, చిత్తము స్వప్రకాశ మైనది కాదు. మఱియు నేను సుఖిని, నేను దుఃఖిని, అను విరుద్ధ మైన ద్వివిధజ్ఞానము లేకకాలమునందు గలుగనేరదు. ఇంతేగాక తనస్వరూపమును పరులస్వరూపమును సహా ఒకేతూరి తెలియుటకు కాదు; గాన, చిత్తము స్వప్రకాశ మైనది కాదు. అయినను దృశ్యమై యున్నదని యెఱుంగవలయును.

అవ. చిత్తమునకు స్వతః యోగ్యత కలదనియును, వేఱొకబుద్ధిచేత యోగ్యత కలుగ దనియును చెప్పుచున్నారు.—

20. చిత్తాన్తరదృశ్యే బుద్ధే రతిప్రసఙ్గ స్స్మృతిసంకరశ్చ.

తా. బుద్ధికి స్వప్రకాశకము లేకపోయినప్పటికిని, వేఱొకబుద్ధిచేత దర్శనయోగ్యత కలుగుచున్నదనఁగా అతిప్రసంగ మగుచున్నది మఱియు స్మృతి మిశ్రమై పోవుటయు సహా కలుగుచున్నది.

వి. బుద్ధికి వేఱొబుద్ధివలన జ్ఞానము కలుగు ననఁగా, ఆబుద్ధికి వేఱొక బుద్ధిచేత జ్ఞానము కలుగవలసివచ్చుచున్నది. దానికి మఱియొకదానిచేతను, దానికి వేఱొకదానిచేతను, ఇట్లు గుఱి లేక ఆయుపు ముగియువఱకు ఉత్తరమును చెప్పినప్పటికిని పూర్తియగుట లేదు గాన, అధికప్రసంగ మగుచున్నది. మఱియు, ఆ యనేకబుద్ధుల సంస్కారములచేఁ బుట్టు స్మృతి యొట్టిది? మఱియు నెట్టిదై యున్నది? ఇది యేబుద్ధిచేతఁ బుట్టినది? అని తెలియకయు, తాను ఏమి చేయవలయుననుట తోఁపకయు పోవుటచే ముక్తిపర్యంతమును ఒకేనిమిత్తమే యున్నదని తెలియఁ దగినది.

అవ. బుద్ధికి స్వవ్యవహారజ్ఞానము కలుగుటకు కారణ మిట్టిదని చెప్పుచున్నారు.—

21. చితేరప్రతిసంక్రమాయా స్తదాకారాపత్తౌ స్వబుద్ధి సంవేదనమ్.

తా. మిశ్రమముగానట్టి చిత్ప్రకాశమునకు, ఆ చిత్తముయొక్క రూప ప్రాప్తియందు చిత్తమందలి బుద్ధికి తెలివి గలుగుచున్నది.—

వి. అంగాంగీభావముచేత సంస్పర్శము మిశ్రము గాక యుండు చిత్ప్రకాశము, ఎప్పుడు చిత్స్వరూపము గలది యగుచున్నదో, అప్పుడు చిత్తము స్వస్వరూపమును వహించును.

అంగాంగీభావ మనఁగా:— ప్రసరించుచుండు పరమాణువు లెట్లు వస్తువులయందు గూడికొని యున్నవో, అట్లు చిత్ప్రకాశమును చిత్తాకారమును వహించును. అప్పుడు బుద్ధికి స్వస్వరూపజ్ఞానము కలుగును.

అవ. చిత్ప్రకాశముతోఁ గూడిన చిత్తము సకల వ్యవహారములను స్వయముగా నిర్వహించు చున్నదని చెప్పుచున్నారు.—

22. ద్రష్టృ దృశ్యోపరక్తం చిత్తం సర్వార్థమ్.

తా. చిద్రూపపురుషుఁడు, విషయము అను నీ రెంటిచేఁ గూడినట్టి చిత్తము, సకలవిషయములను గ్రహించునట్టి శక్తికలదిగా నున్నది.

వి. చిత్ప్రకాశముతోఁ గూడియుండు, దృశ్యపదార్థమువలె పరిణమించుటంజేసి బుద్ధికి సకలవ్యవహారజ్ఞానము కలుగుచున్నది.

ఎట్లు లనఁగా:— నిర్మల మైనయద్దము పొందలగువానికి ప్రతిబింబ గ్రహణశక్తి కలిగియున్నట్లు, రజస్తమోగుణములసంబంధము లేని శుద్ధసత్త్వ గుణమాత్రము గల బుద్ధి, చిత్ప్రకాశమును గ్రహించును. ఈబుద్ధి నిశ్చలమై యుండు దీపమువలె, సదా యేకరూప మైన పరిణామము కలదియై, చిత్ప్ర

కాళమును గ్రహించునట్టి శక్తిని కలిగి యుండుటవలన మోక్షము వఱకును యేకాకారమై యున్నది.

అయస్కాంత సమీపమునందు, లోహమునకు స్వయముగా శక్తి కలిగి యేలాగు చలించు చుండునో, అట్లే చిత్పురుషునియొక్క సాన్నిధ్యమునందు చిత్తముయొక్క సత్త్వభాగమైనబుద్ధికి శక్తికలిగి సకల వ్యవహారములను నిర్వహించుచున్నది.

ఈ శాస్త్రమునందు నిత్యోదితాచిచ్ఛక్తి యనియును, అభివ్యంగ్య చిచ్ఛక్తి యనియును రెండువిధముల శక్తులున్నవి. అవి యెట్లనగా :—

చిత్స్వరూప పురుషునియందుండు శక్తి నిత్యోదితాచిచ్ఛక్తి ఆ చిత్స్వరూపపురుషుని సాన్నిధ్యముచేత అభివ్యక్తమైన చైతన్యముగల చిత్తమందలి శుద్ధ సత్త్వభాగము అభివ్యంగ్యాచిచ్ఛక్తి ఇది చిద్రూప పురుషునకు అతి సమీపమునం దుండుటంబట్టి, భోగ్యవస్తు (భోగమును అనుభవించుటకు యోగ్యమైన వస్తువై యున్నది. ఈ యభివ్యంగ్యశక్తిని సాంఖ్యులు పురుషునకును పరమాత్మకును మధ్య ఆశ్రయభూతమై యుండును కర్మకు అనుగుణమైనదై సుఖభోగార్హమైనదై యున్నదని చెప్పెదరు. చిత్తమందు కర్మ పరిపాకముచే రాజస తామస గుణములు వుద్రేకమైనప్పుడు, ఆ గుణములయందు ఈ అభివ్యంగ్యశక్తి తన ఆకారమును సమర్పించుట (ప్రతిఫలించుట) చేత ఆ గుణానురూపమైన కర్మఫలమును ఈ అభివ్యంగ్యశక్తి అనుభవించును. మఱియు చిత్తమందుండు రజస్తమోగుణములు సహా ఆ అభివ్యంగ్యశక్తివలన చేతనము గలవైయై దుఃఖాదికర్మములను అనుభవించుచున్నది. కొందఱు ఈ సకల దుఃఖములఫలములును ఈ సాత్త్వికాది గుణములకు అతి సమీపమునం దుండు పురుషునియందు ఆరోపించెదరు. వేదవాదులైనవారిలో కొందఱు ఈ అభివ్యంగ్యశక్తిని తత్త్వమనియు, ఆత్మయనియును వ్యవహరించెదరు. మఱి కొందఱు సత్త్వభాగము పురుషునియొక్క ప్రతిబింబమును వహించుచున్నదనియును, ఈ ప్రతిబింబమును రజస్తమములు క్రమముగా వహించుచున్న

బనియుండు, ఈ పరంపరయొక్క ప్రతిబింబముల నన్నింటిని ప్రతిబింబములనియే వ్యవహరించెదరు.

అయినను, నిజమైన ప్రతిబింబము సత్త్వమునందు మాత్ర మున్నది. ఆకారాదులు లేని చిద్రూప పురుషుడు నిర్మలమైన సత్త్వమునం దేలాగు ప్రతిఫలించు ననగా:—ఆకారశూన్యమై నిర్మలమై వ్యాపకమై యుండు ఆకాశము దర్పణాదులయం దెట్లు ప్రతిఫలించునో, అట్లు పురుషుడు సహా నిర్మలసత్త్వమునందు ప్రతిఫలించును. ఈ ప్రతిఫలించుటకు (ప్రతిబింబమునకు) బాహ్యమందలి వస్తువిషయముల సాక్షాత్కారముచే పురుషుడు భోక్త యని చెప్పుట యుక్తము కాదు. మఱియు, ప్రకృతి పరిణమింపక యున్నయెడల, ఆ సత్త్వభాగమే కలుగదు. కాన అప్పుడు యే తొందరకును కారణములేక యుండును.

ఈ ప్రకృతి యెందుకొఱకు పరిణమింపవలయు ననగా:—స్వయం జడమైన దేహేంద్రియా ద్యవయవమును, అంతరాత్మచే చేతనజ్ఞానము కలదియై ఆ ఆత్మనిమిత్త మేలాగు సకల వ్యాపారములను స్వయముగా నిర్వహించుచున్నదో, అట్లు స్వయంజడమైన ప్రకృతి చిత్పురుషుని యందుండుట వలన చేతనజ్ఞానము కలదియై, ఆ చిత్పురుషునకు భోగమును సంపాదించి యిచ్చు ననెడు సంకల్పముచే మహదాది మహాభూతముల పర్యంతమును అనులోమ పరిణామమును మఱల నే క్రమముగా పరిణమించెనో, ఆదే క్రమముగా వెనుక వెనుకను తమతమ కారణములయందు లయ మొందును పోవునట్టి విలోమపరిణామమును పొందుచుండు మూలముగా పురుషునకు భోగమును కలుగజేయుట ప్రకృతికి స్వభావమైన పనిగా నున్నది. ఇట్లు మోక్షము దనుక భోగమును సంపాదించి యిచ్చుచున్నది.

అయినను, ప్రకృతికి స్వభావముగానే ఇట్టి అనులోమ విలోమ పరిణామములు కలుగుచున్నయెడల, ఈ పరిణామమునకు పర్యవసానము లేదు

గాన, మోక్షమనునదే లేక పోవును. మఱియు మోక్షోపదేశశాస్త్రాదుల వలనను ప్రయోజనము లేక పోవును.

ప్రకృతి పురుషులకు భోగ్య భోక్తృభావసంబంధము అనాదియైనదిగా నున్నను, చేతనమును బొంది యుండు ప్రకృతియొక్క అంశము కర్తృత్వాభిమానముచేత దుఃఖాదుల ననుభవించు చుండఁగా, ఈ దుఃఖ నివృత్తి యెట్లు కలుగుచున్నదనెడి యాలోచనవలన అవశ్యకముగా మోక్షమునందు ప్రయత్నము కలుగుచున్నది అందు కొఱకు శాస్త్రములు వెలసి యున్నది. ఇదే ప్రకారముగా సకలశాస్త్రముల యందును జెప్పఁబడియున్నది గాన, చిచ్ఛక్తిని బొందియుండు బుద్ధితత్త్వము విలోమపరిణామక్రమము చేత కైవల్యమును బొందుచున్నది. అనులోమ పరిణామక్రమముచే జగద్వ్యాపారమునంతయు స్వయముగా నిర్వహించుచున్నది. ఇట్లు చిత్తము యొక్క స్వరూపము నిరూపింపఁబడినది గాన, దీనిపై వేఱె యేవిధమైనట్టి ఆక్షేపమునకు అవకాశము లేదు.

అవ. చిత్తముచేతనే సకలవ్యవహారమును కలుగు ననఁగా, పురుషుని వలని ప్రయోజన మే మని వితర్కించుచున్నారు.—

23. తదసంఖ్యేయవాసనాభి శ్చిత్ర మపి పరార్థం సంహత్యకారిత్వాత్.

తా. ప్రకృతియు పురుషుఁడు సహా మిశ్రమై అర్థక్రియలను (ప్రయోజన వ్యవసాయములను) చేయుటవలన, ఆ చిత్తము లెక్కలేని సంస్కారములచేత నానావిధములుగా నున్నప్పటికిని, చిన్మాత్రుఁడైన పురుషునకు భోగమోక్షరూపమైన ప్రయోజనము కలుగుచున్నది.

వి. పురుషునియొక్క చేతనమును పొంది కలుగునట్టి వ్యవసాయమును, దానిఫలములును సహా పురుషునకు మాత్రమే ప్రయోజనకారి యైనదిగా నుండుటవలన, కారణపురుషుఁ డొకఁడున్నాఁడని తెలియఁబడుచున్నది. ఎట్లనఁగా.—

ఎట్లు క్రియాకారులైన భోజనశయ్యాదు లెట్లు పరప్రయోజనకరమై నదిగా నున్నవో, అట్లే చిత్తరూపక మైన సత్త్వాదిగుణములయొక్క పరిణామధర్మము లన్నియు పరప్రయోజనకరములై యున్నవి. ఎవఁడు పరుఁడో వాఁడే చిన్మాత్ర పురుషుఁ డని తెలియఁదగినది. భోజనశయ్యాదులు శరీరమున్నంతకును ప్రయోజనకరమై యున్నవి. ఆ శరీరియైన పరునకు ప్రయోజనమేమి యనఁగా:—స్థూలపదార్థములచే స్థూలదేహములకు దృష్టాంతము చెప్పియుండుటచే, నిర్మలమైన శుద్ధసత్త్వగుణమునుబట్టి నిర్మలుఁడైన పురుషునకు దృష్టాంతము చెప్పఁబడినది గాన, ఆక్షేపమునకు అవకాశము లేదు. మనకు కలుగుచుండు ప్రతియొక్కొక్క ప్రయోజనమునుబట్టి, యెవరికి కలిగినదని క్రమముగా విభజించుచు పోయినయెడల తుదకు యెక్కడనిలిచి పోవుచున్నదో, అక్కడనే పురుషుఁ డున్నాఁడని తెలియును. ఎట్లనఁగా.

దీపము యెవరికి ప్రయోజనమైనదని విభజించుచు పోయినయెడల మొందట శరీరమునకని తెలియుచున్నాఁడు; తర్వాత కన్నులకని తెలియుచున్నాఁడు; ఆమీఁద బుద్ధి కని తోఁచును. తర్వాతను విభజనచేయఁగా ఆ బుద్ధియందలి చేతనమునకని తెలియును. ఆ చేతనము ఎవరి దనఁగా, ఆత్మ యొక్కది యనును. కాబట్టి, ఆ ఆత్మయే చిద్రూపపురుషుఁడు గాన సకల ప్రయోజనములును యీ ప్రకారము చిద్రూపపురుషుని నిమిత్త మని తెలియఁబడు చున్నందువలన, పురుషుఁ డున్నాఁ డనుట చక్కఁగా తెలియఁబడుచున్నది.

చిద్రూపునికంటె ఇవతలనే వీనిప్రజ్ఞ యుండుటవలన ఆ చిద్రూపునికంటె మీఁదనుండు నిర్గుణపరబ్రహ్మమును చెప్పుటకు కాదు. ఏలనఁగా:— ఆ పరబ్రహ్మము వేదములకును వాక్కులకును అతీతమై యున్నందున చెప్పుటకు కానేర దని తెలియఁదగినది.

అవ. ఈ శాస్త్రప్రయోజన మైన కైవల్యస్వరూపమును (ఆత్మను) నిరూపించుచున్నారు.—

24. విశేషదర్శిన ఆత్మభావనా నివృత్తిః.

తా. చిత్తము వే ఱనియును, చిద్రూపపురుషుఁడు వే ఱనియును చక్కఁగా తెలిసినవానికి; చిత్తమే ఆత్మ యనెడుభావము లేకపోవుచున్నది.

వి. చిత్తమును పురుషుఁడును వేర్వే ఱని అంతరదర్శనముచే తెలిసిన వాఁడు భ్రాంతిచేనైనను చిత్తమును ఆత్మ యని యెంచ నేరఁడు.

అవ. చిత్తమునందలి ఆత్మభ్రాంతి నివృత్తి యయినమీఁద నేమి కలుగు ననుటను వివరించుచున్నారు.—

25. తదా వివేకనిమ్నం కైవల్యప్రాగ్భారం చిత్తమ్.

తా. చిత్తమందలి ఆత్మ భ్రాంతి పోయినమీఁద, వివేకరూపజ్ఞానము నందు అంతర్ముఖమై యుండు చిత్తము కైవల్యముయొక్క ప్రారంభమునం దుండును.

వి. చిత్తమే ఆత్మ యనెడు భ్రాంతి నిశ్శేషము తొలఁగినప్పుడు, వివేకజ్ఞానమునందు అంతర్ముఖమై (నిర్భ్రాంతిని గొని) కైవల్యపదముయొక్క మొదటిభాగమునం దుండును.

అవ. వివేకచిత్తమందు వాసనలు కలుగుటకు కారణమును జెప్పు చున్నారు.—

26. తచ్ఛిద్రేషు ప్రత్యయాన్తరాణి సంస్కారేభ్యః.

తా. వివేకజ్ఞానమునందు అంతర్ముఖమై యుండువానికి, ఆవివేకజ్ఞానము యొక్క అంతరాళమునందు బహిర్ముఖ కాలమునందు కలిగియున్న వాసనల వలన నేను, నాది, నాకు జ్ఞానము లభించినది, అను నిట్టి బహిర్ముఖసంబంధమైన అభిమానములు కలుగుచున్నది.

వి. వివేకజ్ఞానముచే అంతర్ముఖమై యుండు చిత్తమునందు అప్పు డప్పుడు బహిర్ముఖ కాలమందలి నేను నాది యను అభిమానములు కలుగు చుండును.

అవ. వాసనలను త్యజించుటకు ఉపాయమును వక్కాణించుచున్నారు.

37. హానమేషాం క్లేశవ దుక్తమ్.

తా. అవిద్యాదిక్లేశములను త్యజించినట్లు, ఈ సంస్కారముల త్యాగమును చెప్పఁబడినది.

వి. అవిద్యాదిక్లేశములను విడిచినట్లు ఈ సంస్కారములను విడువవలయును

అవ. వాసనా నిగ్రహమువలన లభించునట్టి మహా ఫలముయొక్క స్వరూపమును నిరూపించుచున్నారు.

28. ప్రసంఖ్యానేప్యకుసీదస్య సర్వథా వివేకఖ్యాతేః ధర్మమేఘస్సమాధిః.

తా. సకల తత్త్వముల నిజస్వరూపములను చక్కఁగా భావించుచు ఫలాపేక్ష లేనివానికి, సకల విధములుంగానుండు వివేకజ్ఞానమునకు పురుషార్థ సాధక మైన పుణ్యపాపములు లేని ధర్మమును వర్షించునట్టి సమాధి కలుగుచున్నది.

వి. సకల తత్త్వముల స్వరూపవివేచనవలన దేనిని అభిలషింపక సర్వతోముఖమై యుండు వివేకజ్ఞానము గలవానికి, పుణ్యపాపసంబంధములేని నిరతిశయానందరూప మైన ధర్మమేఘ మను సమాధియొక్క మహావర్షము సదా వర్షించు చున్నది. అనఁగా నిరవధిక పరమానంద సమాధి కలుగుచున్నది.

అవ. మీదఁ జెప్పఁబడినట్టి ధర్మమేఘసమాధివలన ప్రయోజన మిట్టిదని చెప్పుచున్నారు.—

29. తతః క్లేశకర్మనివృత్తిః.

తా. ఆ సమాధియొక్క దశవలన అవిద్యాదిక్లేశముల యొక్కయు పుణ్యపాపకర్మముల యొక్కయు నివృత్తి కలుగుచున్నది.

వి. ఆధర్మమేఘరూపమైన సమాధివలన, క్రమముగా సకలక్లేశకర్మములు క్షయించుచున్నది.

అవ. క్లేశకర్మనివృత్తికి తర్వాత కలుగఁ గలదానిని వక్కాణించుచున్నారు.—

30. తదా సర్వావరణమలాపేతస్య జ్ఞానస్యానంత్యాత్ జ్ఞేయమల్పమ్.

తా. అప్పుడు చిత్తమును చుట్టుకొని యుండు సకలక్లేశకర్మములనెడు కల్మషమువలన విడువఁబడిన జ్ఞానమునకు ప్రతిబంధకము లేకపోవుటంబట్టి తెలిసికొనఁదగినది స్వల్పమై యున్నది.

వి. జ్ఞానమును ఆవరించుకొని యుండునట్టి సకల క్లేశకర్మములు లేకపోయి నిరవధికమైన ఆకాశమువలె స్థిరమైన జ్ఞానముచే సుఖకరమై అడ్డుపాటులేక సకలమును తెలియుచుండును. అనఁగా సర్వజ్ఞుఁడే యగును.

అవ. ఈ జ్ఞానానంతరము కల్గుదానినిగూర్చి చెప్పుచున్నారు.—

31. తతః కృతార్థానాం పరిణామక్రమసమాప్తిర్గుణానామ్.

తా. ఆ జ్ఞానము కల్గిన అనంతరమునందు చేయఁబడునట్టి భోగాపవర్గరూప పురుషార్థములుగల సత్త్వాదిగుణములయొక్కయు, మోక్షమువఱకును కలుగు అనులోమవిలోమపరిణామములయొక్కయు, ముందు వివరించిన క్రమముయొక్క సమాప్తి కలుగుచున్నది.

వి, వివేకజ్ఞానము స్థిరమైన యనంతరమై పురుషప్రయోజనకరములైన గుణములయొక్క అనులోమవిలోమరూపపరిణామములు తీరిపోవుచున్నవి. అప్పుడు చిత్తము విశ్రాంతిని బొందును.

అవ. సత్త్వాదిగుణములయొక్క పరిణామక్రమమును నిరూపించుచున్నారు.—

32. క్షణప్రతియోగీ పరిణామాపరాన్తనిర్గ్రాహ్యః క్రమః.

తా. క్షణములే క్రమవృత్తియందు పరిణామ పరిపాకములవలనను తరువాత ముందు అనుటకు దక్కఁగాఁ దెలియఁదగినది గుణపరిణామక్రమము యున్నది.

వి. ఒకదానిని వేఱొకటి వెనుక చేయుచుండు ప్రతిక్షణములందును ప్రధానతత్త్వమగు మూలప్రకృతిని ఆధారము చేసికొని, పృథివ్యాది స్థూలభూతములవఱకును, అనులోమమగు పరిణామమునుబొందు క్రమమును; మఱియు, పరమాణ్వాది మహాభూతాంతమును, మహాభూతాది ప్రధానతత్త్వాంతమును సహా విలోమమగు పరిణామమును బొందు క్రమమును సంయుతము సత్త్వాదిగుణముల పరిణామక్రమ మనఁబడుచున్నది.

అవ. పరమపురుషార్థ స్వరూపమగు కైవల్యస్థితియొక్క స్వరూపమును నిరూపించుచున్నారు.—

౩౪. పురుషార్థగుణానాం ప్రతిప్రసవే కైవల్యాం స్వరూపప్రతిష్ఠావాచితిశక్తిరితి.

తా. భోగమోక్షరూపము లైన పురుషార్థములు గల సత్త్వాదిత్రిగుణములయొక్క పునరావృత్తిలేని విలోమపరిణామముయొక్క పరిసమాప్తిగాని, లేక పురుషునియందుండు చిత్ప్రకాశము స్వస్వరూపమయిన సచ్చిదానందమయాఖండపరిపూర్ణ మయిన పరబ్రహ్మమందు నెలకొనుట గాని, కైవల్య మనఁబడుచున్నది.

వి. పురుషార్థరూపమగు భోగాపవర్గపరిణామములు లేని సత్త్వాదిగుణముల విలోమపరిణామములయొక్క సమాప్తి కలుగుటయే ఆ నిత్యకైవల్య స్వరూపుఁడైన పురుషునకు కైవల్య మనఁబడుచున్నది. అనఁగా, పురుషునియందుండు చిత్ప్రకాశము అఖండానందపరిపూర్ణ సచ్చిదానందమయమునం దైక్య మగుట కైవల్య మనఁబడును.

ఇతి అనుపదము శాస్త్రపరిసమాప్తియొక్క అర్థమును చెప్పుచున్న దని యెఱుంగఁదగినది.

పాతంజలయోగ శాస్త్రమునందు,

కైవల్యపాదము సమాప్తము.

అమెరికన్ డైమండు ముద్రాక్షరశాల, చెన్నపురి. (24-12-40.) 500.